www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

అవి అసభ్యకరమైన పోస్టులే



ఈ విషయంలో రెండో ఆలోచనే లేదు.. వాటిని కట్టడి చేయాల్సిందే: హైకోర్టు
'సోషల్' పోస్టులు సైబర్ క్రైమ్ కిందకు వస్తాయా?.. వాదనలు వినిపించండి.. పీపీకి ఆదేశం
భార్గవ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి ప్రోద్బలంతోనే పోస్టులు.. వైసీపీ సోషల్ మీడియాలో వాళ్లే కీలకం
ప్రత్యర్థుల ప్రతిష్ఠను దిగజార్చేలా ప్రణాళికాబద్ధంగా ఆ పోస్టులను వ్యాప్తి చేశారు
మార్ఫింగ్ ఫొటోలతో మహిళల గౌరవ మర్యాదలకు భంగం: పబ్లిక్ ప్రాసిక్యూటర్ 10

పవన్ కల్యాణ్ ఫొటో మార్ఫింగ్‌పై చర్యలు తీసుకోండి.. విశాఖలో జనసేన నేతల ఫిర్యాదు 2

గురువారం | 20-3-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 334 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.2:46 తదుపరి సప్తమి, నక్షత్రం: అనూరాధ రా.11:32 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: తె.5:39 మొ., అమృతఘడియలు: ఉ.11:57-1:44, దుర్ముహూర్తం: ఉ.10:22-11:10, మ.3:10-3:58, రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 6:22, సూర్యాస్తమయం: 6:22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



క్రూ-9 డ్రాగన్ నుంచి బయటకు వచ్చిన అనంతరం సునీతా విలియమ్స్ విజయ సంకేతం

క్షేమంగా పుడమికి

9 నెలల అనంతరం భూమ్మీదికి సునీతా విలియమ్స్
అంతరిక్షం నుంచి తిరిగొచ్చిన మరో ముగ్గురు
ఫ్లోరిడా సమీపంలో సముద్రంలో దిగిన క్రూ డ్రాగన్
తెల్లవారుజామున 3:27 గంటలకు సేఫ్ ల్యాండింగ్
వ్యోమగాములకు స్వాగతం పలుకుతూ ట్రంప్ పోస్ట్
అధ్యక్షుడు మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు: వైట్‌హౌస్
రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ అభినందనలు

న్యూఢిల్లీ, మార్చి 19: తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎనిమిది రోజుల పర్యటన నిమిత్తం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి 286 రోజులపాటు అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ఎట్టకేలకు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. ఆమెతో పాటు నాసాకు చెందిన బుచ్ విల్మోర్, కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో దిగారు. అంతరిక్షం నుంచి 17 గంటల ప్రయాణం అనంతరం స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-9 డ్రాగన్ వారిని క్షేమంగా భూమిపైకి తీసుకొచ్చింది. కేవలం 8 రోజుల యాత్ర కోసం గతేడాది జూన్ 5న బోయింగ్

మిగతా 2వ పేజీలో...

గేట్స్ @ ఏపీ

గేట్స్ ఫౌండేషన్‌తో ప్రభుత్వం ఒప్పందం

విద్య, వైద్యం, సాగు రంగాల్లో టెక్నాలజీ వినియోగానికి సహకారం
ఢిల్లీలో బిల్ గేట్స్‌తో చంద్రబాబు భేటీ
ఈ ఒప్పందం చరిత్రాత్మకం
స్వర్ణాంధ్ర సాధనలో కీలక పాత్ర
అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆధునిక టెక్నాలజీ వినియోగం
సమర్థంగా, వేగవంతంగా సేవలు
త్వరలో రాష్ట్రానికి బిల్ గేట్స్ రాక
1995 నుంచి స్నేహ బంధం: సీఎం
టెక్నాలజీ వినియోగంలో చంద్రబాబు దార్శనికుడు: గేట్స్



ఢిల్లీలో బిల్‌గేట్స్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో 'గేట్స్ ఫౌండేషన్' చేతులు కలిపింది. కీలక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, సమర్థంగా సేవలందించడంలో ప్రభుత్వానికి సహకరించేందుకు ముందుకు వచ్చింది. ఆరోగ్య సంరక్షణ, మెడికల్ టెక్నాలజీ, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీ వినియోగం పెంపొందించడం, కృత్రిమ మేధ (ఏఐ) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఉమ్మడి కార్యాచరణ ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ నిర్ణయించాయి. బుధవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, గేట్స్ ఫౌండేషన్ అధినేత, మైక్రోసాఫ్ట్ సంస్థ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సమావేశమయ్యారు. దాదాపు గంట సేపు కీలక చర్చలు జరిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ అవగాహన ఒప్పంద పత్రం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ఆయా

మిగతా 12వ పేజీలో...

జగమంత అసైన్డ్ అక్రమాలు

పెద్దల కోసం యథేచ్ఛగా ఫ్రీహోల్డ్
ఆ భూములు 5.74 లక్షల ఎకరాలు
2.69 లక్షల ఎకరాలకు రికార్డే లేదు
వైసీపీ హయాంలో భూబాగోతం 10
కేబినెట్ సబ్-కమిటీకి రెవెన్యూ నివేదిక
దిద్దుబాటుకు ఎనిమిది ప్రత్యామ్నాయాలు

ఎస్సీ వర్గీకరణపై నేడే తీర్మానం!

అసెంబ్లీలో ప్రత్యేక చర్చ.. సీఎం ప్రసంగం
కేంద్రం ఆమోదం కోరుతూ తీర్మానం? 11
ఆర్డినెన్స్ ద్వారా అయినా అమలుకు రెడీ





10

వైసీపీకి మరో ఎమ్మెల్సీ గుడ్‌బై

మర్రి రాజశేఖర్ రాజీనామా

జగన్ తీరుపై అసంతృప్తితో ఇప్పటికి ఐదుగురు ఎమ్మెల్సీల రాజీనామాలు



12

బతుకుతానో లేదో!

వైసీపీ నుంచి ప్రాణ హాని ఉంది..
జైల్లో తోటి నిందితులే భయపెట్టారు!
వివేకా హత్య కేసులో ఏ2 సునీల్ ఆందోళన
కడప ఎస్పీకి లిఖితపూర్వక ఫిర్యాదు
'హత్య' సినిమా నిలిపివేయాలని డిమాండ్

రేషన్ కార్డులు కాదు.. పాపులర్ కార్డులు!

2

తలసరి ఆదాయం పెరుగుతోంది.. అయినా
75% జనాభా దారిద్ర్య రేఖకు దిగువనా?
సబ్సిడీలు అనర్హుల జేబులు నింపరాదు: సుప్రీం

విజయ్‌కుమార్‌రెడ్డికి ఏసీబీ నోటీసు

2

జగన్ మీడియాకు ప్రకటనలపై విచారణకు రావాలని ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్‌కు పిలుపు

గేట్‌లో కందుకూరు వాసి గ్రేట్

సాదినేని నిఖిల్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్
గేట్-2025లో మెరిసిన తెలుగు విద్యార్థులు
జాతీయ స్థాయిలో 1, 25, 28వ ర్యాంకులు 2



మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా బస్సులకు జెండా ఊపుతున్న మంత్రులు లోకేశ్, కొల్లు, ఎమ్మెల్యే వెంకటరావు, సంస్థ ప్రతినిధులు

ఏపీలో పారిశ్రామిక నవశకం

అశోక్ లేల్యాండ్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

వైసీపీ పాలనలో పారిశ్రామికరంగం దెబ్బతింది
పలు సంస్థలు రాష్ట్రం వదిలి వెళ్లిపోయాయి
చంద్రబాబు సీఎం కావడంతో మళ్లీ ఏపీ బ్రాండ్
పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పిస్తున్నాం
వ్యాపార అనుకూల వాతావరణం సృష్టిస్తున్నాం
ప్రభుత్వంపై నమ్మకంతో 7 లక్షల కోట్ల పెట్టుబడులు
ఎస్క్రో ద్వారా ప్రోత్సాహకాలు నేరుగా జమ: లోకేశ్

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అశోక్ లేల్యాండ్ ప్రారంభంతో ఏపీలో పారిశ్రామిక నవశకం ప్రారంభమైందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ సంస్థ ప్రారంభం కావటం రాష్ట్ర పారిశ్రామికరంగ భవిష్యత్తుకు

మిగతా 12వ పేజీలో...

ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్

వ్యవసాయం,పరిశ్రమలు, విపత్తులు, పాలనలో టెక్నాలజీ వాడకంపై సలహాలు
మరో ముగ్గురు ప్రముఖులకూ అవకాశం.. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్‌కు జి.సతీశ్‌రెడ్డి
హ్యాండ్‌లూమ్స్ హబ్‌కు సుచిత్రా ఎల్లా.. ఫోరెన్సిక్ సైన్స్‌కు కేపీసీ గాంధీ
కేబినెట్ హోదాలో గౌరవ సలహాదారులుగా నియామకం 11

రెండేళ్లలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ఉపాధ్యాయుల బదిలీల చట్టం చరిత్రాత్మకం
ఇక పారదర్శకంగా టీచర్ల సీనియారిటీ జాబితా
వైసీపీ హయాంలో అడ్డగోలుగా బదిలీలు: లోకేశ్
బిల్లుకు ఉభయ సభల ఆమోదం 11



క్షేమంగా పుడమికి

(మొదటి పేజీ తరువాయి)

స్టార్ లైనర్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, బుచ్ విల్మోర్.. సాంకేతిక కారణాలతో 286 రోజులు అక్కడే గడపాల్సి వచ్చింది. కాగా, సముద్ర జలాల్లో దిగిన క్రూ డ్రాగన్‌ను నాసా బృందం సురక్షితంగా రికవరీ నౌకలోకి చేర్చింది. అనంతరం క్రూ తలుపు తెరచి ఒక్కొక్కరినీ బయటకు తీసింది. క్యాప్సూల్ నుంచి బయటకు రాగానే సునీతా విలియమ్స్ చిరునవ్వులు చిందిస్తూ, చేతులూపుతూ అభివాదం చేసింది. నాసా బృందం వెంటనే వారిని రికవరీ నౌకలోనే వైద్యసేవలకు తరలించింది.

భూమికి ప్రయాణం సాగిందిలా..

భూమికి 409 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తిరిగి భూమికి చేరుకోవడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఏ మాత్రం తేడా వచ్చినా నలుగురు వ్యోమగాముల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్, నిక్ హేగ్, గోర్బునోవ్‌లను ఐఎస్ఎస్ నుంచి భూమిపైకి తీసుకొచ్చే క్రమంలో కాస్త ఉత్కంఠ రేగినా.. నాసా, స్పేస్ఎక్స్ చివరకు ఈ ప్రక్రియను సురక్షితంగా ముగించింది. క్రూ-9 డ్రాగన్ భూమికి బయల్దేరే ముందు ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములకు సునీత, విల్మోర్, నిక్ హేగ్, గోర్బునోవ్ వీడ్కోలు పలికారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8:15 గంటలకు క్రూ డ్రాగన్ తలుపును మూసివేయగా.. 10:35 గంటలకు క్రూ ఐఎస్ఎస్ నుంచి విడిపోయింది. భూ దిశగా 17 గంటల ప్రయాణం మొదలుపెట్టింది. భూవాతావరణంలోకి ప్రవేశించే క్రమంలో వ్యోమనౌకలోని దిగువ (ట్రంక్) భాగాన్ని అక్కడే వదిలిపెట్టింది. ఆ తర్వాత భూమిపై ల్యాండింగ్ ప్రదేశం దిశగా క్రూ డ్రాగన్ ముందు భాగంలోని నాలుగు డ్రాకో ఇంజన్లు మండుకోవడం మొదలైంది. ఆ తర్వాత భూ వాతావరణంలోకి ప్రవేశం కోసం కోన్ భాగాన్ని వ్యోమనౌక మూసివేసింది. భూవాతావరణంలోకి రీ ఎంట్రీ సమయంలో తలెత్తే తీవ్రస్థాయి వేడి నుంచి వ్యోమగాములను సురక్షితంగా ఉంచే వ్యవస్థను ఆన్ చేసింది.

1600 డిగ్రీల వేడి.. కాపాడిన పికా..!

రీ ఎంట్రీ సమయంలో వ్యోమనౌక గంటకు 28,800 కి.మీ వేగంతో భూవాతవరణంలోకి ప్రవేశించింది. ఆ రాపిడి కారణంగా ఏకంగా 1600 డిగ్రీల వేడి ఉత్పన్నమై వ్యోమనౌక చుట్టూ ప్లాస్మా పేరుకుపోయింది. దాంతో వ్యోమనౌకతో కొద్దిసేపు కమ్యూనికేషన్ తెగిపోయి కాస్త ఉత్కంఠ ఏర్పడింది. అయితే డ్రాగన్ క్యాప్సూల్‌లో నాసా ఫినోలిక్-ఇంప్రెగ్నేటెడ్ కార్బన్ అబ్లేటర్ (పికా) అనే హీట్ రెసిస్టెంట్ పదార్థాన్ని వాడింది. వ్యోమనౌక చుట్టూ ఉన్న ఈ ఉష్ణ కవచం 1600 డిగ్రీల వేడిని తట్టుకుని నిలబడింది. ఈ కవచమే లోపల ఉన్నవారికి వేడి నుంచి రక్షణ ఇచ్చింది. కాసేపటికి కమాండర్ నిక్ హేగ్ మాట్లాడడంతో నాసా కమాండ్ సెంటర్‌లో ఉన్నవారిలో ఉత్కంఠ వీడింది.

ట్రంప్ మాట నిలబెట్టుకున్నారు: వైట్‌హౌస్

అంతరిక్షం నుంచి వ్యోమగాములు క్షేమంగా భూమికి చేరడంపై వైట్‌హౌస్ ఎక్స్ వేదికగా స్పందించింది. 'తొమ్మిది నెలలుగా అంతరిక్షంలో చిక్కుకున్న వారిని భూమిపైకి తీసుకొస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటిచ్చారు. ఆ మాట నిలబెట్టుకున్నారు' అని ట్వీట్ చేసింది. ఈ సందర్భంగా ఎలాన్ మస్క్‌కు, స్పేస్ ఎక్స్ బృందానికి అభినందనలు తెలిపింది. కాగా, వ్యోమగాముల రాకపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. వారికి స్వాగతం పలికిన ట్రంప్.. ట్రూత్ సోషల్ వేదికగా వ్యోమగాముల ఫొటోలను పోస్టు చేశారు. ఈ సందర్భంగా స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు.



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి చేరుకుంటున్న సునీత విలియమ్స్, మరో ముగ్గురు వ్యోమగాములు

పుడమికి స్వాగతం: మోదీ

భారత సంతతి వ్యోమగామి సునీత క్షేమంగా భూమిపైకి తిరిగిరావడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో చైర్మన్ నారాయణన్, ఇతర రాజకీయ, సినీ ప్రముఖులు సైతం అభినందలనలు తెలియజేశారు. ఈ మిషన్ కోసం సునీత చూపిన దృఢ సంకల్పాన్ని, సమష్టి కృషిని రాష్ట్రపతి ముర్ము కొనియాడారు. మోదీ కూడా సునీతకు స్వాగతం పలుకుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'వెల్‌కమ్ బ్యాక్ క్రూ-9. ఈ పుడమి మిమ్మల్ని ఎంతో మిస్ అయింది. సునీతా విలియమ్స్ బృందం ధైర్యానికి, స్ఫూర్తికి పరీక్ష ఎదురైంది. వారు సురక్షితంగా తిరిగిరావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని మోదీ పేర్కొన్నారు. కాగా, సునీత క్షేమంగా తిరిగిరావడం నాసా, స్పేస్ఎక్స్, అంతరిక్ష పరిశోధనల పట్ల అమెరికాకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. సునీతా విలియమ్స్, విల్మోర్ సురక్షితంగా భూమికి తిరిగి రావడం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవి కూడా సునీతను ఎక్స్ వేదికగా అభినందించారు.

గంటకు 560 కి.మీ. వేగంతో దూసుకొచ్చి

సముద్ర జలాలకు 18 వేల అడుగుల ఎత్తులో ఉండగా.. వ్యోమనౌకలోని రెండు డ్రోగ్ పారాచూట్లు విచ్చుకున్నాయి. ఆ సమయంలో వ్యోమనౌక గంటకు 560 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. డ్రోగ్‌చూట్లు సమర్థంగా పనిచేయడంతో క్రమంగా దాని వేగం తగ్గిపోయింది. ఈ వేగం గంటకు 190 కి.మీ.కి చేరుకోగానే సాగర జలాల నుంచి 6,500 మీటర్ల ఎత్తులో రెండు ప్రధాన పారాచూట్లు విచ్చుకున్నాయి. డ్రోగ్‌చూట్లు, పారాచూట్లు క్రూ డ్రాగన్ వేగాన్ని సమర్థంగా తగ్గించి గంటకు 25 కి.మీ. వేగానికి తీసుకురావడంతో ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాల్లో క్రూ నెమ్మదిగా దిగింది. సహాయక సిబ్బంది స్పీడ్ బోట్లలో నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకుని క్రూ నుంచి విష వాయువులేవీ విడుదల కావడంలేదని నిర్ధారించుకున్నాక.. దాన్ని రికవరీ కోసం సిద్ధంగా ఉంచిన మేగన్ నౌకపైకి చేర్చారు. ఆ తర్వాత స్పేస్ ఎక్స్ సిబ్బంది లోపల ఉన్న నలుగురిని వరుసగా బయటకు తీసుకొచ్చారు. తొలుత కమాండర్ నిక్ హేగ్.. ఆ తర్వాత గోర్బునోవ్, సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ క్రూ నుంచి బయటకు వచ్చారు.



సునీతకు ఎదురయ్యే సమస్యలు..

అంతరిక్షంలో సుదీర్ఘకాలం గడిపి వచ్చిన వారు తిరిగి ఇక్కడి భూవాతావరణానికి అలవాటు పడడం కష్టమే. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు.. కాబట్టి శరీరం తేలికగా మారుతుంది. సునీత అంతరిక్షంలో ఎక్కువకాలం ఉండడం వల్ల ఆమె ఎముకలు పెళుసు బారి, కండరాలు క్షీణించి ఉంటాయి. రేడియేషన్ కారణంగా దృష్టి లోపం వంటి సవాళ్లను ఎదుర్కోవచ్చు. రక్త ప్రసరణలోనూ తేడా వస్తుంది. రక్తం గడ్డకట్టే ప్రమాదం కూడా ఉంది. ఈ సమయంలో వైద్యుల పర్యవేక్షణలో సరైన జాగ్రత్తలు తీసుకుని మళ్లీ భూవాతావరణానికి అలవాటు పడేందుకు నెలల సమయం పడుతుంది.

సునీత పూర్వీకుల గ్రామంలో సంబరాలు

సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి క్షేమంగా భూమికి చేరుకోవడంతో గుజరాత్‌లో ఉన్న ఆమె పూర్వీకుల గ్రామంలో సంబరాలు మిన్నంటాయి. మెహసానా జిల్లాలోని ఝులాసన్ గ్రామంలో ఆమె బంధువులు, గ్రామస్తులు బాణసంచా కాల్చి, డ్యాన్స్‌లు చేసి సంబరాలు చేసుకున్నారు.

కుటుంబ నేపథ్యం ఇదీ..

భారత సంతతికి చెందిన న్యూరోఅటానమిస్ట్ దీపక్ పాండ్యా, స్లోవీన్ అమెరికన్ ఉర్సులైన్ బోనీల దంపతులకు 1965 సెప్టెంబరు 19న ఒహాయోలో సునీత జన్మించారు. పాండ్యా దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. సునీత చిన్నకుమార్తె. దీపక్ పాండ్యా గుజరాత్‌లో జన్మించారు. మసాచుసెట్స్‌లో 1983లో హైస్కూల్ విద్యను పూర్తిచేసిన సునీత.. 1987లో యూఎస్ నావల్ అకాడమీ నుంచి బీఎస్సీ పూర్తిచేశారు. 1995లో ఫ్లోరిడా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. 1997లో అమెరికా మిలటరీలో చేరారు. 1998లో నాసా వ్యోమగామిగా ఎంపికయ్యారు. కాగా, సునీత విలియమ్స్ త్వరలోనే భారత్‌కు రానుందని ఆమె బంధువు పాల్గుణి పాండ్య సూచనప్రాయంగా చెప్పారు. గుజరాత్‌లోని ఝులాసన్‌లో ఉండే పాల్గుణి ఇప్పుడిక సునీతకు కుటుంబంతో గడిపే సమయం దొరుకుతుందని ఆయన అన్నారు.

అంతరిక్షంలో ఏం తిన్నారు.. 9 నెలలు ఎలా ఉన్నారు?

ఎనిమిది రోజుల యాత్ర కోసం ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, విల్మోర్.. సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే తొమ్మిది నెలలు ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో వారు అక్కడ ఏం తిన్నారు.. ఇన్నాళ్లు ఎలా ఉండగలిగారు అనే సందేహాలు అందరికీ వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది నవంబరు 18న న్యూయార్క్ పోస్ట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సునీత, విల్మోర్.. ఐఎస్ఎస్‌లో పిజ్జా, రోస్ట్ చికెన్, రొయ్యలు ఆహారంగా తీసుకున్నారు. వ్యోమగాములకు మిల్క్‌పౌడర్, పిజ్జాలు, రోస్ట్ చికెన్, రొయ్యలు, ట్యూనా ఫిష్‌తోపాటు తృణధాన్యాలు అందుబాటులో ఉంచుతామని నాసా అధికారి ఒకరు వెల్లడించారు. నాసా వైద్యులు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 9న నాసా విడుదల చేసిన ఫొటోలో విల్మోర్, సునీత ఐఎస్ఎస్‌లో భోజనం చేస్తున్నట్టు కనిపించింది. మొదట్లో వారికి తాజా పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉండేవని, కానీ మూడు నెలల్లోనే అవి అయిపోయాయని నాసా అధికారి పేర్కొన్నారు. మాసం, గుడ్లు భూమిపై నుంచి ముందే వండి పంపిస్తారని, అక్కడ తినేముందు వేడి చేసుకుంటారని తెలిపారు. ఐఎస్ఎస్‌లో 530 గ్యాలన్ల మంచినీటి ట్యాంకు ఉంటుందని, ఆ నీటిని వాడుకుంటారని చెప్పారు. వ్యోమగాముల మూత్రం, చెమటను రీసైకిల్ చేసి మంచినీటిగా మార్చే వ్యవస్థ ఐఎస్ఎస్‌లో ఉందని ఆయన తెలిపారు.

లోకం తీరు

ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానం



పాల ఉత్పత్తికి దన్ను

- 2 పథకాల వ్యయాలు 6,190 కోట్లకు పెంపు
- రూ.2వేలలోపు యూపీఐ లావాదేవీల ప్రోత్సాహానికి రూ.1,500 కోట్లు
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 19: దేశంలో పాల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2 పథకాలకు వ్యయాలను రూ.6,190 కోట్లకు పెంచింది. ఈ మేరకు సవరించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం), నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పీడీడీ)లకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసినట్టు కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం తెలిపారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ పశుసంవర్థక రంగంలో వృద్ధిని పెంచేందుకుగాను సవరించిన ఆర్‌జీఎంకు ఆమోదం తెలిపిందని కేంద్రం మంత్రి తెలిపారు. రూ.1,000 కోట్ల అదనపు వ్యయంతో సవరించిన ఆర్‌జీఎంను అమలు చేస్తారు. దీంతో 15వ ఆర్థిక సంఘం కాలంలో (2021-22 నుంచి 2025-26) మొత్తం వ్యయం రూ.3,400 కోట్లకు చేరుతుంది. సవరించిన ఎన్‌పీడీడీకి రూ.1,000 కోట్ల అదనపు కేటాయింపుతో 15వ ఆర్థిక సంఘం కాలంలో మొత్తం బడ్జెట్ రూ.2,790 కోట్లకు చేరుతుంది. కాగా రూ.2వేలలోపు బీమ్-యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించడానికిగాను దాదాపు రూ.1,500 కోట్ల విలువైన ప్రోత్సాహకాల పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఇది 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు వర్తిస్తుంది. ఇదిలా ఉండగా.. మహారాష్ట్రలో జేఎన్‌పీఏ పోర్ట్ (పగోటె) నుంచి చౌక్ (29.219కిలో మీటర్లు) వరకు 6 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కాగా అసోంలో రూ.10,601.4కోట్లతో యూరియా ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



నిఖిల్ చౌదరి



సుధీర్ వర్మ



కందా చల్లారావు

'గేట్'లో కందుకూరు వాసి గ్రేట్!

- సాదినేని నిఖిల్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దేశంలోని ఐఐటీలు, పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2025 ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన సాదినేని అఖిల్ చౌదరి (డేటా సైన్స్ విభాగం) ఆలిండియా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ సాదినేని శ్రీనివాసులు కుమారుడైన నిఖిల్ ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అయితే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై ఆసక్తితో మద్రాస్ ఐఐటీ దూరవిద్య ద్వారా ఆ కోర్సు పూర్తి చేశారు. చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూనే ఏఐలో ఎంటెక్ చేయాలన్న లక్ష్యంతో ఆరు నెలలు గేట్ శిక్షణ తీసుకున్నారు. బుధవారం వెల్లడైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో మెరిశారు. వైద్య రంగంలో ఏఐ ప్రభావంపై పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని నిఖిల్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వంజంగికి చెందిన పైడి పూజిత 25వ ర్యాంకు సాధించారు. ఆమె నాగపూర్‌లోని వీఎన్ఐటీలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. సొంతబొమ్మాళికి చెందిన కొన్న వినోద్‌కుమార్ జాతీయస్థాయిలో 28వ ర్యాంకు సాధించారు. వినోద్ ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. అలాగే శ్రీకాకుళానికి చెందిన అనంతపట్నాయకుని మాన్య ఆలిండియా 197వ ర్యాంకు, సోంపేటకు చెందిన బల్ల సాయితనూజ 396వ ర్యాంకు సాధించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం చెరుకుమిల్లి విద్యార్థి సుధీర్ వర్మ కంప్యూటర్ సైన్స్‌లో 56వ ర్యాంకు సాధించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన కందా చెల్లారావు ఆలిండియాలో 111వ ర్యాంకు సాధించాడు. ఇక, గేట్ -2025 ఫలితాలను www.iitr.ac.in లేదా gate2025.iitr.ac.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. ఈ నెల 28 నుంచి మే 31వ తేదీ వరకు స్కోర్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

జైల్లో కుర్చీ ఇవ్వలేదు.. పరుపు 2గంటలే ఇచ్చారు

- కోర్టు ఆదేశాలను అధికారులు పాటించట్లేదు.. కోర్టుకు వంశీ

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): "కోర్టు ఇచ్చిన ఆదేశాలను జైలు అధికారులు పాటించడం లేదు. కుర్చీ ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇనుప మంచం మాత్రం ఏర్పాటు చేశారు. దానిపై పరుపును రెండు గంటలు ఇచ్చి తీసేశారు. ఈ సదుపాయాలు కల్పించేలా జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వండి" అని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తరపున న్యాయవాది వి.దేవీ సత్యశ్రీ విజయవాడ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

పవన్ ఫొటో మార్ఫింగ్‌పై జనసేన ఫిర్యాదు

గాజువాక(విశాఖ), మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ ఫొటోను మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌కు బుధవారం జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు నేతృత్వంలో నాయకులు ఫిర్యాదు చేశారు.

పోసాని పోలీస్ కస్టడీ పిటిషన్ కొట్టివేత

నరసరావుపేట లీగల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పోసాని కృష్ణమురళిని కస్టడీకి కోరుతూ చేసిన పిటిషన్‌ను స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి, ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ కొట్టివేశారు. బాబు, పవన్, లోకేశ్‌లపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై టీడీపీ నేత కిరణ్ ఫిర్యాదుతో నమోదైన కేసులో కస్టడీకి కోరారు.

సంరక్షణ కొరవడితే 'గిఫ్ట్' రద్దు

- ఆ హక్కు వృద్ధ తల్లిదండ్రులకు ఉంది
- మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని పెద్దవాళ్ల నుంచి ఆస్తులు తీసుకుని, వారి ఆలనాపాలన చూడని పిల్లలు, బంధువులకు మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. తమకు సరైన సంరక్షణ దొరకడం లేదని భావిస్తే తాము రాసిన సెటిల్‌మెంట్ డీడ్‌లను, గిఫ్ట్ డీడ్‌లను ట్రైబ్యునల్ ద్వారా రద్దు చేసుకోవచ్చునని కీలక తీర్పు ఇచ్చింది. 'నన్ను బాగా చూసుకుంటే ఇంటిలో, పొలంలో, ఆస్తిలో భాగం ఇస్తాను' అని సాధారణంగా సెటిల్‌మెంట్ డీడ్‌ల్లో ప్రస్తావిస్తుంటారు. అయితే, అటువంటి ప్రస్తావన చేయకపోయినా వాటిని రద్దు చేసుకోవచ్చని జస్టిస్ ఎస్ఎమ్ సుబ్రమణియమ్, జస్టిస్ కె. రాజశేఖర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. మరణించిన తన అత్త ఎస్. నాగలక్ష్మికు చెందిన ఆస్తి విషయంలో ఆమె కోడలు ఎస్. మాల వేసిన పిటిషన్‌ను తాజాగా కోర్టు కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే.. కుమారుడు కేశవన్‌కు నాగలక్ష్మి సెటిల్‌మెంట్ డీడ్ రాశారు. అవసానదశలో తన మంచిచెడ్డలు కుమారుడు చూస్తాడనుకుంటే అతను ఆమె నమ్మకాన్ని వమ్ము చేశాడు. అతడు మరణించిన తర్వాత కోడలు అత్తను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో కుమారుడికి నాగలక్ష్మి రాసిన సెటిల్‌మెంట్ డీడ్‌ను బాధితురాలి విజ్ఞప్తిపై ఆర్డీవో రద్దు చేశారు. కోడలు మాల దీనికి వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు. విచారణ జరుగుతుండగానే నాగలక్ష్మి మరణించారు. కోడలు వేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి జీకే ఇలంతిరయాన్ తోసిపుచ్చారు. ఆ తర్వాత ఆమె చేసిన అప్పీలుపై న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, కే రాజశేఖర్‌తోకూడిన మద్రాసు హైకోర్టు ధర్మాసనం విచారించింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ తీర్పు వెలువరించారు.

పొలం నుంచి సొంతూరికి...

- 10 పరీక్షలు రాయడానికి విద్యార్థినికి అవకాశం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన మంత్రి లోకేశ్

గుంటూరు(విద్య), కోసిగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 'పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి పొలంలో' అంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన మానవీయ కథనానికి మంత్రి లోకేశ్ స్పందించారు. విద్యార్థిని పరీక్షకు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం విద్య, కార్మిక శాఖల అధికారులను హుటాహుటిన పేరేచర్ల పంపించి విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులతో మాట్లాడించారు. దీంతో విద్యార్థిని బుధవారం సాయంత్రం గుంటూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరింది. కర్నూలు జిల్లా కోసిగి మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన సన్నక్కి... చిన్న మారెప్ప, కమలమ్మ దంపతుల కుమార్తె. ఆమె 10వ తరగతి విద్యార్థిని. సన్నక్కి తల్లిదండ్రులతో పాటు గుంటూరులోని పేరేచర్ల గ్రామంలో మిరప పంట కోతకు కూలీగా పని చేస్తోంది. విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనంగా ప్రచురించింది. దీనిపై మంత్రి లోకేశ్ స్పందించడంతో అధికారులు పొలం బాట పట్టారు. తల్లిదండ్రులతో మాట్లాడారు. పదో తరగతి మూడో పరీక్ష కోసిగిలో రాసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే విద్యార్థిని ఫీజు చెల్లించినందున కొత్తగా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

రేషన్ కార్డులు కాదు.. పాపులర్ కార్డులు!

- తలసరి ఆదాయం పెరుగుతుంటే 75% జనాభా దారిద్ర్య రేఖకు దిగువనా?
- సుప్రీంకోర్టు తీవ్ర ఆక్షేపణ

న్యూఢిల్లీ, మార్చి 19: 'అభివృద్ధి సూచీ గురించి అడిగితే.. తలసరి ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిందని రాష్ట్రాలు చెబుతున్నాయి.. అదే సబ్సిడీల విషయానికొస్తే మాత్రం 75% జనాభా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని అంటున్నాయి.. రేషన్ కార్డులు పాపులర్ కార్డులుగా మారాయి' అని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో వలస కార్మికులకు ల సమస్యలను సుమోటో కేసుగా పరిగణించి కోర్టు విచారణ చేపట్టింది. ఆ అంశంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌ల ద్విసభ్య ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. 'సబ్సిడీల ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకే దక్కాలి. పేదలకు ఉద్దేశించిన రాయితీలు అనర్హుల జేబులను నింపుతున్నాయా అన్నదే మా ఆందోళన. రాష్ట్రాలు మేం ఎన్నో రేషన్ కార్డులు జారీచేశామని చెబుతున్నాయి. మీ అభివృద్ధి గురించి చెప్పండని అడిగితే.. కొన్ని రాష్ట్రాలు తమ తలసరి ఆదాయం పెరుగుతోందని చెబుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి (బీపీఎల్) గురించి అడిగితేనేమో.. 75% బీపీఎల్ కుటుంబాలేనని అంటున్నాయి. రెండూ పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి. అసలైన లబ్ధిదారులకే ప్రయోజనాలు అందేలా చూడాలి' అని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొందరు దరఖాస్తుదారుల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ప్రజల ఆదాయంలో అసమానతల కారణంగానే ఈ తేడా కనిపిస్తోందని తెలిపారు. 'ప్రభుత్వ ఈ-శ్రమ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న పేద వలస కూలీలు సుమారు 8 కోట్ల వ రకు ఉన్నారు. వారందరికీ ఉచితం గా రేషన్ అందించాల్సిన అవసరం ఉంది' అని తెలిపారు. జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. రేషన్ కార్డుల జారీలో రాజకీయ ప్రమేయం ఉండదని ఆశిస్తున్నామని అన్నారు. కేం ద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భట్టి స్పందిస్తూ.. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద దేశంలో 81.35 కోట్ల మందికి కేంద్రం రేషన్ అందిస్తోందని తెలిపారు. ఇలాంటి పథకం కిందే మరో 11 కోట్ల మందికి లబ్ధి చేకూరుస్తోందన్నారు. దరిమిలా ఉచిత రేషన్ పంపిణీ స్థితిగతులపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదావేసింది.



భర్తను చంపి, ముక్కలు చేసి.. సిమెంట్ డ్రమ్ములో వేసి..

ప్రియుడితో కలిసి భార్య కిరాతకం

మేరఠ్, మార్చి 19: తన కంటే వయస్సులో చిన్నవాడితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వివాహిత.. ఆ సంబంధం కోసం ప్రేమించి పెళ్లాడిన వ్యక్తినే అత్యంత కిరాతకంగా చంపేసింది. కూతురి పుట్టినరోజు కోసం లండన్ నుంచి ఇంటికొచ్చిన భర్తను ప్రియుడితో కలిసి కత్తితో పొడిచి చంపేసింది. ఆపై, భర్త శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని తడి సిమెంట్‌తో నింపిన డ్రమ్ములో వేసి అత్యంత రాక్షసంగా వ్యవహరించింది. చివరకు పోలీసులకు చిక్కింది.

ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో మార్చి 4న జరిగిన ఈ ఘటన 14 రోజుల తర్వాత మంగళవారం బయటపడింది. ఈ దారుణ ఘటనలో సౌరభ్ రాజ్‌పుత్(29) అనే మర్చంట్ నేవీ అధికారి.. తన భార్య ముస్కాన్ రస్తోగి(27), ఆమె ప్రియుడు సాహిల్(25) చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేరఠ్‌కు చెందిన సౌరభ్, ముస్కాన్ 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యతో ఎక్కువ సమయం గడపాలనే ఆలోచనతో పెళ్లి అయిన కొన్నాళ్లకు సౌరభ్ తన మర్చంట్ నేవీ ఉద్యోగాన్ని వదిలేశాడు. ఈ నిర్ణయంతో సౌరభ్ కుటుంబంలో గొడవలు జరగ్గా.. సౌరభ్ భార్యతో కలిసి మేరఠ్‌లోనే వేరు కాపురం పెట్టాడు. సౌరభ్ దంపతులకు 2019లో ఓ కుమార్తె జన్మించింది. కానీ, ముస్కాన్‌కు మరొకరితో వివాహేతర సంబంధం ఉందనే సంగతి బయటపడడంతో దంపతుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో భార్యకు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమైన సౌరభ్ కుమార్తె భవిష్యత్తు కోసం ఆలోచించి వెనక్కి తగ్గాడు. ఆపై, మర్చంట్ నేవీలో తిరిగి చేరేందుకు 2023లో లండన్ వెళ్లాడు. అయితే, ఫిబ్రవరి 28న తన కుమార్తె ఆరో పుట్టిన రోజు సందర్భంగా 2025 ఫిబ్రవరి 24న సౌరభ్ ఇంటికి తిరిగొచ్చాడు. మరోపక్క, సౌరభ్‌ను ఎలాగైనా హతమార్చాలని ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ అప్పటికే నిర్ణయించుకున్నారు. ముందస్తు పథకం ప్రకారం.. మార్చి 4న నిద్రమాత్రలు కలిపిన భోజనాన్ని ముస్కాన్ తన భర్తకు వడ్డించింది. ఆ ఆహారం తిని అతను నిద్రలోకి జారుకోగానే.. ముస్కాన్, సాహిల్ కలిసి సౌరభ్‌ను కత్తితో పొడిచి చంపేశారు. అనంతరం సౌరభ్ శరీరాన్ని దాదాపు 15 ముక్కలు చేసి.. వాటిని ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో వేసి.. తడి సిమెంట్‌తో నింపేశారు. ఆపై, ఆ డ్రమ్మును ఇంట్లోనే ఉంచేసి.. ముస్కాన్, సాహిల్ కలిసి హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీకి వెళ్లారు. తమ వెంట తీసుకెళ్లిన సౌరభ్ ఫోన్‌తో అతని సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెడుతూ తాము చేసిన కిరాతకాన్ని కప్పిపుచ్చేందుకు యత్నించారు. అయితే, ఎన్నిసార్లు ఫోన్లు చేసినా సౌరభ్ నుంచి స్పందన లేకపోవడంతో అనుమానించిన అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముస్కాన్, సాహిల్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. చేసిన ఘోరాన్ని ఒప్పుకున్నారు.

మా అమ్మాయిని ఉరి తీయండి..

భర్తను హత్య చేసిన ముస్కాన్‌కు ఉరి శిక్ష విధించాలని ఆమె తల్లిదండ్రులు విలేకరులతో అన్నారు. కోటీశ్వరుడైన సౌరభ్ తమ కుమార్తెను ఎంతో ప్రేమించాడని, అతనిని తల్లిదండ్రులకు దూరం చేసిన ముస్కాన్ చివరికి ప్రాణాలు కూడా తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విజయ్‌కుమార్‌రెడ్డికి ఏసీబీ శ్రీముఖం

- వచ్చేవారం విచారణకు రావాలని ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్‌కు పిలుపు



అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాతో పాటు ఆయనకు భజన చేసిన కొన్ని టీవీ చానళ్లు, మరిన్ని యూట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియాకు నిబంధనలు ఉల్లంఘించి రూ.వందల కోట్లు ప్రకటనల రూపంలో దోచిపెట్టిన ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డికి ఏసీబీ నోటీసులు జారీచేసింది. వచ్చేవారం గుంటూరు ఏసీబీ కార్యాలయానికి విచారణకు రావాలని అందులో పేర్కొంది. ప్రస్తుతం ఆయన కోల్‌కతాలో పనిచేస్తున్నారు. ఈ-మెయిల్ ద్వారానేగాక హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి కూడా ఏసీబీ నోటీసులు పంపింది. కేంద్ర సర్వీసుల(ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్)కు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి.. జగన్ పాదయాత్ర సమయంలోనే ఆయనకు మద్దతు ప్రకటించారు. ఆయన అధికారంలోకి వచ్చాక 2019లో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. 2024 వరకు సమాచార శాఖ కమిషనర్‌గా విచ్చలవిడి వ్యవహారాలు చేపట్టారు. జగన్ సొంత మీడియాతోపాటు అనుకూల మీడియా, భజన మీడియాకు ప్రభుత్వ ప్రకటనల రూపంలో అడ్డగోలుగా వందల కోట్లు దోచిపెట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓడించి గత ఏడాది గద్దెనెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే బాధ్యతను ప్రభుత్వం ఏసీబీకి అప్పగించింది. ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి విజయ్‌కుమార్‌రెడ్డిపై గుంటూరులో కేసు నమోదు చేశారు. వచ్చే వారంలో ఆయనతోపాటు ఇంకొందరు లబ్ధిదారులను ప్రశ్నించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.10-14/ టి.ఓ/ఇ-ప్రొక్యూర్మెంట్/2025. తేది: 17.03.2025
కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, గుంటూరు వారి కార్యాలయ పరిధిలో గ్రామ త్రాగునీటి సౌకర్యాలు కల్పనకు 5 పనులకు గాను అంచనా విలువ: రూ.129.50 లక్షలకు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు ఇ-సైటు నందు ది.20.03.2025 నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరాలను www.apeprocurement.gov.inలో చూడగలరు.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, గుంటూరు
DIPR RO No.15576/CL/ADVT/1/1/2021-22, Dt: 19.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నంబర్లు 03/2024-25 నుండి 07/2024-25 తేది: 18.03.2025
అల్లూరి సీతారామరాజు (3 పనులు), తూర్పు గోదావరి (1 పని) & పశ్చిమగోదావరి (1 పని) జిల్లాలలో అవశ్యక అవాసప్రాంతాలకు త్రాగునీటి సౌకర్యాలు కల్పించుట కొరకు 5 పనుల కొరకు JJM ప్రోగ్రామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. అంచనావ్యయం: రూ.4269.80 లక్షలు. టెండర్లను ఇప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా www.tender.apeprocurement.gov.in నుండి 24.03.2025 నుండి 07.04.2025 న మ.3 గం.వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. సంబంధిత అధికారులు: విశాఖపట్నం, ఏలూరు & కాకినాడ SE లు.
సం/- చీఫ్ ఇంజనీర్-II, RWS&S శాఖ, గొల్లపూడి, విజయవాడ.
DIPR RO.No.15583/CL/ADVT/1/1/2021-22, Dt: 19.03.2025

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

టెండరు ప్రకటన నం.: B-SG-P-ABS-03-2024-25 తేది02.02.2025కు సవరణ నం.2, తేది.15.03.2025

మీ నిర్దేశం కొరకు సవరణ వివరాలు దిగువ ఇవ్వబడినవి:
సవరించిన/కొత్తగా జోడించిన డాక్యుమెంట్ల వివరాలు:

క్ర.సం.	టెండరు డాక్యుమెంట్ల వివరణ
1	ఫీజబిలిటీ రిపోర్టు GDR SKM రివిజన్ II
2	7 RDSO Drg No. CBS 0038 R3 క్లాంపింగ్ ఏర్పాట్లు ఓపెన్ గిర్డర్ 15032025
3	7A RDSO Drg. No. CBS 0039 R బ్రాకెట్ ఏర్పాట్లు కాంపోజిట్ గిర్డర్ 15032025
4	2వ ప్రీ బిడ్ స్పష్టీకరణలు 15032025కు ప్రతిస్పందన

A0354 డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/ప్రాజెక్ట్స్/విజయవాడ
PUB/0283

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి X@SCRailwayindia. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

ఇ-వేలం ప్రకటన నం.BZA-22-2024-25

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు విజయవాడ డివిజన్‌లో పే & యూజ్ టాయిలెట్లు మరియు క్లోక్ రూమ్ కాంట్రాక్టులు అందజేయుటకు ఐఆర్ఈపీఎస్ ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ www.ireps.gov.in ద్వారా ఇ-వేలం కొరకు పద్దెనిమిది సంవత్సరాలు వయస్సు పైబడిన భారతీయులు మరియు కంపెనీలు/సంస్థలు ఆహ్వానిస్తున్నారు.

కాంట్రాక్టు రకం	వేలంలో ఆఫర్ చేయబడిన లాట్ల సంఖ్య	వేలం షెడ్యూలు తేది మరియు తెరచు సమయం
పే అండ్ యూజ్ టాయిలెట్లు	1) నిడదవోలు, 2) కాకినాడ, 3) కాకినాడ టౌన్ 4) గుడివాడ, 5) రాజమండ్రి 6) విజయవాడ- ఈస్ట్ సర్క్యులేటింగ్ ఏరియా 7) విజయవాడ పార్సిల్ కార్యాలయం సమీపాన.	22.03.2025న 11.00 గం.లకు
క్లోక్ రూమ్	1) రాజమండ్రి 2) సామర్లకోట	22.03.2025న 11.00 గం.లకు

పైన తెలిపిన ఇ-వేలాల తేదీలపై టైమ్ స్లాట్లు ఐఆర్ఈపీఎస్ ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ (www.ireps.gov.in) లో లభిస్తాయి. గమనించగలరు మరియు ఆప్రకారంగా వేలంలో పాల్గొనగలరు.
సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ
A0353
PUB/0282

అమరావతికి 31 వేల కోట్లు!

- వివిధ రూపాల్లో నిధులు వస్తున్నాయి
- పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడి

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి మొత్తం రూ.31 వేల కోట్లు వివిధ రూపాల్లో వస్తున్నాయని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. బుధవారం శాసన మండలిలో సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. అమరావతికి ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రూ.15 వేల కోట్లు రుణం ఇస్తున్నాయని, ఈ రుణంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పష్టత ఇచ్చారని తెలిపారు. ఈ నిధుల్లో గ్రాంట్ ఎంత? రుణం ఎంత అనేది చర్చించి చెబుతామన్నారు. హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు, కేఎఫ్‌డబ్ల్యూ అనే జర్మన్ బ్యాంక్ రూ.5 వేల కోట్లు లోన్ ఇస్తున్నట్లు తెలిపారు. అమరావతికి రైల్వేలైన్ ప్రాజెక్టు ఖర్చును కేంద్రమే భరిస్తుందన్నారు. అమరావతి రైల్వే ప్రాజెక్టుకు అవసరమైన భూమిని ఎలా సేకరించాలనే దానిపై చర్చిస్తున్నామని, అమరావతి డిజైన్ చేసినప్పుడే సెల్ఫ్ సస్టైనబుల్‌గా డిజైన్ చేశారని వివరించారు. ప్రస్తుతం పనులు ప్రారంభించడానికి బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించామన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులు అమరావతికి వాడకూడదనేది సీఎం చంద్రబాబు క్లియర్‌గా చెప్పారన్నారు. రాజధాని కోసం తీసుకున్న రుణాలను అమరావతి పూర్తయిన తర్వాత అక్కడి భూములతో రీపేమెంట్ చేస్తామని తెలిపారు. బ్యాంకుల ద్వారా డబ్బులు రావడానికి ఆలస్యం అవుతుందని, ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.6 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రుణాలు వచ్చిన తర్వాత బడ్జెట్ డబ్బులు క్లియర్ చేస్తామన్నారు.

ఉత్తర కోస్తాకు వర్ష సూచన

విశాఖపట్నం/అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అధిక పీడనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు వీస్తున్నాయి. బుధవారం ఉత్తర కోస్తాలో పలుచోట్ల మేఘాలు ఆవరించాయి. గురువారం ఒడిశాకు ఆనుకుని ఉత్తర కోస్తాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఉత్తర కోస్తాలో పలు చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. బుధవారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

నేడు తిరుమలకు సీఎం

- రేపు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ

తిరుమల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా గురువారం తిరుమలకు రానున్నారు. తన మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, కోడలు బ్రాహ్మణితో కలిసి శుక్రవారం శ్రీవారి దర్శనానంతరం వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. ఏటా దేవాన్ష్ జన్మదినాన వెంగమాంబ నిత్యాన్న ప్రసాద భవనంలో చంద్రబాబు కుటుంబం ఒక రోజు అన్నదానం పథకం కింద భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
సీల్డు కొటేషన్లకొరకు ప్రకటన NIT NO.25/ENG/2024-25
శ్రీ అమ్మవారి దేవస్థానం నందు ఇంజనీరింగ్ పనులకు సంబంధించి సివిల్, ఎలక్ట్రికల్, వాటర్, ట్రాన్స్‌పోర్ట్ మరియు వివిధ పనులకుగాను సీల్డు కొటేషన్లు కోరబడుచున్నవి. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో లేదా ఫోన్: 0866-2423800 ద్వారా సంప్రదించగలరు.
[illegible] https://kanakadurgamma.org [illegible]

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.139/ టి 147/ఇ/ ఇ-ప్రొక్యూర్‌మెంట్/2024-25 తేది: 17.03.2025
గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, ఏలూరు పరిధిలో O&M 25-26 & JJM (17GO) నిధుల నుండి మంజూరు కాబడిన 97 పనులకు గాను అంచనా విలువ: రూ.236.90 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. [illegible] 24.03.2025 నుండి 07.04.2025, మ.3గం.ల వరకు. [illegible] www.tender.apeprocurement.gov.inలో [illegible] ఫోన్. 9100121214.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, రూరల్ వాటర్ సప్లై & సానిటేషన్ డివిజన్, ఏలూరు
DIPR RO No.15580/CL/ADVT/1/1/2021-22, Dt: 19.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

సుమారు రూ. 337.60 లక్షల విలువ గల 3 పనులకు, [illegible] గుంటూరు జిల్లాలో & 1 [illegible] పల్నాడు జిల్లాలో 1 రహదారి [illegible] NIT No. SE(R&B)/GNT/61 to 83/2024-25, dt.10.03.2025 [illegible] www.tender.apeprocurement.gov.inలో [illegible] 27.03.2025, సా.3.30 గం.ల వరకు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు (ర.భ) వలయము, గుంటూరు
DIPR RO No.15585/CL/ADVT/1/1/2021-22, Dt: 19.03.2025

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP39TP9949	ERTIGA TOUR M BS6	2020
AP09CS1690	ETIOS LIVA D 4D GD	2013
AP16DP9763	JOHN DEERE 5310	2015
AP16TD1067	TATA ACE	2012
AP37TV2266	MARUTI DZIRE DIESEL-P	2010
AP16TD1163	TATA ACE	2012
AP27X5549	TATA LPT 1109 FBT	2008
AP16TS4596	AL DOST	2018
AP39UT5934	EICHER 480	2023
AP27TY2346	TATA LPT 3118 CUMMINS	2016
AP39VB7372	MAHINDRA ALFA BS6-P	2023
AP39VC3804	MAHINDRA ALFA BS6-P	2023
AP31TB4110	EICHER 11.10 FBT	2011
AP39UN6174	EICHER PRO 2049 BS6 FBT	2023
AP16TS6399	TATA ACE	2018
AP35R8601	ERTIGA VDI BS4 DIESEL 7 SEATER	2012
AP16FD1740	ERTIGA VDI BS4 DIESEL 7 SEATER	2018
AP04TW3109	TATA MAGIC-P	2014
AP39UR6689	TAFE MF 241	2022
AP40BB9933	SWARAJ 843 XM	2023
AP40DJ5485	TAFE 241	2024
AP39GL4102	TAFE 241	2020
AP07TW0466	TATA SE 1613	2008
AP39US6112	TAFE 241	2023
AP16TX9169	TOYOTA INNOVA-P	2008
AP16CR0582	TAFE MF 241	2014
AP07TM5015	MARUTI SWIFT DIESEL-P	2018
AP16TP0803	AL DOST PLUS	2018
AP39UR3587	SONALIKA DI 740	2022
AP16TP1159	AL DOST PLUS	2018
AP16TA9267	TATA ACE	2012
AP39UG2693	MAHINDRA ALFA BS6 CNG-P	2022
AP39UU7562	SONALIKA DI 740	2024
AP31TV6232	MARUTI DZIRE TOUR DIESEL-P	2015

AUCTION PLACE :
SHRIRAM AUTO MALL INDIA LTD., SURVEY NO. 79, MUSTABAD ROAD, KESARAPALLI - 521 102. GANNAVARAM MANDAL, KRISHNA DISTRICT, A.P.
AUCTION DATE :20-03-2025
AUCTION START :10-00 AM
Cont : **SHRIRAM FINANCE LIMITED**
D No:- 27-12-34, BSN REDDY COMPLEX 3rd Floor, Gudavallivari Street VIJAYAWADA, 0866-2579197 9704184786, 9949911574

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
దేవదాయ ధర్మాదాయ శాఖ, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానము
ఉలవపాడు గ్రామము & మండలము, S.P.S.R నెల్లూరు జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIIT.NO.P/COE/1399/2024-12, Dt:06-01-2025
పై దేవస్థానమునకు సంబంధించి కొత్త కలప రథం తయారీకి ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in ను సందర్శించి పూర్తి వివరాలు, అర్హత ప్రమాణాలు మరియు సమర్పణ మార్గదర్శకాలను తెలుసుకోవచ్చును.
తేది:20-03-2025 ఉలవపాడు | K. సుధీష్ చంద్రారెడ్డి వ్యవస్థాపక ధర్మకర్త | V. శ్రీనివాస్ కార్యనిర్వహణాధికారి సెల్: 9640149199

శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము, పెదకాకాని, గుంటూరు జిల్లా.
ఈ ప్రొక్యూర్మెంట్/సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన
ఆర్.సి.నెం.బి1/2/2025 తేది : 19.03.2025
పై దేవస్థానమునకు శానిటేషన్ సరకులు సరఫరా, తలనీలాలు సేకరణ, కొబ్బరికాయలు పూజసామాగ్రి వగైరా విక్రయించుకొను లైసెన్సు హక్కులకు 4వసారి ఈ ప్రొక్యూర్మెంట్, టెండరు కమ్ బహిరంగ వేలము ది.27.03.2025న దేవస్థాన ప్రాంగణం నందు జరుగును. ది. 20.03.2025 ఉదయం గం. 10.30 నుండి https://tender.apeprocurement.gov.in నందు టెండరు డాక్యుమెంట్స్ అందుబాటులో ఉంచటమైనది. తదుపరి వివరముల కొరకు 9491000728, 9705551825 ద్వారా కార్యాలయ పనివేళల నందు తెలుసుకొనగలరు.
సం/- జి.వి.డి.యన్. లీలాకుమార్
ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
చీఫ్ ఇంజనీర్ (సి) కార్యాలయం, APIIC Ltd., 9వ అంతస్తు, APIIC టవర్-1, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా - 522503, వెబ్: www.apiic.in
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన - పత్రికా ప్రచురణ
సం. 24/CE(N)/APIIC/2024-25 తేది: 18.03.2025
టెండరు ప్రకటన సం.24: IALA నిధులతో విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, ఐ.పి.గుర్రంపాలెంలో 7.5 మీ. అక్టాగోనల్ సింగిల్ ఆర్మ్ పోల్స్‌పై 67 నం.ల 90W LED వీధిలైట్లు ఏర్పాటు చేయుట - ECV: రూ.40,00,038/-. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 19.03.2025 ఉ.11:00 గం. బిడ్ల దాఖలుకు చివరి తేది: 02.04.2025 మ.3.00 గం. టెండరు ప్రకటన వివరాలను మరియు బిడ్ డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in లేదా http://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్ (N), APIIC Ltd., మంగళగిరి
DIPR RO No.3621PP/CL/ADVT/1/1/2021-22, Dt: 19.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆం.ప్ర. ప్రభుత్వ రంగ సంస్థ)
ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయం, APIIC లిమిటెడ్, 9వ అంతస్తు, APIIC టవర్-1, ఆటో నగర్, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా- 522503, వెబ్‌సైట్: www.apiic.in
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
టెండరు ప్రకటన సం. 31, 32/CE(C)/APIIC/2024-25 తేది: 18.03.2025.
టెండరు ప్రకటన సం.31: MSE-CDP పథకం క్రింద విశాఖపట్నం జిల్లా, [illegible] 76 సంఖ్య 90W LED స్ట్రీట్ లైట్లు [illegible] 33KV & 11KV [illegible] ECV రూ.89,32,876/-.
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.03.2025న రా.8.00 గం.ల.
బిడ్ దాఖలుకు చివరి తేది: 26.03.2025న మ.3.00 గం.ల వరకు.
టెండరు ప్రకటన సం.32: MSE-CDP [illegible] 95 సంఖ్య 90W LED [illegible] 11KV/LT [illegible]
ECV రూ. 1,15,88,416/-.
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.03.2025న రా.8.00 గం.ల.
బిడ్ దాఖలుకు చివరి తేది: 02.04.2025న మ.3.00 గం.ల వరకు.
టెండరు ప్రకటన వివరాలను మరియు బిడ్ డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in లేదా http://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్ (C), APIIC లిమిటెడ్, మంగళగిరి
DIPR RO.No.3618PP/CL/ADVT/1/1/2021-22, Dt: 19.03.2025

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ
19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి-517 503

ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ
విద్యుత్ నిలయం, సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రక్కన, ఐటిఐ రహదారి, విజయవాడ-520 008
సదా మీసేవలో...

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ
పి&టి కాలని, సీతమ్మధార, గురుద్వారా కూడలి ప్రక్కన, విశాఖపట్నం-530 013

బహిరంగ ప్రకటన

ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు రిటైల్ విద్యుత్ అమ్మకం మరియు క్రాస్ సబ్సిడి సర్‌చార్జ్ ధరలు

1) ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిఎస్ పిడిసియల్), ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిసిపిడిసియల్) మరియు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల (ఏపిఈపిడిసియల్) ఓ.పి. సంఖ్య 88, 89 మరియు 90 లో చేసిన సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు మరియు క్రాస్ సబ్సిడి సర్‌చార్జ్ (సి.యస్.యస్) ప్రతిపాదనల దాఖలు అనంతరం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆర్థిక సం. 2025-26 కొరకు రిటైల్ విద్యుత్ అమ్మకం మరియు క్రాస్ సబ్సిడి సర్‌చార్జ్ ధరలను నిర్ణయించినది.
2) కేటగిరి I (ఏ) గృహాలు-ఎల్.టి" మరియు "కేటగిరి V (ఏ) వ్యవసాయ - ఎల్.టి" లకు విద్యుత్ చట్టం, 2003 యొక్క సెక్షన్ 65 క్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడిన రాయితీని పరిగణనలోకి తీసుకొని మండలి ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు రిటైల్ విద్యుత్ అమ్మకం మరియు క్రాస్ సబ్సిడి సర్‌చార్జ్ ధరలను నిర్ణయించినది.
3) ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు నిర్ణయించిన రిటైల్ విద్యుత్ అమ్మకం ధరలు మరియు క్రాస్ సబ్సిడి సర్‌చార్జ్ ధరలు, మండలి మార్పు చేస్తే తప్ప, ఏప్రిల్ 1వ తారీఖు. 2025 మొదలుకొని ఆర్థిక సంవత్సరం 2025-26 అంతా అమలులో ఉంటాయి.

చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిఎస్‌పిడిసిఎల్)

చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిసిపిడిసిఎల్)

చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిఈపిడిసిఎల్)

అనుబంధం-I
ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు రిటైల్ విద్యుత్ అమ్మకం ధరలు

కేటగిరి	వినియోగదారుని కేటగిరి	ఎల్ టి సరఫరా: స్థిర/డిమాండ్ చార్జీలు నెలకు (రూ./హెచ్ పి లేక కెడబ్ల్యు)	ఎల్ టి సరఫరా: ఎనర్జీ చార్జీలు (రూ./యూనిట్)	బిల్లింగ్ యూనిట్	హెచ్ టి సరఫరా: స్థిర/డిమాండ్ చార్జీలు నెలకు (రూ./ కెవిఏ)	హెచ్ టి ఎనర్జీ చార్జీలు (రూ./యూనిట్): 11 కెవి	33 కెవి	132 కెవి	220 కెవి
I	గృహ వినియోగం								
	ఎ) గృహవినియోగం (టెలిస్కోపిక్)								
	0-30		1.90	kWh	-	-	-	-	-
	31-75		3.00	kWh	-	-	-	-	-
	76-125	10/kW	4.50	kWh	-	-	-	-	-
	126-225		6.00	kWh	-	-	-	-	-
	226-400		8.75	kWh	-	-	-	-	-
	>400		9.75	kWh	-	-	-	-	-
	బి) టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	-	-	kVAh	75	7.00	7.00	7.00	7.00
II	వాణిజ్యము మరియు ఇతరములు								
	ఎ (i) : వాణిజ్యము								
	0-50		5.40	kWh/kVAh					
	51-100		7.65	kWh/kVAh					
	101-300	75/kW	9.05	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65
	301-500		9.60	kWh/kVAh					
	500 యూనిట్లు పైబడి		10.15	kWh/kVAh					
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి)-పీక్ (సా॥ 6.00 నుండి రా॥ 10.00 వరకు)	-	-	kWh/kVAh		8.65	7.95	7.70	7.65
	(ii) ప్రకటనల హోర్డింగులు	100/kW	12.25	kWh/kVAh	-	-	-	-	-
	(iii) ఫంక్షన్ హాళ్ళు / ఆడిటోరియంలు	-	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25
	బి) స్టార్టప్ పవర్	-	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25
	సి) విద్యుత్ వాహనాలు (ఇవిలు) / చార్జింగ్ స్టేషన్‌లు	-	6.70	kWh/kVAh	-	6.70	6.70	6.70	6.70
	డి) గ్రీన్ పవర్	-	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25
	* గమనిక: టారిఫ్ ఉత్తర్వు యొక్క చాప్టర్-XI లోని నిబంధనలు మరియు షరతులలో సూచించిన విధముగా యల్.టి-II (ఎ) వినియోగదారులకు టిఓడి ధరలు వర్తించబడును.								
III	పరిశ్రమలు								
	(ఎ) : పరిశ్రమలు (సాధారణ)	75/kW	6.70			-	-	-	-
	# టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (అధిక గ్రిడ్ డిమాండ్) (ఫిబ్రవరి '26, మార్చి '26), (ఏప్రిల్ '25 - మే '25) & (సెప్టెంబర్ '25 - అక్టోబర్ - '25)								
	పీక్ (06-10) & (18-22) గంటలు	-	-			7.80	7.35	6.90	6.85
	ఆఫ్-పీక్ (10-15) & (00-06) గంటలు	-	-			5.55	5.10	4.65	4.60
	సాధారణం (15-18) & (22-24) గంటలు	-	-	kWh/kVAh	475	6.30	5.85	5.40	5.35
	# టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (తక్కువ గ్రిడ్ డిమాండ్) (జూన్ '25-ఆగస్ట్-'25) & (నవంబర్ '25 - జనవరి '26)								
	పీక్ (06-10) & (18-22) గంటలు	-	-			7.30	6.85	6.40	6.35
	ఆఫ్-పీక్ (10-15) & (00-06) గంటలు	-	-			5.55	5.10	4.65	4.60
	సాధారణం (15-18) & (22-24) గంటలు	-	-			6.30	5.85	5.40	5.35
	పరిశ్రమలు కాలనీలు	-	-	kWh/kVAh	-	7.00	7.00	7.00	7.00
	(బి) : సీజనల్ పరిశ్రమలు (ఆఫ్ సీజన్)	75/kW	7.45	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65
	(సి) : ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	-	-	kWh/kVAh	475	5.80	5.35	4.95	4.90
	(డి) : కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి వరకు*	20/kW	3.75	kWh	-	-	-	-	-
	*- గవర్నమెంట్ జారీ చేసిన ఉత్తర్వులు సూచిక జి.ఓ. ఆర్.టి.నెం. 75, తేది. 27-06-2018 ప్రకారం ధోబి ఘాట్లకు ఉచిత విద్యుత్ సరఫరాను విస్తరించాలి								
	# గమనిక: టారిఫ్ ఉత్తర్వు యొక్క చాప్టర్-XI లోని నిబంధనలు మరియు షరతులలో సూచించిన విధముగా యల్.టి-III (ఎ) వినియోగదారులకు టిఓడి ధరలు వర్తించబడును.								
IV	ఇన్‌స్టిట్యూషనల్								
	(ఎ) : యుటిలిటీస్ (వీధి దీపాలు, యన్.టి.ఆర్ సుజల పథకం, సిపిడబ్ల్యూయస్ మరియు పిడబ్ల్యూయస్)	75/kW	7.00	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65
	(బి) : సాధారణ ప్రయోజనాలు	75/kW	7.00	kWh/kVAh	475	7.95	7.25	7.00	6.95
	(సి) : మత సంబంధమైన ప్రదేశాలు	30/kW	5.00	kWh/kVAh	30	5.00	5.00	5.00	5.00
	(డి) : రైల్వే ట్రాక్షన్	-	-	kVAh	350	6.50	6.50	6.50	6.50
V	వ్యవసాయం మరియు సంబంధిత								
	(ఎ) : వ్యవసాయం								
	(i) కార్పొరేట్ రైతులు	-	3.50	kWh	-	-	-	-	-
	(ii) కార్పొరేట్ రైతులు కానివారు	-	-	-	-	-	-	-	-
	(iii) ఉప్పు తయారీ కేంద్రాలు 15 హెచ్ పి. వరకు	-	2.50	kWh	-	-	-	-	-
	(iv) చెఱకు గానుగ	-	-	-	-	-	-	-	-
	(v) గ్రామీణ ఉద్యానవన నర్సరీలు	-	-	-	-	-	-	-	-
	(vi) ఫ్లోరి కల్చర్ ఇన్ గ్రీన్ హౌస్	75/kW	4.50	kWh/KVAh	-	-	-	-	-
	(బి) : ఆక్వా కల్చర్ మరియు పశు సంవర్ధక	30/kW	3.85	kWh/KVAh	30	3.85	3.85	3.85	3.85
	(డి) : వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి వరకు	20/kW	3.75	kWh	-	-	-	-	-
	(ఇ) : ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల పథకములు	-	6.40	kVAh	-	7.15	7.15	7.15	7.15

గమనిక: (i) తాత్కాలిక సరఫరా : తాత్కాలిక సరఫరా కొరకు విడిగా కేటగిరి లేదు. అయినప్పటికి, ప్రతి కేటగిరికి వర్తించు నియమ నిబంధనలతో సంబంధిత కేటగిరిలో తాత్కాలిక సరఫరా విడుదల చేయటం జరుగుతుంది మరియు ఈ ఉత్తర్వులో నిర్దేశించిన ధరలు మరియు ఇతర షరతుల ప్రకారం బిల్లింగు చేయబడుతుంది.
(ii) హెచ్ టి సరఫరా లేదా ఎల్ టి సరఫరా నందు నిర్వచించబడని కేటగిరిలకు కేటగిరి-II (ఎ) (i) - వాణిజ్యం నందు సూచించిన రేట్లతో బిల్లు చేయబడతాయి.

అనుబంధం-II
ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ ధరలు

	వినియోగదారుని కేటగిరి-హెచ్ టి	వర్తించు సియస్‌యస్ రూ॥/యూనిట్: ఏపిఎస్‌పిడిసిఎల్	ఏపిసిపిడిసిఎల్	ఏపిఈపిడిసిఎల్
11 కె.వి. వద్ద				
I	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	0.71	0.74	0.61
II	వాణిజ్యము మరియు ఇతరులు	2.12	2.18	2.19
III (A, B, D)	పరిశ్రమలు	1.86	1.96	1.72
III (C)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	1.57	1.82	-
IV (A, B, C)	ఇన్‌స్టిట్యూషనల్	1.94	1.94	1.90
33 కె.వి. వద్ద				
I	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	1.53	1.60	1.47
II	వాణిజ్యము మరియు ఇతరులు	2.13	1.87	1.91
III (A, B, D)	పరిశ్రమలు	1.50	1.56	1.48
III (C)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.42	-	0.73
IV (A, B, C)	ఇన్‌స్టిట్యూషనల్	1.29	1.78	1.99
V	వ్యవసాయం మరియు సంబంధిత	1.31	1.31	1.32
132 కె.వి. వద్ద				
II	వాణిజ్యము మరియు ఇతరులు	1.81	2.45	1.80
III (A, B, D)	పరిశ్రమలు	1.36	1.48	1.37
III (C)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.55	-	0.35
IV (A, B, C)	ఇన్‌స్టిట్యూషనల్	1.34	-	-
IV (D)	రైల్వే ట్రాక్షన్	1.63	1.55	1.54
V	వ్యవసాయం మరియు సంబంధిత	1.43	1.43	-
220 కె.వి. వద్ద				
II	వాణిజ్యము మరియు ఇతరులు	2.45	-	1.73
III (A, B, D)	పరిశ్రమలు	1.43	1.87	1.11
III (C)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.55	-	0.35
IV (D)	రైల్వే ట్రాక్షన్	1.72	1.55	1.54
V	వ్యవసాయం మరియు సంబంధిత	1.43	1.43	1.43

గమనిక: అన్ని ఇతర షరతులు మరియు నిబంధనలు ఆర్థిక సం॥ 2025-26 రిటైల్ విద్యుత్ అమ్మకం ధరల ఉత్తర్వులో చాప్టర్-XIలో నిర్దేశించిన విధంగా వర్తించును.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతియత్నాల్లో ట్రంప్!


మూడేళ్ళకు పైగా సాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ గట్టిగానే కష్టపడుతున్నారు. ఆయన సహనం చూస్తుంటే ముచ్చటేస్తున్నది కూడా. మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మాట్లాడటానికి ప్రయత్నిస్తే, ఆయన ఎంతకూ అందుబాటులోకి రాలేదని, ఏకంగా గంటపాటు ట్రంప్ చేతిలో ఫోన్‌పట్టుకొని నిరీక్షించాల్సివచ్చిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ఏ సమయంలో ఫోన్‌చేస్తారో తమ అధ్యక్షుడికి తెలియనందువల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని రష్యా ఆ తరువాత చిన్నపాటి వివరణ ఇచ్చింది. ఏదో అవగాహన లేక తప్ప ఇది ఎంతమాత్రం తమ అధ్యక్షులవారి అహంకారం కాదని చెప్పడం ఈ వివరణ ఉద్దేశం కావచ్చు. ఆ సమయంలో పుతిన్ పారిశ్రామికవేత్తల సమావేశంలో ఉన్నారట. ఉంటే ఉన్నారు కానీ, అమెరికా అధ్యక్షులంతటివారు ఫోన్ చేస్తే, ఉన్న పళంగా లేచి పరుగున వచ్చి ఫోన్ అందుకోవాలిగానీ, ఇదేమిటి, కచ్చితంగా ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగింది అని కొందరు అంటారు. నిజానిజాలు రష్యా అధ్యక్షుడికే ఎరుక. కానీ, ఈ ఘటన అసలే అవమానంతో రగలిపోతున్న ఉక్రెయిన్ అధ్యక్షుడిని సహజంగానే వేడెక్కించింది. పుతిన్‌తో మాట్లాడటానికి ట్రంప్‌కు ఎంత సమయమైనా చిక్కుతుందని, ఎక్కడలేని సహనమూ వస్తుందన్న రీతిలో వ్యాఖ్యానించి కసితీర్చుకున్నాడాయన. పుతిన్‌తో ట్రంప్ మాట్లాడుతున్న సమయంలో ఐరోపా సమాఖ్య నేతలతో జెలెన్‌స్కీ చర్చల్లో ఉన్నారని కీవ్ ప్రకటించడం వెనుక, మూడేళ్లపాటు ఆయుధాలు అందించిన ఉక్రెయిన్‌కు ముందుగా ఫోన్ పోలేదని మిగతా ప్రపంచం ఎక్కడ అనుకుంటుందోనన్న బాధ ఉండవచ్చు. మొత్తానికి, ఒక రోజు ఆలస్యంగానైనా జెలెన్‌స్కీతో కూడా ట్రంప్ మాట్లాడేశారు. వ్యవహారం సజావుగా సాగుతోందన్న రీతిలో ఓ నాలుగు మంచిమాటలు కూడా అన్నారు. గత నెలలో, ఓవల్ ఆఫీస్‌లో తీవ్ర వాగ్యుద్ధం అనంతరం, దాదాపు గెంటివేసినంత పనిచేశాక, జెలెన్‌స్కీతో ట్రంప్ మాట్లాడింది మళ్ళీ ఇప్పుడే.

ముందుగా షెడ్యూల్ చేసుకున్న ప్రకారమే వైట్‌హౌస్‌నుంచి క్రెమ్లిన్‌కు ఫోన్ వెళ్ళిందని, పుతిన్‌కు సమాచారం చేరినా కూడా ఆయన పట్టించుకోకుండా 'ఆయనకు ఇదే పని' అంటూ కొన్ని వ్యాఖ్యలు చేసి, ఉద్దేశపూర్వకంగానే ఉండిపోయారనడానికి నిదర్శనంగా పారిశ్రామికవేత్తల సదస్సులో జరిగిన ఓ సంభాషణ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. మొత్తానికి, జెలెన్‌స్కీని పక్కనపెట్టేసి, ట్రంప్ పుతిన్ కలసి కథ నడిపిస్తున్నారన్నది నిజం. యుద్ధానికి సంబంధించి పుతిన్–ట్రంప్ చర్చలు ఓ రెండు గంటలు ఆలస్యమైనా, సుదీర్ఘంగా సాగాయని, ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలమీద నెలరోజులు దాడులు నిలిపివేసేలా చూడాలని ఇద్దరూ నిర్ణయించారని వైట్‌హౌస్ ప్రకటించింది. ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో యుద్ధఖైదీల అప్పగింత సహా పుతిన్ చెప్పిన మరికొన్ని విషయాలను పోస్టుచేశారు. ట్రంప్ ప్రతిపాదించిన ముప్పైరోజుల కాల్పుల విరమణకు పుతిన్ సరేనంటూనే చాలా నిబంధనలు పెట్టినట్టుగా వార్తలు వచ్చాయి. అలాగే, యుద్ధం మూలకారణాలమాటేమిటని అడిగారని, నాటో పాత్ర, విస్తరణల సంగతి తేల్చమన్నారని వార్తలు వస్తున్నాయి. ఉక్రెయిన్‌కు సమస్త సహాయాలూ ఆగిపోయినపక్షంలోనే ఈ తాత్కాలిక, స్వల్పకాలిక యుద్ధవిరామం నిలబడుతుందని కూడా పుతిన్ స్పష్టంగా తేల్చేశారట. అంటే, ఉక్రెయిన్‌కు అమెరికానుంచి ఆర్థిక, ఆయుధ సహాయాలు ఆగిపోయి, నిఘా సమాచారం నిలిచిపోతేనే యుద్ధం ఆగుతుందన్నది సారాంశం. ఆదివారం సౌదీ అరేబియాలో జరగబోయే చర్చల్లో ఈ విషయాలన్నీ తేల్చేస్తామని అమెరికా అంటోంది.

యుద్ధానికి తాత్కాలిక విరామం ఇస్తానని ట్రంప్‌కు హామీ ఇచ్చిన పుతిన్, క్షణం కూడా యుద్ధాన్ని ఆపకుండా ఏకంగా ఉక్రెయిన్ ఇంధన స్థావరాలమీదా, వ్యవస్థలమీదా బాంబులు కురిపించారని జెలెన్‌స్కీ ఆరోపిస్తున్నారు. బుధవారం రష్యా క్షిపణులు ఉక్రెయిన్ రైల్వేలకు విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థను తీవ్రంగా దెబ్బకొట్టాయి. ఆదివారం చర్చల్లోగా ఉక్రెయిన్‌ను బాగా దెబ్బతీసి, మరింత ఒత్తిడిపెంచాలనీ, భీకరమైన యుద్ధంతో జెలెన్‌స్కీని వంచాలనీ పుతిన్ ఉద్దేశం. తనకు ట్రంప్ ఏం చెప్పారన్నకంటే, పుతిన్‌తో ట్రంప్ ఏం మాట్లాడారన్నది జెలెన్‌స్కీకి ఎక్కువ ఆందోళన కలిగిస్తున్న అంశం. శాంతియత్నాలను రష్యా అడ్డుకుంటోందని జెలెన్‌స్కీ అంటున్నారు కానీ, ఆయన ప్రమేయం లేకుండా ట్రంప్ తాను చేయదల్చుకున్నది చేసుకుపోతున్నారు.

మనం మరిచిపోయిన వాఙ్మయ శిఖరం

కాన్పూర్‌లో జరిగిన ఒక విద్వద్గోష్ఠికి మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్, లాహోర్ ఓరియంటల్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్ స్వరూప్ మున్నగు విద్వద్వరేణ్యులు విచ్చేసారు. నేను ఇద్దరికీ పరిచితుడినే. ప్రసంగవశాత్తు 'రామకృష్ణ కవి గారిని ఎరుగుదురా?' అని రాహుల్ జీ ప్రశ్నించారు. 'ఎందుకు?' అన్నాను. 'ఏమీ లేదు, ఆయన ఎంత ధన్యజీవి! ఆయన జీవిత సార్థక్యానికి ఒక్క కుందమాల నాటకం చాలు. ఎంత మంచి నాటకం వెలుగుకు తెచ్చారు?' అన్నారు రాహుల్ జీ. 'మరి నాట్య శాస్త్రం సంగతో?' అన్నారు లక్ష్మణ్ స్వరూప్ జీ, 'ఆయన జీవితాన్ని ధన్యం చేయడానికి!' అన్నారు మరొకరు. నాకు మాట పెగల్లేదు. గుండె గొంతుకలో కొట్టుకులాడింది. నేను అప్పుడు అనుభవించింది మానుషానందం కాదు. ఉపనిషత్తులు ఉద్ఘోషించిన అతి మానుషానందభూతి అది! అతి కష్టంతో గద్గద కంఠంతో అన్నాను : 'కవిగారు నాకు చాలా పరిచితులు. ఆయన దగ్గర పనిచేసే భాగ్యం నాకు కలిగింది' అని. అక్కడి వారందరి చూపుల్లో కవిగారిని దర్శించినంత సంతోషం తెలిపే రాగరేఖ ఒక్కసారిగా మెరిసింది... తిరుమల రామచంద్ర తమ స్వీయ చరిత్ర 'హంపీ నుంచి హరప్పా దాకా'లో రామకృష్ణ కవిగారిని గురించి రాసిన భాగంలో ప్రారంభ వాక్యాలివి. 'అందరికంటే నెక్కువగా నాకు చిరకాల మిత్రులు, ఆంధ్ర భాషా వాఙ్మయం నందు విశేష కృషి చేసిన వారును, దేశాటనము చేసి అపూర్వ పుస్తక సంపాదనము చేసిన వారును శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారు...' అని కందుకూరి వీరేశలింగం తమ ఆంధ్ర కవుల చరిత్రములో ప్రస్తావించారు. 'సాహిత్య ప్రపంచంలో మా బోంట్లు తిన్నగా కన్నులు తెరవక పూర్వమే రామకృష్ణ కవి గారు ప్రాచీన ప్రబంధములను ప్రకటించిరి' అని వేటూరి ప్రభాకర శాస్త్రి కీర్తించిన మహావ్యక్తి రామకృష్ణ కవి. బాలాంత్రపు రజనీకాంతరావు సైతం తన 'ఆత్మకథా విభావరి'లో మానవల్లి వారి గురించి రెండు అధ్యాయాలు కేటాయించారు. ముందు తరాలపై మహానుభావుల ప్రభావం అలాగే ఉంటుందేమో. అందుకే, యాభై ఏళ్ళ క్రితం సాహిత్య అకాడమీ 555 పుటల్లో ప్రచురించిన మానవల్లి రామకృష్ణకవి రచనల సంపుటికి రాసిన ముందుమాటలో, 'ఆంధ్ర భాషలో సాహిత్య విమర్శకు భిక్షపెట్టినవారు వీరేనని చెప్పిన అతిశయోక్తి కాజాలదు..' అన్న దేవులపల్లి రామానుజరావు, వాఙ్మయ పరిశోధనకై చేసిన తపస్సు కవిగారి జీవితము అంటారు. పై ఉటంకింపులను బట్టి రామకృష్ణ కవి గారి అసాధారణ ప్రతిభ ఎంతటిదో అర్థమౌతుంది.



మహాపండితుడు, అనుపమేయ సారస్వత సేవకుడు మానవల్లి రామకృష్ణ కవి. ఒకనాడు దేశం యావత్తు గౌరవించిన మానవల్లి రామకృష్ణ కవి ఈ రోజు తెలుగు జాతికి సైతం విస్మృతుడయ్యారు. వేటూరి ప్రభాకర శాస్త్రి మొదలుకుని తిరుమల రామచంద్ర వరకూ ఎందరో విజ్ఞాన జిజ్ఞాసువులకు మార్గదర్శకులుగా నిలిచిన రామకృష్ణ కవి విస్మృత జీవితాన్ని వెలుగులోనికి తీసుకురావడమే ఆయనకు మన తరం ఇవ్వదగ్గ కనీస సార్థక నివాళి.

చెన్నపురి (నేటి చెన్నై)లోని నుంగంబాకంలో పండిత వంశంలో జన్మించిన మానవల్లి రామకృష్ణకవి కళాశాల విద్య అక్కడే చదివారు. ఆరుకి పైబడిన భాషల్లో అనర్గళమైన పాండిత్యం కలిగిన మానవల్లివారు 16 ఏళ్ళ వయసులో మృగవతి అనే కవిత రాయడం వల్ల ఆయన్ని అందరూ గౌరవంగా 'కవి గారు' అని పిలిచేవారట. భరత నాట్యంలో పిహెచ్.డి చేసిన తమిళనాడు విద్వాంసురాలు శ్రీమతి శశికళ 2023 లో జాతీయ హిందీ, సంస్కృత పరిశోధన పత్రికకు రాసిన వ్యాసంలో కవిగారు మార్చి 20, 1875న జన్మించారని రాశారు. వనపర్తి సంస్థానంలో కొన్నాళ్ళు పనిచేసిన రామకృష్ణ కవి తదనంతరం మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో ప్రాచీన తాళపత్ర గ్రంథాల అన్వేషణలో అగ్రభాగాన నిలిచారు. 'విస్మృత కవులు' రచన చేసిన రామకృష్ణ కవి శిథిల స్థితిలోనున్న ఎన్నో విలువైన గ్రంథాల్ని సేకరించి భద్రపరిచారు. వేంకటేశ్వరా ప్రాచ్య పరిశోధనా సంస్థలో, విద్యా శాఖాధికారిగా రాజమండ్రిలో ఉపాధ్యాయునిగా కూడా పనిచేశారు. శూద్రకుని వత్సరాజ చరిత్రను నవలగా రాశారు. నన్నెచోడుడి 'కుమార సంభవం' కావ్యాన్ని పరిష్కరించి ప్రకటించి నన్నెచోడుడు నన్నయ కంటే ముందువాడని కవి గారు చేసిన ప్రతిపాదన పండిత లోకంలో ఒక సంచలనం. మెకంజీ కైఫీయత్తుల్ని తెలుగీకరించారు. క్రీడాభిరామం, నీతిసార ముక్తావళి, ప్రబంధ మణిభూషణం, పరతత్వ రసాయనం, అనర్ఘ రాఘవం, త్రిపురాంత కోదాహరణం, శ్రీరంగ మహత్యం, సకాలనీతి సమ్మతం వంటి గ్రంథాలను సేకరించి విశ్లేషణాత్మక పీఠికలతో ప్రకటించారు. వైజయంతి, భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రిక, సరస్వతి మొదలైన పత్రికలలో అనేక విలువైన వ్యాసాలు రాశారు. వాల్మీకి చరిత్రనూ, తరిగొండ వెంగమాంబ, గణపవరపు వెంకటకవి, సోమనాథ సోమయాజి, కస్తూరి భట్టరాజు, చింతపల్లి కవుల్ని వెలుగులోనికి తీసుకువచ్చింది మానవల్లి వారే. తెలంగాణమంతా పర్యటించి 'లిథిక్ రికార్డ్స్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్' అనే శాసనాల సంకలన గ్రంథాన్ని ప్రతిబింబాలతో పాటుగా ప్రకటించారు. ఇన్నింటిలోకీ యావత్ తెలుగు జాతి ఆయనకు రుణపడి తీరాల్సిన మహోన్నత కార్యం, మహానుభావుడు అన్నమయ్యను వెలికితీసిన మహత్కార్యం. అదొక్కటి చాలు ఆయన్ని తెలుగు జాతి సారస్వత ఉద్ధారక సమున్నతుడుగా గుర్తించడానికి. డబ్లిన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేసిన మెయిల్స్ డిల్లోన్ తాను పారిస్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడు తన అభిమాన టీచర్ సిల్వైన్ లేవి తనకి మొట్టమొదటిసారిగా, రామకృష్ణ మహాకవి గారినే పరిచయం చేశారనీ, ప్రాచీన సంస్కృత సాహిత్యంలో ఎన్నో సందేహాలను కవిగారు నివృత్తి చేశారని అన్నారు. మానవల్లి వారు సంస్కృతంలో నలుగురు ప్రాచీన కవులు రాసిన చతుర్భాణిని 1922లో పరిష్కరించి ఇవ్వగా పాట్నాలోని ఒక ప్రచురణ సంస్థ ముద్రించిందనీ, దానిని తాను డార్జిలింగ్ వద్దగల కుర్సియాంగ్ రేడియో స్టేషన్‌కి డైరెక్టర్‌గా ఉన్నప్పుడు 1967, 1968 సంవత్సరాలలో తెలుగులోకి అనువదించాననీ ప్రత్యేకంగా ఒక అధ్యాయమే కేటాయించి వెల్లడించారు బాలాంత్రపు రజనీకాంతరావు గారు.

మహాపండితుడు, అనుపమేయ సారస్వత సేవకుడు అయిన మానవల్లి వారు తన చివరి దశలో ఆర్థిక సమస్యలతో చెప్పరాని బాధలు అనుభవించారు. కుమారులిరువురూ కలిసి రాలేదు. ప్రభుత్వం గుర్తించి ఎంతో కొంత గౌరవ భృతి ఏర్పాటు చేసింది. తుదకు తిరుపతి వీధుల్లో తిరుగుతూ బిచ్చమెత్తుకుంటున్న మానవల్లి వారిని అక్కడి రిక్షా వాళ్ళు చేరదీయగా ఒక హోటలు వారు దయతలచి భోజనం పెట్టేవారట. అలాంటి దుర్భర పరిస్థితుల్లో తన 91 ఏట 20–9–1957న ఆయన తిరుపతిలో మరణించారు.

ప్రాచీన గ్రంథాల అన్వేషణలో నేపాల్, బరోడా, బికనీర్, ట్రావెంకోర్, లాహోర్, జోధ్‌పూర్, కేరళ, కలకత్తా... ఇలా దేశం నలుచెరుగులా తిరిగిన మరో తెలుగు కవి కానీ, పరిశోధకుడు కానీ ఆనాటికి, ఈనాటికీ కూడా ఎవరూ లేరు. మారుమూల గ్రామాల్లో సంప్రదాయ పండితులు ఇవ్వడానికి నిరాకరించిన గ్రంథాల్ని ఊరికే చూసి ఇస్తానని తీసుకుని మొత్తం గ్రంథాన్ని మనసులో పెట్టుకుని తిరిగి వచ్చాక వాటిని పొల్లుపోకుండా నకలు చేసేవారట కవిగారు. అందుకేనేమో తిరుమల రామచంద్ర 'ఆయన ధారణశక్తి శక్తిస్వరూపిణి. ఆయన మెదడొక పావురాల గూడు. అవసరమైన శ్లోకాలు ఆ అరల నుంచి కర్పూరకాంతుల కపోతాలలాగ వెలుపలికి వచ్చేవి...' అని అన్నారు. ఒకనాడు దేశం యావత్తు గౌరవించిన మానవల్లి రామకృష్ణకవి ఈ రోజు తెలుగు జాతికి సైతం విస్మృతుడయ్యారు. నిత్యం అన్నమాచర్యుల కీర్తనలతో మారుమోగే ఏ ఇంట్లోనూ, కనీసం ఆ వేంకటేశ్వరుని సన్నిధి పరిసరాలలో కూడా అసలు ఆయన గురించి తెలిసిన వారు లేరు. మానవల్లి వారి పేరుతో ఒక పురస్కారం ఏర్పాటు చేస్తే విశేష పరిశోధన చేసే వారికి ప్రోత్సాహంగా వుంటుంది. వేటూరి ప్రభాకర శాస్త్రి మొదలుకుని తిరుమల రామచంద్ర వరకూ ఎందరో విజ్ఞాన జిజ్ఞాసువులకు మార్గదర్శకులుగా నిలిచిన రామకృష్ణ కవి విస్మృత జీవితాన్ని వెలుగులోనికి తీసుకురావడమే ఆయనకు మన తరం ఇవ్వదగ్గ కనీస సార్థక నివాళి.

○ గౌరవ్

(నేడు మానవల్లి రామకృష్ణ కవి 150వ జయంతి)

పునర్విభజన మంచిచెడులను నిగ్గుతేల్చాలి!

"సమస్యను దాటవేయడం, వాయిదా వేయడం ద్వారా అది పరిష్కారం కాబోదు. ఎదుర్కోవడం ద్వారానే దానికి సహేతుకమైన ముగింపు లభిస్తుంది" అన్నది రాజకీయ నీతిజ్ఞులు చెప్పిన నానుడి. కానీ, మన దేశంలో క్లిష్టమైన సమస్యలను వాయిదా వేస్తూ వాటిని సంక్లిష్టంగా మార్చడం స్వాతంత్ర్యానంతరం దేశాన్ని ఏలిన పాలకులు చాలామంది అనుసరించిన పంథా! 2026లో చేపట్టవలసిన దేశ జన గణన, దాని ఆధారంగా చేయాల్సిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను ఓ ముప్పై ఏళ్లపాటు వాయిదా వేయాలంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కొత్తగా ఓ ప్రతిపాదన చేస్తున్నారు.



స్టాలిన్ ప్రతిపాదనలో మంచి చెడులను విశ్లేషించే క్రమంలో 'పునర్విభజన సమస్య'లో ఇమిడివున్న పలు అంశాలను సునిశితంగా పరిశీలించడం ముఖ్యం. మన రాజ్యాంగకర్తలు నిర్ణీత వయోపరిమితి దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారు. అంతేగాక ప్రతి ఒక్కరి ఓటుకు ఒకే విలువ అనే ప్రాతిపదికన ప్రతి రాష్ట్రానికి జనాభా నిష్పత్తికి అనుగుణంగా లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉండాలని రాజ్యాంగం ద్వారా నిర్దేశించారు. అయితే, దేశంలో జనాభా రేటులో ప్రాంతాల వారీగా తీవ్ర వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయని ఆనాడు ఊహించలేదు. అయితే, 1976లో జానాభా ఆధారంగా జరిగిన పునర్విభజన తర్వాత ఈ ప్రక్రియ ప్రతి పదేళ్ళకు చేపట్టవలసి ఉన్నప్పటికీ నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి పునర్విభజనను 2000 సంవత్సరం వరకూ జరగకుండా స్తంభింపజేశారు. 2001లో 84వ రాజ్యాంగ సవరణ తెచ్చి 2026 తర్వాత మాత్రమే జనగణన ద్వారా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టే వెసులుబాటును కల్పించారు.

చివరసారిగా 1976లో జరిగిన పునర్విభజన తర్వాత దేశంలో సామాజికంగా, ఆర్థికంగా అనేక పరిణామాలు చోటుచేసుకొన్నాయి. జాతీయ విధానంగా తీసుకొన్న జనాభా నియంత్రణకు అనేక రాష్ట్రాలు, ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలు విశేషంగా కృషి చేశాయి. దాంతో పాటు విద్య, ఆరోగ్యం, ఉపాధి మొదలైన కీలక రంగాలలో ముందంజ వేసి సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధించాయి. అదే సమయంలో దేశంలోని పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ లాంటివి అభివృద్ధిలో వెనక్కుపోయి 'బీమారు' (రోగగ్రస్తమైన) రాష్ట్రాలుగా గణతికెక్కాయి. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగంలో 282 అధికరణ ప్రకారం ప్రాంతీయ అసమానతల్ని తొలగించడానికి కేంద్రం తన విచక్షణాధికారాలను ఉపయోగించి 'బీమారు' రాష్ట్రాలకు అధిక నిధులు ఇవ్వడం; ఆర్థికాభివృద్ధి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు అరకొర నిధులు విదిలించడం రివాజుగా మారింది. ఈ చర్య పైకి రాజ్యాంగబద్ధంగా కన్పిస్తున్నప్పటికీ.. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించడంగానే భావించాలి. ఈ అన్యాయాన్ని గత రెండున్నర దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు వివిధ వేదికల ద్వారా ఎలుగెత్తి చాటుతున్నాయి. దేశ జనాభాలో 18శాతంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు దేశ స్థూల ఉత్పత్తికి దాదాపు 36శాతం మేర నిధులను సమకూరుస్తుంటే, కేంద్రం తిరిగి వాటికి అరకొరగా నిధులు అందించడం దక్షిణాది ప్రాంత ప్రజలను బాధిస్తోంది.

1976 నుంచి 543 స్థానాలు గలిగిన లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు లభిస్తున్న ప్రాతినిధ్యం ఉత్తరాదితో పోలిస్తే తక్కువే అయినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో వేగంగా పురోగతి సాధించిన వాస్తవాన్ని కూడా విస్మరించలేం. అదేవిధంగా కేంద్రం ద్వారా అత్యధికంగా నిధులు పొందుతున్న బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం యువత దక్షిణాది రాష్ట్రాలకు వలసలు వస్తున్నారు.

ఇక, జనాభా నిష్పత్తికి అనుగుణంగా లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉండాలన్న రాజ్యాంగ సూత్రం యథాతథంగా అమలు చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు సహజంగానే లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. అలాగే, ఉత్తరాదిన ఉన్న కొన్ని రాష్ట్రాలకు, మధ్య భారతంలోని మరికొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఈ అంశాన్నే ఇపుడు స్టాలిన్, రేవంత్‌రెడ్డి లాంటి వారు ప్రశ్నిస్తున్నారు. సామాజికాభివృద్ధి సాధించడంలో వెనుకబడిన రాష్ట్రాలకు అధిక మొత్తంలో నిధులు అందించడంతో పాటు లోక్‌సభలో హెచ్చు ప్రాతినిధ్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న నేడు జాతీయ స్థాయిలో ప్రతి ఒక్కరూ చర్చిస్తున్నారు. దీనిపైననే ఇపుడు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంతో అమీతుమీ తేల్చుకోవాలనుకొంటున్నారు. ఎం.కె. స్టాలిన్, ఎ. రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్యలు ఎన్డీయేతర పార్టీల ముఖ్యమంత్రులు కనుక ఈ సమస్యపై బహిరంగంగా మాట్లాడగలుగుతున్నారు. సమస్య సహేతుకంగా పరిష్కారం కావడానికి కలిసికట్టుగా రావాలంటూ దక్షిణాదిలోనే అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నారు. నిజానికి ఇదే సమస్యను దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం అందరి కంటే ముందుగా లేవనెత్తి జాతీయ స్థాయిలో చర్చకు ఆస్కారం కల్పించింది నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే.

కాగా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పిల్లల్ని ఎక్కువగా కనాలంటూ తన రాష్ట్రంలోని నవ దంపతులకు సూచన చేస్తున్నారు. కొత్తగా పెళ్లయిన వారు ఎక్కువ మంది పిల్లల్ని కంటూపోతే.. 30 ఏళ్ల తర్వాత తమిళనాడు జనాభా పెరిగి, అపుడు జరిగే పునర్విభజనలో తమ రాష్ట్రానికి లోక్‌సభలో అధిక ప్రాతినిధ్యం లభిస్తుందన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. తమిళనాడుకు న్యాయం జరగాలన్న ఆరాటంలో ఆయన కొన్ని వాస్తవాలను విస్మరిస్తున్నారు. రాబోయే 30 ఏళ్లల్లో మిగతా రాష్ట్రాలతోపాటు ఉత్తర, మధ్య భారతదేశ రాష్ట్రాల్లో అదే దామాషాలో లేదా అంతకుమించి జనాభా పెరగదన్న గ్యారంటీ ఏమి లేదు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించకపోతే, మిగతా రాష్ట్రాలు మాత్రం నియంత్రణ పాటిస్తాయా? అలాంటి ఆలోచన చేయడంలో ఔచిత్యం కనపడదు. పైగా, అధిక సంతానం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు చితికిపోవడం అనుభంలో ఉన్న చేదు వాస్తవం. పెరిగే జనాభాకు అనుగుణంగా తగిన విద్య, ఆరోగ్యం, ఉపాధి, నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఒక సమస్యను పరిష్కరించడానికి మరో సమస్యను సృష్టించడం అశాస్త్రీయం, అవివేకం. స్టాలిన్ సూచనను ఆ రాష్ట్ర ప్రజానీకం సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొంటారని భావించలేం గానీ, బాధ్యత గల పదవుల్లో ఉన్నవారు ఏ అంశంలోనైనా మంచీచెడులను బేరీజు వేసుకొని స్పందిస్తేనే మంచిది.

1976 నుంచి 543 స్థానాలు గలిగిన లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు లభిస్తున్న ప్రాతినిధ్యం ఉత్తరాదితో పోలిస్తే తక్కువే ఐనప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో వేగంగా పురోగతి సాధించిన వాస్తవాన్ని కూడా విస్మరించలేం. అదేవిధంగా కేంద్రం ద్వారా అత్యధికంగా నిధులు పొందుతున్న బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం యువత దక్షిణాది రాష్ట్రాలకు వలసలు వస్తున్నారు. లోక్‌సభలో అధిక ప్రాధాన్యత ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను ఆ రాష్ట్రాలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయి.

ఇక, దేశంలో నగరీకరణ, పట్టణీకరణ పెరగడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జనాభా సంఖ్య తగ్గి నగరాలు, పట్టణాల్లో జనసాంద్రత పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం వంటి కార్పొరేషన్ల పరిధిలోని నియోజకవర్గాలలో జనాభా సంఖ్య అధికంగా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో జనాభా సంఖ్య తక్కువగా ఉంది. అందువల్ల పునర్విభజన శాసనసభ నియోజకవర్గాల స్థాయిలో కూడా చేపట్టాల్సిన అవసరం కనబడుతున్నది. పునర్విభజన అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక కోణంలో నుంచే చూడాలి. ఈ అంశాన్ని పరిష్కరించడానికి శాస్త్రీయపరమైన మార్గాన్ని అన్వేషించాలి. లోక్‌సభలో విస్తృతమైన సంప్రదింపులు జరపాలి. చట్టసభలలో ప్రాతినిధ్యంలేని రాజకీయ పార్టీల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించడానికి అఖిలపక్షాన్ని పిలవాలి. ఎంతో సున్నితమైన ఈ సమస్యకు శాస్త్రీయ పరమైన ముగింపు లభించాల్సిన అవసరం ఉంది.

• సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

ఒప్పించలేక తప్పించుకుంటున్న స్టాలిన్!

"బాగా పరిపాలించి మరోసారి అధికారం ఇచ్చేలా ప్రజలను కన్విన్స్ చేయడం సాధ్యం కాకపోతే.. వాళ్లను కన్ఫ్యూజ్ చేయి సమస్య అదే పరిష్కారం అవుతుంది" అంటాడు అమెరికా ముప్పై మూడో ప్రెసిడెంట్ హ్యారీ ట్రూమన్. ఇప్పుడు తమిళనాడులో స్టాలిన్ అదే చేస్తున్నారు. ఎన్నికల భయంతో ఏడాది ముందే ఆయన ప్రజలను కన్ఫ్యూజ్ చేయడం ప్రారంభించారు. దానికి భాషను ఆయుధంగా వాడుకుంటున్నారు.

గతంలో ఆయన తండ్రి కరుణానిధి కూడా అదే చేశారు. అప్పట్లో కరుణానిధి ఆయుధం సంస్కృత భాష. సంస్కృత భాషపై వ్యతిరేకతతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందారు. కరుణానిధి రాజకీయ ప్రసంగాల్లో, సంస్కృతాన్ని "ఆర్య భాష"గా చిత్రీకరిస్తూ, ద్రవిడ భాషలతో విభేదాలు సృష్టించే ప్రయత్నం చేశారు. 2007లో తిరువల్లువర్ అనే ప్రఖ్యాత తమిళ కవి గురించి మాట్లాడుతూ, ఆయన సంస్కృత భాషను వ్యతిరేకించారని పేర్కొనడం వివాదాస్పదంగా మారింది. నేడు వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు భాషా వివాదాన్ని తరచూ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి బలమైన మద్దతును పొందడమే స్టాలిన్ ప్రధాన లక్ష్యం. భారతదేశంలో లింగ్విస్టిక్ ఫ్రీడమ్ ఉంది. భారతీయుడు ఇష్టం వచ్చిన భాషలు నేర్చుకోవచ్చు, మాట్లాడుకోవచ్చు. ఎవరూ అభ్యంతరం చెప్పరు. అలా చెబితే నేరం కూడా. మరి ఎందుకు హిందీని తమిళనాడులో శత్రు భాషగా ప్రచారం చేస్తున్నారు?

కులం పేరుతో, ప్రాంతం పేరుతో తమిళులను భావోద్వేగాలతో నింపే అవకాశం లేదని అప్పట్లో హిందీ భాష వ్యతిరేకతను ద్రవిడ పార్టీల పెద్దలు ఎంచుకున్నారు. అభ్యుదయం పేరుతో క్రమశిక్షణ లేని జీవితాలను ప్రోత్సహించే ప్రయత్నం చేశారు. ఆనాడు భాషపై వేసిన విద్వేష బీజాలతోనే నేడు ద్రవిడ పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయి. ఇప్పటికీ అదే భాషపై ద్వేషంతో ప్రజల్ని విడగొట్టి దేశానికి దూరం చేసి తమ ఓటు బ్యాంకుగా ఉంచుకోవాలనుకుంటున్నాయి.

హిందీ భాషపై ఒక్క తమిళనాడులో తప్ప ఎక్కడా వ్యతిరేకత లేదు. తమిళనాడులోనూ హిందీ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు లక్షలామంది ఉంటారు. కానీ హిందీ నేర్చుకుంటే తమిళ ద్రోహం అన్నట్లుగా భయపెట్టి అందర్నీ ఆపేస్తున్నారు. హిందీ భాష వల్ల తమిళానికి ముప్పు వస్తుందని ఎవరైనా అంటే అంత కంటే పిచ్చి వాదన ఉండదు. ఎందుకంటే ఇప్పుడు మాతృభాషలకు అసలు సవాల్‌గా మారింది ఇంగ్లిష్ మాత్రమే. ఇప్పుడు పిల్లల చదువులు ఇంగ్లిష్ మీడియంలో జరుగుతున్నాయి. మాతృభాష ద్వితీయ ప్రాధాన్యం అయిపోయింది. మాట్లాడేవారు ఉన్న చదువుకునేవారు తక్కువైపోతున్నారు. అంతెందుకు, స్టాలిన్ కుమారుడు ఉదయనిధి చదువుకుంది తమిళం మీడియంలోనా ఇంగ్లిష్ మీడియంలోనా? అంత ఎందుకు తమిళనాడులో ఇతర భాషల ఉనికి లేదా?

హిందీ భాషపై ఒక్క తమిళనాడులో తప్ప ఎక్కడా వ్యతిరేకత లేదు. తమిళనాడులోనూ హిందీ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు లక్షల మంది ఉంటారు. కానీ హిందీ నేర్చుకుంటే తమిళ ద్రోహం అన్నట్లుగా భయపెట్టి అందర్నీ ఆపేస్తున్నారు. హిందీ భాష వల్ల తమిళానికి ముప్పు వస్తుందని ఎవరైనా అంటే అంత కంటే పిచ్చి వాదన ఉండదు. ఎందుకంటే ఇప్పుడు మాతృభాషలకు అసలు సవాల్‌గా మారింది ఇంగ్లిష్ మాత్రమే.



తమిళనాడులో అధికార భాష తమిళ భాషను తమ మాతృభాషగా మాట్లాడుతారు. తెలుగు మాట్లాడేవారు తమిళనాడులో రెండవ అతిపెద్ద భాషా సమూహం. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా చెన్నై, వెల్లూరు, కాంచీపురం, తూత్తుకుడి, కోయంబత్తూరు వంటి జిల్లాలలో తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న జిల్లాలలో, ముఖ్యంగా ధర్మపురి, కృష్ణగిరి, కోయంబత్తూరు వంటి ప్రాంతాలలో కన్నడ మాట్లాడే ప్రజలు నివసిస్తున్నారు. కేరళ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ప్రాంతాలలో, ముఖ్యంగా కన్యాకుమారి, తెన్కాశి వంటి జిల్లాలలో మలయాళం మాట్లాడే ప్రజలు ఉన్నారు. చెన్నై, వెల్లూరు వంటి పట్టణ ప్రాంతాలలో ఉర్దూ మాట్లాడే ప్రజలు ఉన్నారు. ఇంగ్లీష్, హిందీ వంటి భాషలు కూడా విద్య, వ్యాపారం, ఇతర అవసరాల కోసం మాట్లాడేవారు తమిళనాడులో ఉన్నారు. కాదని చెప్పగలరా?

ఇలాంటి సమయంలో ఇంగ్లిష్ నుంచి మాతృభాషను కాపాడుకునే ప్రయత్నం చేయాలి కానీ హిందీపై యుద్ధం చేస్తే కలిగే ప్రయోజనం శూన్యం. మనదేశం వేలాది భిన్న భాషల, సంస్కృతుల సమ్మేళనం. గ్లోబలైజేషన్ కావొచ్చు ఇతర కారణం కావొచ్చు, ఇప్పుడు ఇంగ్లిష్ మాత్రమే గ్లోబల్ లాంగ్వేజ్. ప్రభుత్వ పాలన, ఇతర వ్యవహారాలన్నీ రాష్ట్రాల్లోనూ కేంద్రంలోనూ ఇంగ్లిష్‌లోనే సాగుతూంటాయి. తమిళనాడులో ప్రభుత్వ ఆదేశాలు కొన్ని చోట్ల తమిళంలో ఇస్తున్నప్పటికీ కేవలం తమిళంలో ఇవ్వడం లేదు. అందరికీ ఇంగ్లిష్‌లో ఆదేశాలు జారీ చేసి, కేవలం రికార్డెడ్‌గా మాత్రమే తమిళం ఆదేశాల కాపీలు ఉంచుతున్నారు. ఇంగ్లిష్ నుంచి వచ్చే ముప్పు నుంచి దేశ భాషలను కాపాడేందుకు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులను కూడా మాతృభాషల్లో బోధించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. టెక్స్ట్ బుక్‌లు రెడీ చేస్తోంది. ఇటీవల అమిత్ షా తెలంగాణలో పర్యటించినప్పుడు స్టాలిన్‌కు ఇదే సవాల్ చేశారు. ఎంబీబీఎస్ కోర్సును తమిళ భాషలో ప్రారంభించాలన్నారు. దానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తామన్నారు. దీనికి డీఎంకే నుంచి సమాధానం రాలేదు.

కేంద్రం హిందీని బలవంతంగా రుద్దడం లేదు. జాతీయ విద్యా విధానంలో భాగంగా త్రిభాషా విధానం తెచ్చింది. హిందీ అధికారభాషే కానీ, జాతీయ భాష కాదు. దీన్ని అందరూ అంగీకరిస్తారు. హిందీ ప్రాంతాల్లోనూ హిందీ, ఆంగ్లభాషలే పాఠశాలల్లో బోధిస్తున్నారు. అక్కడ కూడా త్రిభాషా సూత్రం అమలవుతుంది. అయితే జాతీయ విద్యా విధానంలో త్రిభాషల్లో ఒకటిగా హిందీ ఉండటంతో అక్కడ హిందీ, ఇంగ్లిష్‌తో పాటు వారు ఎంచుకున్న భాషను నేర్పుతున్నారు. అక్కడి వారు తమిళం కోరుకుంటే తమిళం, తెలుగు మూడో లాంగ్వేజ్‌గా కోరుకుంటే తెలుగు నేర్పుతారు. మూడో భాషగా వారు ఏ భాషను ఎంచుకుంటారన్నది వారిష్టం.

2011 జనాభా లెక్కల ప్రకారం 22 భాషలు ఉండగా వాటిలో 17 భాషలు తిరోగమన బాట పట్టాయని, మాట్లాడేవారు తగ్గిపోతున్నారని, హిందీ బెంగాలీ తర్వాత మూడవ స్థానంలో ఉన్న తెలుగు కూడా నాల్గవ స్థానానికి పడిపోయిందని వాదిస్తున్నారు. ఇదే నిజం అయితే దీనికి కారణం హిందీ కాదు. ఇంగ్లిష్ మాత్రమే. అయితే హిందీ వల్ల ఉత్తర భారతంలోని అనేక భాషలు అంటే భోజ్‌పురి, అవధీ, బుందేలీ, ఛత్తీస్‌గఢీ వంటి భాషలు కనుమరుగయ్యాయని వాదిస్తున్నారు. అవన్నీ హిందీ మాతృకగా ఉన్న భాషలే. వాటికి సంబంధించిన లిపి హిందీలోనే ఉంటుంది. అవి కనుమరుగయ్యే అవకాశం లేదు. వాటిని మాతృభాషగా ఉన్నవారు వాటికి ప్రాణం పోసుకుంటూనే ఉన్నారు. భాషను రాజకీయం చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. తమిళనాడు వాసులకు వారి మాతృభాషపై అమితమైన ప్రేమ అన్న విషయంలో డౌట్ లేదు. అంటే మిగతా రాష్ట్రాల వారికి ఆ ప్రేమ లేదని కాదు. కన్నడిగులు, తెలుగువారు, మలయాళీలు తమ మాతృభాషను మర్చిపోవడం లేదు. అలాగని ఇతర భాషల మీద ద్వేషం చూపడం లేదు. దీన్ని గుర్తిస్తే సమస్య ఉండదు.

▪ ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి
బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

స్ఫూర్తి ప్రదాత..

నీ స్థైర్యానికి నిలువెల్లా వందనం
నీ తెగువ స్ఫూర్తి చందనం
ఓ సునీతా విలియమ్స్
భూమ్మీద నీ పాద ముద్రలు మోపి
స్ఫూర్తి వచనమై వర్ధిల్లు
దీప్తి వాక్యమై నినదించు

నీ స్పేస్ వాక్ ఘనత
అబ్బుర పడుతుంది జనత
అంతరిక్ష వ్యోమగామి
అందుకోవమ్మా.. ఆత్మీయ సెల్యూట్

సంక్షుభిత సమయాన
నీ స్థితప్రజ్ఞత స్థిర విజ్ఞత
అనన్యం అమేయం అమోఘం
జయహో విలియమ్స్ జయహో
మానవ సంకల్ప శక్తికి
మణిహారం తొడిగిన సునీతా....
బ్రహ్మరథం పడుతుంది నీకు భవిత...

నీ పట్టుదల మాకు అమరం
చరిత్ర పుటల్లో నువ్వు కీర్తి శిఖరం
ఓ శాస్త్రీయ పరిశోధనా విధాతా
రాబోవు తరాలకు స్ఫూర్తి ప్రదాతా
జయహో.. సునీతా జయహో..!

– కటుకోఝ్వల రమేష్



విశ్వ సోదరి..


నవ మాసాల మాతృగర్భంలా
అంతరిక్షంలో అలుపెరగక
శ్వాస కోశంతో పోరాటం
తొమ్మినెలల అకుంఠిత దీక్ష
విశ్వానికి ఆత్మవిశ్వాసం అందిస్తూ
అంతరిక్ష శాస్త్రానికి ఆభరణమై
ఆత్మవిశ్వాసానికి కొత్త నిర్వచనం
సునీతా విలియమ్స్ రాకతో
పుడమి పునీతం.
నిన్ను సూర్యుణ్ణి చూసినట్టు
తలెత్తుకొని చూస్తున్నామమ్మా!

– ఈతకోట సుబ్బారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ఫ్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



ఆంధ్రజ్యోతి





మల్లవల్లికి కొత్త కళ

అశోక్ లేల్యాండ్ బస్ బాడీబిల్డింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవంతో సందడి

- మంత్రి నారా లోకేశ్‌కు అడుగడుగునా నీరాజనం
- అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
- గజమాలతో టీడీపీ కార్యకర్తల స్వాగతం

హనుమాన్ జంక్షన్/హనుమాన్ జంక్షన్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు బుధవారం హనుమాన్ జంక్షన్‌లో ఘనస్వాగతం లభించింది. మల్లవల్లిలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో హిందూజా గ్రూప్ అనుబంధ సంస్థ అశోక్ లేల్యాండ్ స్థాపించిన ఎలక్ట్రికల్, డీజిల్ బస్సు బాడీబిల్డింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా ఇండస్ట్రియల్ పార్కుకు రోడ్డు మార్గాన వెళ్తూ.. మార్గంమధ్యలో అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి తమలపాకులతో పూజ నిర్వహించారు. మూలవిరాట్ విగ్రహానికి కూడా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ పర్యవేక్షణలో ఆలయ ఈవో తారకేశ్వరరావు, అర్చకులు.. లోకేశ్‌కు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు లోకేశ్‌ను భూగర్భ గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మిగతా 6లో..

రాష్ట్రానికే గర్వకారణం

అశోక్ లేల్యాండ్ చైర్మన్ ధీరజ్ హిందూజా

మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేల్యాండ్ ప్లాంటును మంత్రి నారా లోకేశ్ ప్రారంభించి ఎంహెచ్‌ఆర్టీసీ (మహారాష్ట్ర) బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలతో, అధునాతన సాంకేతికతతో ఎలక్ట్రికల్ బస్సుల తయారీకి అనువుగా ఈ యూనిట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా అశోక్ లేల్యాండ్ చైర్మన్ ధీరజ్ హిందూజా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రగతిశీల పారిశ్రామిక విధానాన్ని రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు ప్రేరణతోనే ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నామని, ఇందుకు చాలా సంతోషిస్తున్నామని చెప్పారు. అశోక్ లేల్యాండ్ సీఈవో మాట్లాడుతూ కొత్త ప్లాంటు ప్రారంభంతో అశోక్ లేలాండ్ బస్సు దేశంలోనే మొదటి స్థానాన్ని, ప్రపంచవ్యాప్తంగా 5వ స్థానాన్ని పటిష్ఠం చేసుకుందన్నారు. ఈ యూనిట్ ప్రారంభించిన మొదటి రోజు నుంచి 100 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయడం ప్రారంభిస్తోందన్నారు. కొత్త ప్లాంట్‌లో అత్యాధునిక పరికరాలు అధికస్థాయి ఆటోమేషన్‌తో అమర్చబడి ఉన్నాయని తెలిపారు. దీనివల్ల అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో ఉత్పత్తులను తయారు చేయవచ్చని ఆయన చెప్పారు.

తప్పతాగి.. దాష్టీకం

భక్తిభావంతో కొనసాగాల్సిన తిరుపతమ్మ తిరునాళ్లలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఆధ్యాత్మికతకు ఆలవాలంగా జరగాల్సిన వేడుకల్లో వికృతచేష్టలతో రెచ్చిపోయారు. మందుకొట్టారు.. మత్తులో డ్యాన్సులు వేశారు.. డీజేలతో హోరెత్తించారు.. బైకులతో విన్యాసాలు చేశారు.. ఇతర పార్టీల వారిపై రాళ్లు రువ్వారు.. అడ్డొచ్చిన పోలీసులపై ప్రతాపం చూపారు. ప్రతిష్ఠాత్మకమైన తిరుపతమ్మ తిరునాళ్లలో మంగళవారం రాత్రి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలకు వైసీపీ అల్లరిమూకలే ప్రధాన కారణమని తెలుస్తోంది.

తిరుపతమ్మ తిరునాళ్లలో ఘర్షణకు వైసీపీ కార్యకర్తలే కారణం

ప్రభలు, డీజేలతో ఒకటే పాటల హోరు





అమ్మవారి పసుపు కుంకుమల వద్ద కిక్కిరిసిన భక్తులను అదుపు చేయలేక పోయిన పోలీసులు (ఇన్‌సెట్‌లో) వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పోలీస్

- తప్పతాగి రోడ్ల వెంట అసభ్య నృత్యాలు
- ద్విచక్రవాహనాలతో ప్రమాదకర విన్యాసాలు
- టీడీపీ, జనసేన వాహనాలపైకి రాళ్లు
- అడ్డొచ్చిన పోలీసులపై కూడా దాడి
- వైసీపీ వికృతాలను ఆపలేకపోయిన పోలీసులు
- 16 మందికి రిమాండ్.. బందరు జైలుకు తరలింపు

జగ్గయ్యపేట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం రాత్రి పెనుగంచిప్రోలు వైసీపీ ఆధ్వర్యంలో భారీగా డీజే వాహనాలు ఏర్పాటు చేసుకున్నారు. జగ్గయ్యపేట రోడ్డులోని తంబరేణి ఫంక్షన్ హాల్ నుంచి ఆలయం వరకు ర్యాలీగా బయల్దేరిన ఆ పార్టీ కార్యకర్తలు పెనుగంచిప్రోలు గ్రామంలో స్వైరవిహారం చేశారు. రోడ్లపై నృత్యాలు, ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. వారి వికృతచేష్టలకు పిల్లలు, మహిళలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడిపోయారు. డీజే వాహనాలు కిలోమీటర్ ప్రయాణించేందుకు సుమారు 7 గంటల సమయం పట్టింది. ఎట్టకేలకు రాత్రి 2 గంటల సమయంలో పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ మిగతా 6లో..

జెయింట్ వీల్ అనుమతుల్లో అనుమానాలు



జగ్గయ్యపేట రూరల్ : తిరునాళ్లలో యువకుడి మృతికి అధికారుల సమన్వయలోపమే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షల మంది హాజరయ్యే తిరునాళ్ల ప్రాంగణంలో భారీ జెయింట్ వీల్స్‌కు అనుమతినివ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరునాళ్లలో ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు జెయింట్ వీల్స్‌ను తిప్పుకోవడానికి కాకాని శేషగిరిరావు అనే వ్యక్తి రూ.11 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. జీఎస్టీ 18 శాతం కలిపి చెల్లించిన పాటదారుడు తన అనుమతులను మరొక వ్యక్తికి రూ.18 లక్షలకు అమ్ముకున్నట్లు సమాచారం. ఆ వ్యక్తి జెయింట్ వీల్స్‌తో పాటు క్రాస్ వీల్, ట్రైన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అతని వ్యాపారానికి పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, దేవదాయ, విద్యుత్ శాఖలు అనుమతి ఇచ్చారు. పరికరాలకు పరీక్షలు నిర్వహించి అనుమతి ఇవ్వాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఆ పని చేయలేదు. ఆర్అండ్‌బీ శాఖ ఒప్పుకోకపోయినా నిర్వాహకులు ఎలా ఏర్పాటుచేశారన్న ప్రశ్నలు కూడా ఉదయిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఆలయ అధికారులు లీజు వేలం నిర్వహించిన స్థలం మునేరు సబ్ డివిజన్ స్థలం. ఆలయానికి సమీపంలో ఖాళీగా ఉన్న ఈ స్థలంలో జెయింట్ వీల్ నిర్వహించేందుకు ఏకంగా ఆలయ అధికారులు వేలం నిర్వహించడం గమనార్హం. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవో కిశోర్‌ను నివేదిక కోరినట్లు తెలిసింది.



షాట్‌పుట్‌లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



క్యారమ్స్ ఆడుతున్న నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



షాట్‌పుట్‌లో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఆట అదుర్స్

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న క్రీడా పోటీల్లో ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నిత్యం ప్రజా సమస్యలు, రాజకీయాల్లో తలమునకలై ఉండేవారు.. వాటన్నింటినీ పక్కనపెట్టి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నారు. బుధవారం జరిగిన పరుగు పందెం, త్రోబాల్, టెన్నిస్, క్రికెట్ పోటీల్లో ఉల్లాసంగా తలపడ్డారు.

గందరగోళం..!

పిల్లలకు ఆధార్ ఈకేవైసీ చేయకపోతే రేషన్ రానట్టే..!

వీఆర్వోలకు ఇచ్చిన జాబితాలన్నీ గజిబిజి

- సిరీస్ కోడ్‌లు లేకపోవటంతో వీఆర్వోల్లో తికమక
- డీలర్లకు అప్పగించాలని చేతులెత్తేస్తున్న వైనం
- తమకు తెలియదని తప్పించుకుంటున్న డీలర్లు



రెండు జిల్లాల్లో రేషన్‌కార్డుల ఈకేవైసీ అంశం గందరగోళంగా మారింది. ఈ విషయాన్ని పౌరసరఫరాల సంస్థ అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవటంతో కార్డుల్లో పిల్లలకు సంబంధించి ఈకేవైసీ పూర్తిచేస్తేనే వచ్చేనెల నుంచి నిత్యావసరాల కోటా అందే అవకాశముంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా రేషన్ కార్డుదారుల పిల్లలకు ఈకేవైసీ జరగకపోయినా ఇప్పటి వరకు నిత్యావసరాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ జరగని వాటిని తక్షణమే చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్వే బాధ్యతలను గ్రామ సచివాలయాల్లో పనిచేసే రెవెన్యూ వీఆర్వోలపై మోపారు. వాస్తవానికి సివిల్ సప్లయిస్‌కే దీని బాధ్యతలు అప్పగిస్తే ఎలాంటి గందరగోళం లేకుండా ఈకేవైసీ పూర్తయ్యేది. అందుకు భిన్నంగా వీఆర్వోలకు అప్పగించడం వల్ల.. ఇప్పటికే పీ4 వంటి అనేక సర్వేలు, ఇతర విధుల్లో తలమునకలుగా ఉన్న సచివాలయ వీఆర్వోలు ఈకేవైసీ అంశాన్ని పక్కన పెట్టేశారు. ఫలితంగా మార్చి మూడోవారం పూర్తవుతున్నా ఈకేవైసీ పూర్తికాలేదు. కృష్ణాజిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారులు కనీసం అవగాహన అయినా కల్పిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అది కూడా జరగట్లేదు.

డేటాషీట్లతో వీఆర్వోల తికమక

వీఆర్వోలకు అందిన డేటాషీట్లు గందరగోళంగా ఉన్నాయి. డేటా ప్రకారం చూస్తే వారికి కార్డుదారులెవరో తెలియట్లేదు. దీనికి వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్చిన రైస్‌కార్డులే కారణం.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

ఇటీవలే పిల్లలు ఆధార్‌కార్డులు పొంది ఉంటే, ఇప్పటికీ ఈకేవైసీ చేయించుకోకుంటే వచ్చేనెల నుంచి రేషన్ బియ్యం పొందేందుకు వీలుండదని అధికారులు చెబుతున్నారు. ఈకేవైసీ కోసం సాఫ్ట్‌వేర్‌ను కూడా మారుస్తున్నారు. ఇప్పటికే ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారి వివరాలను ఆయా గ్రామ పంచాయతీల్లోని వీఆర్వోలకు అందజేశారు. అక్కడకు వెళ్లి, వివరాలు తెలియజేసి, తక్షణం పిల్లలకు ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకప్పుడు తెల్లకార్డులు డబ్ల్యుఏపీ కోడ్‌తో ప్రారంభమయ్యేవి. ఆ తర్వాత టీఏపీ సిరీస్‌తో కార్డులు వచ్చాయి. ఆ తర్వాత రచ్చబండలు నిర్వహించిన క్రమంలో ఆర్ఏపీ సిరీస్‌తో రేషన్ కార్డులు వచ్చాయి. అనంతరం వైఏపీ కార్డులు వచ్చాయి. ఈ కార్డులన్నీ ఒక సిరీస్‌తోనే ఉంటాయి. ఏ రాష్ట్రానికి, ఏ మండలానికి, ఏ డిపోకు చెందినవో వీటిద్వారా తెలిసేది. కొండంత జాబితాలు ఇచ్చినా కూడా చాలా తేలిగ్గా, మండలాలవారీగా, గ్రామాలవారీగా, డిపోలవారీగా విభజించుకునే అవకాశం ఉండేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీటన్నింటినీ రద్దుచేసి రైస్ కార్డులను మిగతా 6లో..

పేరకలపాడు పీఏసీఎస్ నిధులు హాంఫట్

రూ.4 లక్షలు దోచేసిన వైసీపీ చైర్‌పర్సన్

చర్యలు తీసుకోవాలంటూ గ్రాసుస్తుల డిమాండ్



పిల్లర్ల దశలో నిలిచిపోయిన పీఏసీఎస్ భవన నిర్మాణ పనులు

(కంచికచర్ల-ఆంధ్రజ్యోతి) : పేరకలపాడు పీఏసీఎస్‌కు చెందిన రూ.4 లక్షల నిధులు దుర్వినియోగమైన ఘటనపై చర్యలకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. సొసైటీ భవనం, గిడ్డంగి నిర్మాణం కోసం తీసుకున్న ఈ నిధులు దుర్వినియోగం చేసిన నామినేటెడ్ చైర్‌పర్సన్‌పై ఏళ్లు గడుస్తున్నప్పటికీ సహకార శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది.

జరిగింది ఇదీ..

కంచికచర్ల మండలం పేరకలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయ భవనం దెబ్బతినగా, నూతన భవనంతో పాటు గిడ్డంగి నిర్మించేందుకు 2022లో కేడీసీసీ బ్యాంకు రూ.20 లక్షలకు పైగా నిధులు మంజూరు చేసింది. భవనం, గిడ్డంగి నిర్మించేందుకు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, అప్పటి మిగతా 6లో..

అసమ్మతికే ఓటు

తిరువూరు మునిసిపాలిటీలో సద్దుమణిగిన వివాదం

15 మంది వైసీపీ కౌన్సిలర్లతో అధినేత జగన్ భేటీ

- అసమ్మతి వర్గానికే ఓటు వేస్తూ నిర్ణయం
- ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని ఆదేశం
- కొత్త చైర్మన్‌గా మోదుగు ప్రసాద్ ఎంపిక

అసమ్మతివాదులు టీడీపీవైపు మళ్లకుండా ఉండేందుకే..



వైసీపీ అధినేత జగన్‌తో చైర్‌పర్సన్ అభ్యర్థి మోదుగు ప్రసాద్

తిరువూరు మునిసిపాలిటీలో కొంతకాలంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలకు బుధవారం తెరపడింది. సొంత పార్టీ కౌన్సిలర్లను కాపాడుకోవటానికి వైసీపీ అధినేత జగన్ అసమ్మతివాదులకే ఓటేశారు. ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి పదవి నుంచి దిగిపోవాలని ఆదేశించగా, ఆమె బాధాతప్త హృదయంతో అంగీకారం తెలిపారు. దీంతో అసమ్మతి వర్గమే విజయం సాధించినట్లైంది.

తిరువూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పక్షం రోజులుగా తిరువూరు మునిసిపాలిటీలో జరుగుతున్న అధికారపక్ష అసమ్మతి పోరుకు సంబంధించి బుధవారం తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలోని 15 మంది వైసీపీ కౌన్సిలర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయిని గద్దె దింపి తమకు అవకాశం కల్పించాలని అసమ్మతి నేత మోదుగు ప్రసాద్ జగన్ వద్ద ప్రతిపాదన చేశారు. అయితే, అసమ్మతివాదులు ఎక్కడ టీడీపీవైపు మళ్లుతారోనని జగన్ వెంటనే ఈ నిర్ణయం తీసుకున్నారు. చైర్‌పర్సన్ రాజీనామాకు ఆదేశించారు. అయితే, ఆమె జగన్ దగ్గర అంగీకరించినప్పటికీ బాధాతప్త హృదయంతోనే కనిపించారు. అసమ్మతిని అణచివేయాల్సింది పోయి, వారికి మద్దతుగా నిలవటంపై ఆమె సన్నిహితుల వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అయితే, తాను తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న మునిసిపాలిటీని మిగతా 6లో..

ఎన్టీటీపీఎస్‌లో భారీ అగ్నిప్రమాదం

- స్టేజ్-1 బంకర్‌కు వెళ్లే కన్వేయర్ బెల్టుకు మంటలు
- 50మీ. బెల్టు దగ్ధం.. రూ.1.50 కోట్ల ఆస్తినష్టం



కన్వేయర్ బెల్టుకు అంటుకున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇబ్రహీంపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్టేజ్-1 బంకర్‌కు వెళ్లే కన్వేయర్ బెల్ట్‌కు బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో 490 మీటర్ల పొడవైన బెల్టులో 50 మీటర్ల వరకు పూర్తిగా కాలిపోయింది. అయినప్పటికీ మొత్తం బెల్టును మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బెల్టు విలువ సుమారు రూ.140 కోట్లు ఉంటుందని చెబుతున్నారు. ప్రమాద సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది దాదాపు 2గంటల పాట శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇటీవల బ్రాయిలర్‌లో పెయింట్ పనిచేస్తూ ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందిన ఘటనను మర్చిపోకముందే ఈ అగ్నిప్రమాదం జరగడం వెనుక అధికారుల పర్యవేక్షణలోపమే మిగతా 6లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-18 (గురువారం సాయంత్రం)

సహర్ : 04-59 (శుక్రవారం ఉదయం)

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

పిచ్చుకలను కాపాడుకుందాం!



- ప్రమాదంలో పర్యావరణం.. భావితరాలను రక్షించుకుందాం
- తగ్గిపోయిన పిచ్చుకలను పెంపొందింపచేద్దాం..
- పక్షుల కోసం నీరు, ఆహారాన్ని అందిద్దాం..

6లో

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా..

పిచ్చుకలను కాపాడుకుందాం!






- ప్రమాదంలో పర్యావరణం.. భావితరాలను రక్షించుకుందాం
- తగ్గిపోయిన పిచ్చుకలను పెంపొందింపచేద్దాం..
- పక్షుల కోసం నీరు, ఆహారాన్ని అందిద్దాం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల పాత్ర ఎంతో కీలకమైనది. నేడు నగరీకరణతో వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయి పర్యావరణం ప్రమాదకర స్థితిలో పడింది. పిచ్చుకలు తగ్గిపోవడానికి మానవ తప్పిదాలు అనేకం ఉన్నాయనే చెప్పాలి. ఒకప్పుడు పూరిళ్ల వసారాల్లో, గొడ్ల చావిడ్లలో పిచ్చుకలు గూళ్లు పెట్టుకునేవి. పంట పొలాల్లో బావుల దగ్గర పెద్ద ఎత్తున పిచ్చుక గూళ్లు కనిపించేవి. వరి, మొక్కజొన్న అపరాల కోతల సమయంలో పొలాల్లో గింజలు, కీటకాలను తిని బావుల వద్ద నీరు తాగి అక్కడే చెట్లకు గూళ్లు కట్టుకొని సంతానాన్ని ఉత్పత్తి చేసుకునేవి. కాలక్రమంలో బావులు స్థానంలో బోర్లు రావడం, వ్యవసాయ పంటల సాగులో గణనీయమైన మార్పుల కారణంగా పిచ్చుకల సంఖ్య బాగా పడిపోయింది. ముఖ్యంగా ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసే సెల్ టవర్ల నుంచి వచ్చే రేడియేషన్, వాతావరణ కాలుష్యం వల్ల పిచ్చుకల సంఖ్య భారీగా తగ్గిపోయింది. పిచ్చుకలను కాపాడుకోకుంటే భావితరాలకు వాటిని మ్యూజియంలోనే చూడాల్సిన పరిస్థితి వస్తుంది. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహిస్తారు. పిచ్చుకల సంరక్షణ, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచడమే దీని ప్రధాన లక్ష్యం పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకలు ఎలాంటి పాత్ర పోషిస్తాయో, కీటకాల నియంత్రణకు ఎలా దోహదం చేస్తాయో, విత్తన వ్యాప్తి, పుష్పాల పరాగ సంపర్కానికి ఎలా ఉపయోగపతాయో తెలియజేస్తూ.. పట్టణీకరణ, వ్యవసాయ యాంత్రీకరణ, మార్పులు, సెల్ టవర్స్ ఇతర కాలుష్యం వంటి కారణాల వల్ల పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గుతున్న విషయాన్ని.. పిచ్చుకల సంరక్షణకు సంబంధించిన విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావడం, ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ప్రతి ఏడాది మార్చి 20న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం పిచ్చుకల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ, పర్యావరణ వ్యవస్థలో వాటి ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచడమే. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని మొదటి సారిగా 2010లో నిర్వహించారు. ఇది 'నేచర్ ఫరెవర్ సొసైటీ (భారతదేశం) ఎకో-సిస్ యాక్షన్ ఫౌండేషన్ (ఫ్రాన్స్)ల సహకారంతో ప్రారంభించబడింది.

● పిచ్చుకలు మానవులకు చాలా దగ్గరగా ఉండే పక్షులు.. అయినా ఇటీవల వాటి సంఖ్య గణనీయంగా తగ్గింది. దీనికి ప్రధాన కారణాలు.. పట్టణీకరణ వల్ల సహజ ఆవాసాల నాశనం, రసాయన ఎరువులు మరియు కీటకనాశకాల వాడకం, విద్యుత్ అస్కాంత వికిరణం (మొబైల్ టవర్లు) ప్రభావం, వాతావరణ మార్పులు, కాలుష్యం.

పిచ్చుకలు పర్యావరణ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి.. కీటకాలను తిని వాటి సంఖ్యను నియంత్రిస్తాయి. విత్తనాలను వ్యాప్తి చేయడంలో సహాయపడతాయి. పుష్పాల పరాపరాగ సంపర్కానికి దోహదపడతాయి.

పిచ్చుకల సంరక్షణ చర్యలు

ప్రజలు పిచ్చుకలను రక్షించడానికి, వాటి ఆవాసాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలి. పిచ్చుకలకు సహజ ఆవాసాలను సృష్టించడం, నీటి పాత్రలు, ఆహారాన్ని అందించడం, రసాయన ఎరువులు, కీటకనాశకాల వాడకాన్ని తగ్గించడం. సెమినార్లు, వర్క్‌షాపులు, ప్రచార కార్యక్రమాల నిర్వహణ, పిచ్చుకల గూళ్లు, నీటి పాత్రలను ఏర్పాటు చేయడం.

మచ్చిక చేసుకుందాం..

» ఆకట్టుకుంటున్న స్ఫూర్తి శ్రీనివాస్ చిత్రాలు



బెంజిసర్కిల్ : పిచ్చుకలను మచ్చిక చేసుకుందామా నినాదంతో నగరానికి చెందిన చిత్రకారుడు స్ఫూర్తి శ్రీనివాస్ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. దశాబ్దకాలంగా ఆయన అంతరించిపోతున్న పిచ్చుకలను రక్షించావలనే భావనతో సుమారు వందకుపైగా చిత్రాలను వేసి ప్రదర్శిస్తున్నారు. ఆధునిక సమాజంలో ప్రకృతి వైపరిత్యాలు, ప్రపంచీకరణ, సాంకేతిక అడ్డంకులతో అంతరించిపోతున్న పిచ్చుకలపై ఆయన కళ్లకు కట్టినట్టు చిత్రాలు వేసి భావితరాలకు పిచ్చుకలను అందించాలనే ఉద్దేశ్యంతో అవగాహన కల్పిస్తున్నట్టు స్ఫూర్తి శ్రీనివాస్(పిచ్చుకల శ్రీనివాస్) తెలిపారు. పరిశోధకులకు బర్డ్ హౌస్‌లను కూడా అందిస్తున్నట్టు పేర్కొన్నారు.


తాను గీసిన చిత్రంతో శ్రీనివాస్


అమరావతిలో పర్యటించిన ప్రపంచబ్యాంక్ బృందం సభ్యులు

అమరావతిలో ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన

కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం పర్యటించింది. ప్రపంచ బ్యాంకు నిధుల ద్వారా నిర్మాణం చేపట్టనున్న వివిధ నిర్మాణాలను బృంద సభ్యులు పరిశీలించారు. ప్రధానంగా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీ సీ) చేపడుతున్న ప్రాజెక్టులో ముఖ్యమైన అమరావతి వరద నియంత్రణలో కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్‌పై ఉండవల్లిలోని కొండవీటి వాగు ఎత్తిపోతల పథకంలో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి వరద నియంత్రణకు ఏడీసీ చేపడుతున్న నిర్మాణాలను ప్రపంచ బ్యాంకు బృందాని కి వివరించారు. అక్కడ ఏర్పాటు చేసిన చాయాచిత్ర ప్రదర్శన, బృహత్తర ప్రణాళికలను విశదీకరించారు. రాజధాని పరిధిలో ప్రవహించే వాగులు, కాలవల సామర్థ్యంపై వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ-3) రహదారిని వెంకటపాలెం నుంచి బోరుపాలెం వరకు పరిశీలించారు. ఈ పర్యటనలో ఏడీ సీ చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, ఐపీడీ హెడ్ డాక్టర్ కె.వి.గణేష్‌బాబు, సీనియర్ ఇన్‌ఫ్రా ప్లానర్ డి.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ పరిధిలోని సుమారు 60పైగా కొండప్రాంతాల్లో నివాసముంటున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కృష్ణానది ఒడ్డున సుమారు 60వేల మందికి పైగా నివాసం ఉంటున్నారని, వరదలు వచ్చినప్పుడు చంద్రబాబు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారని, ఇరిగేషన్ స్థలాలు కావడంతో ఆ స్థలాలు వారి పేరున రిజిస్ట్రేషన్ కావడం లేదని, సుప్రీం కోర్టు స్టేలో ఉండటంతో కేంద్ర ప్రభుత్వం, ఇతరశాఖల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.


మాట్లాడుతున్న ప్రియదర్శి, చిత్రంలో జగదీశ్, శివాజీ, రోషన్, శ్రీదేవి

నగరంలో 'కోర్ట్' సందడి

లబ్బీపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో కోర్టు చిత్ర బృం దం సందడి చేసింది. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పేందుకు విజయయాత్ర చేపట్టామని, ప్రతి థియేటర్లలో ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన సంతోషాన్ని కలిగిస్తుందని పే ర్కొంది. బుధవారం ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నటుడు శివాజీ మాట్లాడుతూ 13ఏళ్ల తరువాత వెండితెరపై రీ ఎంట్రీ ఇచ్చానని మంగపతి క్యారెక్టర్ ప్రేక్షకుల మునస్సులో ఎప్పటి కీ నిలిచిపోతుందన్నారు. నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ ఈ చి త్రం విదేశాల్లోనూ చిత్రం బ్లాక్‌బస్టర్ అయిందన్నారు. దర్శకుడు రామ్ జగదీష్ మాట్లాడుతూ ఈ చిత్రం తీసేముందు ఎంతో మంది న్యాయవాదులను కలిశానని, ఎన్నో పోక్సో కేసులను స్టడీ చేసి రియాల్టీకి దగ్గరగా నిర్మించామన్నారు. హీరో రోషన్, హీరోయిన్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆరేళ్ల తర్వాత.. 30న ఉగాది పురస్కారాలు

విజయవాడ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల విరామం తర్వాత ఉగాది పురస్కారాల ప్రదానోత్సవాన్ని పునరుద్ధరించనున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు పురస్కారాలను నిలిపేయడంతో ఎంతో మంది ప్రతిభావంతులు తమ సేవలకు గౌరవాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని పునరుద్ధరించి ఉగాది సందర్భంగా మార్చి 30న నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. పంచాంగ శ్రవణంతో పాటు సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రకళ, శిల్పకళ, నాటక కళ, జానపద కళలు, అవధానం, మిమిక్రీ, హరికథ, జర్నలిజం, వైద్యసేవలు, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన వారిని ప్రభుత్వం ఘనంగా స త్కరించనుంది. ప్రతిష్టాత్మక కళారత్న (హంస) అవార్డు గ్రహీతలకు రూ.50వేల నగదు, హంస ప్రతిమ, శాలువా, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. అలాగే ఉగాది పురస్కారం కింద ఎంపికైన ప్రతిభావంతులకు రూ.10వేల నగదు, ప్రశంసా పత్రం ఇవ్వనున్నారు. అవార్డుల ఎంపికకు మండలి బుద్ధప్రసాద్ (అధ్యక్షుడు), పోడపాటి తేజస్వి, గుమ్మడి గోపాలకృష్ణ, పద్మశ్రీ సుమతి రామ్మోహన్ రావు, మల్లాది సూరిబాబు, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, బాబూజీ, పాపినేని శివశంకర్, ప్రొఫెసర్ దాసు, అజయ్‌జైన్, ఆర్.మల్లిఖార్జునరావు సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ ఉత్సవంలో దేవదాయ, వ్యవసాయం, తోటల సాగు శాఖలు, తిరుమల తిరుపతి దేవస్థానం వంటి సంస్థలు పాల్గొంటున్నాయి. తెలుగు జాతి సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా ఈ ఉత్సవాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.

ఎన్టీటీపీఎస్‌లో భారీ అగ్నిప్రమాదం

(5వ పేజీ తరువాయి)

ప్రధాన కారణంగా తెలుస్తోంది. వారం క్రితమే భద్రత వారోత్సవాలంటూ హడావుడి చేసిన ఎన్టీటీపీఎస్ అధికారులు ప్రమాదాలను నివారించడంలో పూర్తి నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సమయపాలన లేకపోవడం, విధుల్లో ఉండాల్సిన అధికారులు బయటకు వచ్చి సొంత పనుల్లో నిమగ్నం కావడంతో పాటు వారి బాధ్యతారాహిత్యంతో ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

జిల్లాలో ఆతిథ్య రంగం అభివృద్ధి: కలెక్టర్

వన్‌టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయడం చేస్తున్నామని, ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో భాగస్వామ్య పక్షాల సమష్టి కృషితో ఆతిథ్య రంగం సహా సేవారంగ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు సీసీఎల్ఏ, జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. బుధవారం నగరంలోని హోటల్ హయత్ ప్లేస్‌లో స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ (ఎస్‌జీఎల్ఆర్) స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, పీ4 విధానం, టూరిజం సహా సేవా రంగ అభివృద్ధిపై చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ పర్యాటకుకుల ఎప్పటికీ గుర్తుండిపోయేలా మౌలిక వసతులతో ఆతిథ్యమివ్వాల్సిన అవసరముందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో ఉమ్మడి లక్ష్యాల సాధనకు వివిధ పక్షాల భాగస్వామ్యాన్ని ప్రోది చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ నగరంలో రాత్రి 12 గంటల వరకు హోటళ్లను తెరచి ఉంచుకునేలా ఇప్పటి నుంచి 3 నెలలపాటు అమలు చేసి తరువాత పరిస్థితిని విశ్లేషించి పొడిగింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరంలోని మూడు నియోజకవర్గాల్లోనూ ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.వీరాస్వామి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర్, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ ప్రతినిధులు హాజరయ్యారు.

తప్పతాగి.. దాష్టీకం

(5వ పేజీ తరువాయి)

సెంటర్‌కు చేరుకున్నారు. అప్పటికే తిరుపతమ్మ పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి పసుపు కుంకుమల బండి పెనుగంచిప్రోలు చేరుకుంది. ఆ బండి వెంట ట్రాక్టర్లు, ఎడ్లబళ్లు, డీజే వాహనాలు కూడా రావడంతో పోలీసులు వైసీపీ వాహనాలను నిలిపివేశారు. సుమారు గంటపాటు అనిగండ్లపాడు వాహనాలను ముందుకు నడిపించారు. ఈ క్రమంలో పార్టీలవారీగా ఏర్పాటు చేసుకున్న డీజేల్లో పాటలు పెట్టుకుని ఎవరికి వారు హడావుడి చేశారు. సుమారు గంటపాటు ఈ పరిస్థితి కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. రోడ్డు పక్కన ఉన్న రాళ్లకుప్ప నుంచి రాళ్లు తీసుకుని టీడీపీ, జనసేన వాహనాల పైకి విసిరారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు చాలామంది టీడీపీ, జనసేన కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఆ సమయంలో స్థానిక పోలీసులెవరూ అక్కడ లేరు. ఎస్ఐ కూడా విధులను విడిచిపెట్టి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. పరిస్థితి విషమిస్తుండటంతో ప్రత్యేక విధులపై వచ్చిన విజయవాడ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్ర సమీపంలో ఉన్న సిబ్బందిని తీసుకుని హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి రాక్షసంగా ప్రవర్తిస్తున్న వైసీపీ కార్యకర్తలు వారిపై కూడా రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి.

శాఖల మధ్య సమన్వయలోపం

అల్లర్లు జరిగే అవకాశం ఉందని తెలిసినా.. తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయకపోవటం, శాఖల మధ్య సమన్వయం లేకపోవటం వంటి పరిణామాలే ఈ పరిస్థితికి ఆజ్యం పోస్తున్నాయి. అమ్మవారి పుట్టినిల్లయిన అనిగండ్లపాడు నుంచి చీర, సారె, పసుపు కుంకుమలు ఊరేగింపుగా తీసుకురావడం తిరునాళ్లలో ముఖ్యమైన ఘట్టం. దీనిని తిలకించేందుకు ఈ ఏడాది సుమారు 70 వేల మంది భక్తులు వస్తుంటారు. బందోబస్తు నిమిత్తం సుమారు 500 మంది పోలీసు సిబ్బందిని కూడా కేటాయించారు. అంత మంది సిబ్బంది ఉన్నా విధినిర్వహణలో అలసత్వం వల్ల అల్లర్లు జరిగాయి. చివరకు నలుగురు పోలీసు సిబ్బందిపై అల్లరిమూకలు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. పోలీస్ స్టేషన్ ఎదుటే జరిగిన ఈ ఘటన విస్మయానికి గురిచేసింది. ఈ ఘటనపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లరిమూకలతో పాటు వారిని కట్టడి చేయడంలో విఫలమైన పోలీసులపై మండిపడుతున్నారు.

పోలీసుల ఉదాశీనత

వైసీపీ ర్యాలీ ఆసాంతం భయానక వాతావరణంలో సాగుతున్నా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. పసుపు కుంకుమల బండి ఆలయం వద్దకు చేరగానే పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు, వాహనాలతో పాటు పోలీసులపై కూడా దాడి చేసిన అల్లరిమూకలు స్టేషన్ ఎదుటే స్వైరవిహారం చేసినా కనీసం వారిని నిలువరించలేకపోయారు. అంత విధ్వంసం సృష్టించిన కార్యకర్తలను వెనుకేసుకొచ్చిన జగ్గయ్యపేట వైసీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు తన అనుచరులతో స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం కొసమెరుపు. అల్లరిమూకలను సమర్థిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు.

16 మందికి రిమాండ్

పెనుగంచిప్రోలు తిరునాళ్లలో అల్లర్లకు పాల్పడిన నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. సోమవారం రాత్రి తిరునాళ్ల ఊరేగింపులో వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. ఘటనలో కూటమి కార్యకర్తలతో పాటు నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. దీనిని సిరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈటూరి వెంకటేశ్వరరావు, తూము గోపి, గనిసెట్టి మణికంట, యర్రంశెట్టి నాగబాబు, కుంచాల సాయి, వేల్పుల అజయ్‌కుమార్, దేరంగుల యాదగిరి, జొన్నలగడ్డ శ్రీహరి, శివరామ్‌బొట్ల నాగ వెంకటేష్, చేని మహేష్, పసుపులేటి వరుణ్ కుమార్, దార గౌతమ్, నందిపాము పవన్‌కుమార్, దాసరి నాగబాబు, కాకాని సంజయ్, షేక్ మస్తాన్‌వలిలను అరెస్టు చేసి బుధవారం జగ్గయ్యపేట కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు మార్చి 2 వరకు రిమాండ్ విధించారు. వారిని మచిలీపట్నం జిల్లా జైలుకు తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా మరికొందరిపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు పోలీసులు తెలిపారు.


పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మృతుడి బంధువుల ఆందోళన

అధికారుల నిర్లక్ష్యంతోనే తిరునాళ్లలో మణికంఠ చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. సాయికుమార్ మృతదేహంతో మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. సుమారు గంట సేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, తదితరులు మృతుడి తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఆందోళన విరమించారు. లీజుదారుడైన శేషగిరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసమ్మతికే ఓటు

(5వ పేజీ తరువాయి)

కోల్పోవాల్సి వస్తుందని జగన్ హెచ్చరించారు.

ఆది నుంచీ వివాదమే..

మునిసిపల్ బోర్డు వైసీపీ కైవసమైన నాటి నుంచి చైర్‌పర్సన్ విషయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రస్తుతం బోర్డు ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నాటి ఒప్పందం అమలు చేయాలని మోదుగు ప్రసాద్ ఆధ్వర్యంలోని కొందరు సభ్యులు అవిశ్వాసం బాట పట్టారు. సమస్యను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా సద్దుమణగలే దు. ఈ తరుణంలో పంచాయితీని తాడేపల్లికి మార్చారు. పార్టీ అధ్యక్షుడి సూచనతో చైర్‌పర్సన్‌గా మోదుగు ప్రసాద్ ఎంపికయ్యారు.

పేరకలపాడు పీఏసీఎస్ నిధులు హాంఫట్

(5వ పేజీ తరువాయి)

సొసైటీ నామినేటెడ్ చైర్‌పర్సన్ పురుషోత్తమ్ మొదటి విడతగా ఆ ఏడాది ఫిబ్రవరిలో రూ.10 లక్షలు తీసుకున్నాడు. అప్పటి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, నాటి కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతం సీఆర్‌డీఏ పరిధిలో ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణ పనులు ప్రారంభించారు. చైర్‌పర్సన్ సుమారు రూ.6 లక్షల విలువైన పనులు చేయించారు. సీఆర్‌డీఏ అనుమతి లేనందున అప్పట్లో వివాదం ఏర్పడటం, కొందరు కోర్టుకు వెళ్లటంతో పిల్లర్ల స్థాయిలోనే పనులు ఆగిపోయాయి. ఈలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొద్ది రోజులకు వైసీపీ నేత పురుషోత్తమ్ నామినేటెడ్ పదవి పోయింది. జరిగిన పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ఎం.బుక్ రికార్డు చేయగా, రూ.5.80 లక్షల విలువైన పని జరిగినట్టుగా తేలింది. మిగతా సొమ్మును పురుషోత్తమ్ తిరిగి సొసైటీకి జమ చేయలేదు. రూ.4 లక్షలకు పైగా సొమ్ము దుర్వినియోగం విషయమై అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. సదరు వైసీపీ నేత ఇప్పటి వరకు సొమ్ము తిరిగి జమ చేయలేదు. అయినప్పటికీ సహకార శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండటాన్ని గ్రామస్థులు ఆక్షేపిస్తున్నారు. వైసీపీ నేత నుంచి అధికారులు ఎందుకు నిధులు రికవరీ చేయటం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సొసైటీ కార్యదర్శి గద్దె వీరభద్రరావును ప్రశ్నించగా, నిధుల దుర్వినియోగంపై అప్పటి చైర్‌పర్సన్ పురుషోత్తమ్‌కు నోటీసులు ఇచ్చామన్నారు. కాగా, మండలంలో వేములపల్లి, కంచికచర్ల సొసైటీలకు సంబంధించి కార్యాలయ భవనాలు, గిడ్డంగుల నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి.

గందరగోళం..!

(5వ పేజీ తరువాయి)

జారీ చేసింది. ఓ ప్రత్యేక నెంబర్‌ను ఇచ్చింది. దీని ప్రాతిపదికన ఇచ్చిన డేటా ద్వారా ఎక్కడి కార్డులన్నవి వీఆర్వోలకు అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. దీంతో తమకున్న అనేక పని ఒత్తిళ్ల కారణంగా వీటిని పక్కన పెట్టేశారు. వారంలో రేషన్ కోటా విడుదలకు చర్యలు తీసుకునే తరుణంలో హఠాత్తుగా ఈ విషయం గుర్తుకురావటంతో ఉన్నతాధికారులు వీఆర్వోలను నిలదీస్తున్నారు. తమకు ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ రేషన్ డీలర్లకు ఇస్తే సముచితమని చెబుతున్నారు.

మల్లవల్లికి కొత్త కళ

(5వ పేజీ తరువాయి)

యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్ సారథ్యంలో టీడీపీ బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. లోకేశ్‌కు స్వాగతం పలికిన వారిలో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, టీడీపీ తెలు గు మహిళా రాష్ట్ర ప్రధాన కారదర్శి మూల్పూరి సాయి కల్యాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతి చిన్నా, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్ బాబు, టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, కొమ్మారెడ్డి రాజేశ్, వీరమాచేనేని సత్యప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, నూలు నరసింహారావు, మొవ్వా వెంకటేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, చింతల వెం కట శివ అప్పారావు, గండేపూడి నితీష్‌కుమార్, వడ్డి వాసవి, కాటుమాల విజయభాస్కర్, యనమదల సుధాకర్, పుసులూరు లక్ష్మీనారాయణ, లింగం శ్రీధర్, దయాల రాజీవ్‌తో పాటు యువత పెద్ద ఎత్తున తరలివచ్చి లోకేశ్‌కు స్వాగతం పలికారు.

17 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం : ఎమ్మెల్యే యార్లగడ్డ

మల్లవల్లిలో 17 వేల ఉద్యోగాల కల్పన మా టార్గెట్. చంద్రబాబు 30 వేలు అంటున్నారు. అశోక్ లేలాండ్ ప్లాంట్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు రావడం ద్వారా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ప్లాంట్‌లో ఇప్పుడు 600 ఉద్యోగాలిచ్చారు. త్వరలో మరో 1200 మందికి రానున్నాయి. మల్లవల్లిలో సంస్థల ఏర్పాటుకు 180 కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలి. నా విన్నపాలను లోకేష్ బాబు పరిశీలించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా.

అడవి ఆవుల నియంత్రణకు చర్యలు

● చందర్లపాడులో పర్యటించిన కలెక్టర్ లక్ష్మీశ


ఆవులు సంచారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

చందర్లపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అడవి ఆవుల నుంచి పంటలను రక్షించేందుకు పటిష్ట చర్యలు చేపడతామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. చందర్లపాడు మండలంలోని పలు గ్రామాల్లో అడవి ఆవుల సంచారంతో పంటలు దెబ్బతింటున్నాయని ఇటువల ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శా సనసభలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ బుధవారం మండలంలో పర్యటించారు. వెలది గ్రామంలో డ్రోన్ల సహాయంతో అడవి ఆవుల సంచారాన్ని గమనించిన కలెక్టర్ రైతులతో మాట్లాడారు. మండల పరిధిలో సుమారు 2వేల వరకూ ఆవులుంటాయని అటవీ, పశుసంవర్థక, రెవెన్యూ అధికారులతో మాట్లాడిన ఆయన సమస్యకు పరిష్కారాన్ని అన్వేషించాలన్నారు. వచ్చే ఖరీఫ్‌నాటికి ఆవుల సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని రైతులకు చెప్పారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, డీఎఫ్ఓ జి.సతీష్, డ్వామా పీడీ రాము, పశుసంవర్థక శాఖ జేడీ హనుమంతురావు, చందర్లపాడు తహసీల్దార్ పాల్, ఎన్ఎస్‌పీ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు, రైతు సంఘాల ప్రతినిధి రావూరి రమేష్, ఉన్నం నరసింహారావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పులిచింతల నీటిని విడుదల చేయించండి..!

కృష్ణానదిపై ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీరందక ఆయకట్టులో పంటలు దెబ్బతింటున్నాయని, పులిచింతల నుంచి నీటిని విడుదల చేయించాలని ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు కలెక్టర్ లక్ష్మీశను కోరారు. బుధవారం మండలంలోని వెలది గ్రామంలో కలెక్టర్‌ను కలిసిన వీరబాబు తెలంగాణ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే తెలంగాణ అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని టీడీపీ నేత దాసరి ఏసుప్రభు కలెక్టర్‌ను కోరారు.

పండుగకు వచ్చి.. పరలోకానికి..!

● చిన్న వేమవరంలో తీవ్ర విషాదచాయలు

వత్సవాయి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న గింజుపల్లి సాయికుమార్ (27) పెనుగంచిప్రోలులో జరుగుతున్న తిరుపతమ్మ చిన్న తిరునాళ్లకు వచ్చి జెయింట్ వీల్ ప్రమాదంలో మృత్యువాత పడటం తెలిసిందే. పండుగకని వచ్చి ఇలా ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వత్సవాయి మండలం కొత్త వేమవరం గ్రామానికి చెందిన గింజుపల్లి శ్రీనివాసరావు - లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు సాయికుమార్, గోపిచంద్. ఇద్దరూ సాఫ్ట్ ఇంజనీర్లే. సాయికుమార్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ తిరునాళ్ల సందర్భంగా స్వదేశానికి వచ్చి తమ్ముడితో కలిసి తిరునాళ్లకు వెళ్లాడు. ఇద్దరూ జెయింట్ వీల్ ఎక్కారు. ఊడిపడిన ఒకే చైర్‌లో ఉన్నారు. ప్రమాదంలో సాయికుమార్ (27) అక్కడికక్కడే చనిపోగా, తమ్ముడు గోపిచంద్ తీవ్రంగా గాయపడటంతో విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోస్టుమార్టం అనంతరం సాయి కుమార్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం సాయికుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

మెట్రో రైల్ సీఎంపీలకు కేంద్ర నిధులు మంజూరు

శాసన మండలిలో మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల సీఎంపీ(సమగ్ర మొబిలిటీ ప్లాన్)ల కోసం కేంద్రం నిధులు మంజూరు చేసిందని మంత్రి పి.నారాయణ చెప్పారు. రెండు మెట్రో ప్రాజెక్టులకు ఇచ్చిన సీఎంపీ గడువు ఐదేళ్లు దాటిపోవడంతో తిరిగి మరోసారి ప్లాన్ రూపొందించాలని సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం కోరిందని బుధవారం శాసన మండలిలో వెల్లడించారు. కేంద్రం సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎంపిక చేసిందని తెలిపారు. రెండు నగరాల్లో సీఎంపీ రూపకల్పన కోసం సిస్త్ర ఎంవీఏ సంస్థను ఎంపిక చేశామన్నారు. విశాఖలో రూ.87.47 లక్షలు, విజయవాడలో రూ.81.68 లక్షలతో ప్లాన్ రూపొందించనున్నట్టు తెలిపారు. ఆయా పనుల కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం నిధులు మంజూరు చేసిందన్నారు.

న్యాయం చేయండి.. లేదంటే ప్రత్యక్ష ఆందోళన

● 'అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి దీక్ష'లో సీపీఐ నేత నారాయణ

గాంధీనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు అగ్రిగోల్డ్ బాధితులను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టిన 'అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి దీక్ష'లో ఆయన మాట్లాడారు. ఇది కన్నీటి దీక్ష కాదని పదేళ్ల రక్త కన్నీటి దీక్షగా అభివర్ణించారు. దశాబ్దకాలంగా బాధితులకు అండగా ఉంటూ ముప్పాళ్ల నాగేశ్వరరావు చేస్తున్న కృషిని అభినందించారు. 2 లక్షల మంది ఏజెంట్ల ద్వారా రూ.30 లక్షల మంది వద్ద డబ్బులు కట్టించుకున్నారన్నారు. బాధితులకు అండగా ఉంటామన్న మాజీ సీఎం జగన్ యాజమాన్యానికి కొమ్ముకాసి అగ్రిగోల్డ్ ఆస్తులు కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గతంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు యుద్ధప్రాతిపదికన ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాన్ని విస్మరించిందని మండిపడ్డారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, అసోసియేషన్ అధ్యక్షుడు ఈ.వి.నాయుడు ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహాదేవ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిఈశ్వరయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ, ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

దుర్గగుడిలో అన్నప్రసాద వితరణకు విరాళం



ఇంద్రకీలాద్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పటమటకు చెందిన కొల్లి నాగశివ మారుతీధర్, కుటుంబ సభ్యులతో అమ్మవారి ఆలయానికి విచ్చేసి అధికారులను కలిసి రూ.1,16,001లు చెక్కు రూపంలో అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

శిథిలావస్థలో వాటర్ కూలర్

- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో కొన్ని నెలలుగా పనిచేయని వైనం
- దాహంతో అలమటిస్తున్న రోగులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ సర్వజనాసుపత్రి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వాసుపత్రిలో అడుగడుగునా సమస్యలు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలే కనపడటం లేదు. వేసవిలో తాగేందుకు తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ భవనంలో రోగుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ గత కొన్ని నెలలుగా పని చేయకపోయినా మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు కూలర్ వైపు చూడకపోవడం బాధాకరం. అధికారుల నిర్లక్ష్యానికి శిథిలావస్థలో ఉన్న కూలరే నిదర్శనం. ఆసుపత్రి ప్రాంగణంలో అనేక చోట్ల మొక్కుబడిగా వాటర్ క్యాన్స్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడాన్ని రోగులు తప్పుపడుతున్నారు. ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున దాహార్తిని తీర్చేందుకు అదనపు వాటర్ కూలర్స్‌ను ఏర్పాటు చేయాలని రోగులకు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలి

- వక్తల డిమాండ్

ధర్నాచౌక్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేయాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే మినిమం టైంస్కేల్ వర్తిస్తుందని ప్రభుత్వం జీవో 2ను విడుదల చేయడం అన్యాయమన్నారు. ఈ జీవోను సవరించాలన్నారు. వివిధ శాఖల్లో, సంస్థల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, ప్రభుత్వ పథకాల్లోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలన్నారు. ఒకే క్యాడర్– ఒకే వేతనం అమలు చేయాలని కోరారు. వీరికి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. కారుణ్య నియామకాలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.చినబాబు, పి.వెంకట సుబ్బయ్య ప్రసంగించారు.

విద్యార్థులకు సామాజిక నైపుణ్యాలు అవసరం

ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ధర్మతేజ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ధర్మతేజ, లయోల కరస్పాండెంట్ సగాయ రాజ్

గుణదల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆధునిక నాయకత్వాన్ని అందిపుచ్చుకుంటేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని ఎస్‌ఆర్‌ఎం విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ ధర్మతేజ తెలిపారు. ఆంధ్రా లయోల కళాశాల బీబీఏ విభాగం డిజిటల్ యుగంలో మేనేజ్‌మెంట్ లీడర్‌షిప్ అనుసరణ అవసరం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభం అయింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మతేజ మాట్లాడుతూ క్లిష్టమైన అంశాలను సైతం పరిష్కరించేదిశగా ప్రశాంత వాతావరణంలో ఆలోచించే తత్వాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. లీడర్‌షిప్ ఉన్న వారికే నేటి సమాజంలో రాణింపు ఉంటుందన్నారు. ఓటమిని ఒక చాలెంజ్‌గా తీసుకుంటేనే విజయం వరిస్తుందని చెప్పారు. సాంకేతిక నైపుణ్యాలతోపాటు అభిజ్ఞా, సామాజిక నైపుణ్యాలు చాలా అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా లయోల కళాశాల కరస్పాండెంట్ సగాయ రాజ్, రెక్టర్ ఎస్.జె. జాన్, డీన్ మెల్ఫోయిర్, బీబీఏ విభాగం కోఆర్డినేటర్లు కె.దుర్గాభవాని, జి.శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాపా...పార్కింగ్ స్థలమా



గుణదల మద్దిరావమ్మతల్లి గుడి సెంటర్‌లో బస్టాప్‌లో నిలిపిన వాహనాలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: గుణదల మద్దిరావమ్మతల్లి గుడి సెంటర్ వద్ద ఉన్న బస్టాప్ అక్రమ పార్కింగ్ స్థలంగా మారింది. పలువురు తమ వాహనాలను బస్‌షెల్టర్‌కు ఎదురుగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ వాహనాలు అడ్డుగా ఉండడం వల్ల బస్‌షెల్టర్‌లోకి వెళ్లలేక ఎండలో నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఓటర్లను దగ్గర పోలింగ్ కేంద్రాలకు మార్చండి

రాజకీయ పార్టీల నాయకులతో కమిషనర్ సమీక్ష



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గం ఎలక్టోరల్ ఆఫీసర్ ధ్యానచంద్ర బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం తన చాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల సంఖ్య 1200 పైన ఉన్న ప్రాంతాల్లో ఓటర్లను సమీపంలోని పోలింగ్ స్టేషన్లకు మార్పులు చేయాలని చర్చించారు. ఏఈఆర్వో, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించి, పోలింగ్ బూతులలో మౌలిక వసతులను మెరుగుపర్చాలని, ఓటర్లకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను, దగ్గర కేంద్రాలకు మార్పు చేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. నూతన ఓటర్లకు ఓటర్ ఐడీ కార్డులను పోస్ట్, బీఎల్‌వోల ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈఆర్‌వోలకు ఆదేశాలు ఇచ్చారు. గేటెడ్ కమ్యూనిటీకాలనీల్లోని ఓటర్లకు ఆ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాలను కేటాయిస్తే పూర్తి స్థాయిలో ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. సిస్టమాటిక్ ఓటర్లు ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రానిక్ పార్టిసిపేషన్ (ఎస్‌వీఈఈఐఈ) ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాజకీయ ప్రతినిధులు ఎన్ నరసింహరావు (ఐఎన్‌సి), వీరభద్రరావు (సీపీఐ), వినోద్ కుమార్ (బీఎస్పీ), తరుణ్ (బీజేపీ), సాంబశివరావు (టీడీపీ), సుందర్ పాల్ (వైసీపీ) పరమేశ్వరరావు (ఏఏపీ), చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, జోనల్ కమిషనర్ కె ప్రభుదాస్, ఎస్‌ఈ (ప్రాజెక్ట్) పి.సత్యకుమారి, సెంట్రల్ తహసీల్దార్ ఎం.వెంకటరామయ్య, నార్త్ తహసీల్దార్ ఎం సూర్యారావు, సెంట్రల్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

యూజీడీ పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం తూర్పు పరిధిలోని 3వ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను కోరారు. అనంతరం డివిజన్‌లో సుమారు రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ యూజీడీ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతున్నా సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సీఈ శ్రీనాథ్‌రెడ్డి, కొణిజేటి సూర్యనారాయణ, కమల్‌రాజు, పార్టీ నాయకులు గద్దె రమేష్, తాడి బాబురావు, జనసేన నాయకులు గుత్తికొండ కృష్ణమోహన్, బండి కొమలి, కె.రామచంద్ర, కొలూరి చక్రవర్తి, కృష్ణుడు, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు భరోసా

బెంజిసర్కిల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ బుధవారం నగరంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు భరోసా కల్పించారు. పరీక్షలు సక్రమంగా శాంతియుత వాతావరణంలో రాసే విధంగా ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేసిందని, కేంద్రాల వద్ద సమస్యలు ఉంటే తమకు చెబితే మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. హేమంత్ విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడారు.

మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బోను దుర్గ నరేష్ డిమాండ్

గాంధీనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గ నరేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాలతో పాటు ఇతర రంగాల్లో కూడా ఈ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో నిర్వహించిన 'మహిళా శంఖారావం' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ఎంపీలు ఈటేల రాజేందర్, పార్థసారథి, నాగరాజు, ఆర్.కృష్ణయ్య, మల్లు రవి, బీద మస్తాన్, బాల నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మద్దతు ఇచ్చినట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభలో టీడీపీ నేతలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, ఎమ్మెల్సీ ఆలపాటి, గొట్టుముక్కల తదితరులు

వన్‌టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉంటుందని, త్వరలోనే వారి సమస్యలు పరిష్కారమవుతాయని నేతలు తెలిపారు. విజయవాడ తుమ్మపల్లి క్షేత్రయ్యవారి కళాక్షేత్రంలో టీఎన్‌టీయూసీ అనుబంధ విభాగం తెలుగునాడు ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభ బుధవారం జరిగింది. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అధ్యక్షతన జరిగిన సభలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవో 8ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి రద్దు చేయించానన్నారు. జీవో 21, 31ను కూడా త్వరలోనే రద్దు చేయిస్తానన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ శాసన మండలిలో కార్మికుల సమస్యల గురించి ప్రస్తావిస్తానన్నారు. గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావటానికి ఆటో డ్రైవర్లు కీలక పాత్ర పోషించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆటో కార్మికులు అనేక విధాలుగా నష్టపోయారన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, దువ్వాడ రామారావు, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు. అనంతరం రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆటో యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

22న ప్రత్యేక బడ్జెట్ సమావేశం

25న సాధారణ సమావేశం

కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సర ప్రత్యేక బడ్జెట్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న, సాధారణ సర్వసభ్యసమావేశం(కౌన్సిల్‌సమావేశం) 25న నిర్వహించనున్నారు. ఈ నెల 11న జరిగిన స్టాండింగ్ కమిటీలో బడ్జెట్ అంచనాలను కమిటీ ఆమోదించింది. వాస్తవానికి బడ్జెట్ సమావేశం జనవరిలో జరగాల్సి ఉండగా ఆలస్యం జరిగింది.

తరువాత ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో మరింత ఆలస్యం అయ్యింది. ఈ నెల 25న జరిగే సాధారణ సర్వ సభ్య సమావేశంలో 149 అంశాలపై వాడివేడిగా చర్చ జరగనుంది.

మిక్‌లో ఆగమ- 2025

కంచికచర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయి సాంకేతిక సెమినార్ (ఆగమ- 2025) ఘనంగా నిర్వహించారు. ఈ సెమినార్‌లో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 540 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్ ప్రజంటేషన్, క్విజ్, కోడింగ్, హాకథాన్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో డి. పాండురంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీకిరణ్, ఆగమ కోఆర్డినేటర్లు డాక్టర్ సీహెచ్ పుల్లారావు, డాక్టర్ ఎస్ సురేంద్రనాథ్, వివిధ హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధ్యాపకులు

సమస్యలు పరిష్కరించండి

మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాలు అందజేత



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బొబ్బా వీర రాఘవరావు

గన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌కు బుధవారం వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. గ్రామాలలో కోతుల వలన కోట్ల రూపాయల పంట నష్టం పెరుగుతుందని, ఇళ్ల వద్ద కూరగాయలు, పూలమొక్కలు పాడు చేస్తున్నాయని, మహిళలు, పిల్లలపై దూకి గాయాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే యువగళం పాదయాత్రం సందర్భంగా పార్టీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులతో పాటు ఇటీవల మట్టి, గ్రావెల్ మాఫియాకు అడ్డుపడుతున్నారని టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసు లను మాఫీ చేయించాలని కోరారు.

- ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మల్లవల్లి గ్రామస్తులు మరో వినతిపత్రాన్ని అందజేశారు. యువగళం పాదయాత్ర సమయంలో గ్రామానికి వచ్చినప్పుడు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విన్నవించుకోగా సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు.
- రాష్ట్రంలోని ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించినందుకు రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ శాఖ అధ్యక్షుడు బొబ్బా వీర రాఘవరావు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఎఫ్‌ఎఫ్‌బీ ఫార్ములా ప్రైస్-రెజిడ్‌తో సమానంగా 2024-25 కు ఎఫ్‌ఎఫ్‌బీ ఫార్ములా జీవో జారీ చేయాలని వినతిపత్రం అందజేశారు.



మెంటార్లను సత్కరిస్తున్న పీవీపీ కళాశాల యాజమాన్యం

పీవీపీ సిద్ధార్థలో ఏటీఎల్ మెంటార్లకు సత్కారం

పెనమలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) మెంటార్లుగా సేవలందించిన 31మంది సిబ్బందిని, 155 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు దగ్గర్లోని ఉన్నత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ప్రాథమిక సాంకేతికతా పరిజ్ఞానాలపై శిక్షణ ఇచ్చినందుకు సత్కరించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ఇండియా చీఫ్ ఆఫీసర్ జెలాలెం బీ టాఫెస్సే, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్నకుమార్, నీతి ఆయోగ్ ప్రోగ్రాం మేనేజర్ ప్రతీక్ దేశ్‌ముఖ్, సీఈవో ప్రొఫెసర్ దేవకుమార్, పిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, ఎన్‌ఎస్‌ఎస్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.





నవరంగ్	- విజయవాడ
LEPL ఐనాక్స్	- విజయవాడ
పివిఆర్ సినిమాస్	- విజయవాడ
బాలాజీ	- గుడివాడ
పివిఆర్ సినిమాస్	- మచిలీపట్నం
స్టైల్ సినిమాస్	- పమ్మరు

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209326

పాత పట్టు చీరలు కొనబడును
» మీ పాత కంచిపట్టు, గద్వాల్, వెంకటగిరి, బెనారస్ ప్యూర్ జరీ చీరలను రూ. 500/- నుండి 20,000/- వరకు కొనబడును. ఈ అవకాశం మీ ఇంటివద్దనే. సంప్ర. అర్చ్యా శారీస్ : 99634 22776
AJB-929

VEHICLE FOR SALE
» AP-16-TQ 1139 PRIME LX 3125 Model 2018, AP-16-CE 2822 MARUTI SWIFT VDI Model 2012, వాహనములు 24.03.25న ఉదయం 10.30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్. ✆ 80793 82228, 88851 22355
AJB- 1466

బిజినెస్ అవకాశం
» నెట్‌వర్క్ లీడర్స్‌కు మంచి అవకాశం ఎలక్ట్రికల్ వెహికిల్స్, 2వీలర్స్ బుకింగ్‌చేస్తూ, టీమ్ వర్క్ ద్వారా డబ్బులు సంపాదించుకునే అవకాశం. లోన్ సదుపాయం కలదు. సంప్ర :సెల్ : 9959974159
AJM-12933

WANTED
⇒ Walk in interview for sales executive posts Krishna & West Godavari Dt, Date : 21/3/25 time 11am to 4pm, location RP Agencies, 30-22-124, above TATA Croma, 2nd floor, Seetaramapuram, Eluru road, Vijayawada-52002, Ph : 9491169631 for Reputed tiles company.
AJO-232798

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥ 290/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234







చిత్రజ్యోతి
SINCE 1965


'దక్ష' లో మోహన్‌బాబు

నాన్నకు ప్రేమతో..



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్



కడుపుబ్బా నవ్వించే చిత్రం

సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నేమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.





బిజినెస్

అమెరికాలో వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్: కీలక వడ్డీరేట్లను 4.25-4.5% వద్దే యథాతథంగా కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వు నిర్ణయించింది. బ్యాంకు చైర్మన్ జెరోం పోవెల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆర్థిక పరిస్థితులు విషమిస్తే ఈ సంవత్సరం రెండు విడతలుగా వడ్డీరేట్ల కోత ఉండే అవకాశం ఉందని స్పష్టమైన సంకేతాలిచ్చింది. ట్రంప్ వాణిజ్య సుంకాల నేపథ్యంలో తలెత్తే పరిస్థితులపై స్పష్టత ఏర్పడే వరకు వడ్డీరేట్ల తగ్గింపు జోలికి పోకపోవడమే మంచిదని ఫెడ్ రిజర్వు నిర్ణయించినట్టు భావిస్తున్నారు.

యూసీబీలు పటిష్ఠంగా ఉండాలి: మల్హోత్రా

నానాటికీ పెరుగుతున్న ఐటీ, సైబర్ రిస్కుల నేపథ్యంలో దేశంలో పట్టణ సహకార బ్యాంకులు (యూసీబీ) నిర్వహణాపరంగా పటిష్ఠంగా ఉండాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. ఆయన బుధవారం ఎంపిక చేసిన యూసీబీల చైర్మన్లు, ఎండీలు, సీఈఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగు స్థాయిలు ప్రజలకు సేవలందిస్తూ ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌ను మరింత లోతుగా పాదుకునేలా చేయడంతో యూసీబీల పాత్రను ప్రశంసించారు. డిపాజిటర్లు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేయాలని సూచించారు.

జీసీసీ ఉద్యోగులకు జీతాల జోష్



వచ్చే ఏడాది కాలంలో 9.8% వేతన వృద్ధి

- ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు గరిష్ఠం
- హైదరాబాద్, ముంబై కేంద్రాలు టాప్ పేయర్స్
- ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ నివేదికలో వెల్లడి

ముంబై: వచ్చే ఏడాది కాలంలో దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) వేతనాలు 9.8 శాతం మేర పెరగవచ్చని డిజిటల్ నైపుణ్య పరిష్కారాల సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ తాజా నివేదిక అంచనా వేసింది. ఉద్యోగుల వేతనాలు, వృద్ధిలో జీసీసీలు సంప్రదాయ ఐటీ కంపెనీలను మించిపోయాయని పేర్కొంది. 2030 వరకు జీసీసీల రంగం వేతనాల్లో 9-12 శాతం సంచిత వృద్ధిని నమోదు చేయనుందని అంచనా వేసింది. "ప్రపంచవ్యాప్త జీసీసీల్లో 55 శాతానికి పైగా భారత్‌లోనే ఉన్నాయి. 2030 నాటికి జీసీసీల మార్కెట్ సైజు 11,000 కోట్ల డాలర్లకు చేరవచ్చని అంచనా. క్రియాశీలత, వ్యయ దక్షత, భారీ సంఖ్యలో నిపుణులను కోరుకునే సంస్థలకిప్పుడు జీసీసీలు కీలక కేంద్రాలుగా మారాయి. జీసీసీలు వేగంగా వృద్ధి చెందుతుండటంతో వాటిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వారు ఇదివరకంటే అధిక వేతన పెంపు డిమాండ్ చేయగలుగుతున్నారు" అని ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ సీఈఓ సచిన్ అలుగ్ అన్నారు. దేశంలోని 6 నగరాల్లోని 10 రంగాలకు చెందిన 207 జీసీసీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపింది.

- హైదరాబాద్, ముంబైలోని జీసీసీలు అధిక జీతాలు చెల్లిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ సాఫ్ట్‌వేర్ అండ్ కన్సల్టింగ్, బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల జీసీసీలు భారీ జీతాలు ఆఫర్ చేస్తున్నాయి. ఢిల్లీ/ఎన్‌సీఆర్, బెంగళూరులో బలమైన పోటీతత్వం కనబరిచాయి. కాగా, టెలికాం, ఇంటర్నెట్ సేవల విభాగాల్లో సమానత్వం కనిపించింది.
- కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ నైపుణ్య రంగాల్లో డిమాండ్ కారణంగా జూనియర్, మధ్య స్థాయి సిబ్బంది వేతనాలు అధికంగా వృద్ధి చెందనున్నాయి. కంపెనీలు నాయకత్వ పదవుల్లో వ్యయ దక్షతకు ప్రాధాన్యం ఇస్తున్న కారణంగా సీనియర్ స్థాయి ఉద్యోగుల వేతనాలు మాత్రం స్వల్పంగా వృద్ధి చెందనున్నాయి.
- జీసీసీలు ప్రత్యేక నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. అది వేతన చెల్లింపుల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ నిపుణులు సంప్రదాయ ఐటీ నిపుణుల కంటే 30-50 శాతం అధికంగా వేతనం అందుకుంటున్నారు. జనరేటివ్ ఏఐ, హైబ్రిడ్ క్లౌడ్ వినియోగం పెరగడంతో క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు, ప్రొడక్ట్ డిజైనర్లకు భారీ జీతాలు లభిస్తున్నాయి.
- నాలుగో తరం పారిశ్రామిక రంగాల్లో ఫౌండేషనల్ డిజిటల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీర్లకు మిగతా వారికంటే 20-50 శాతం అధిక వేతనం లభిస్తోంది. కాగా, కంపెనీల్లో డేటా భద్రత కీలకంగా మారుతున్న తరుణంలో సైబర్ సెక్యూరిటీ నిపుణుల జీతం రెండంకెల్లో వృద్ధి చెందనుంది.
- జీసీసీలు కేవలం ఐటీ సేవల రంగానికే పరిమితం కావడం లేదు. ప్రస్తుతం ఆర్థిక సేవల రంగానికి చెందిన జీసీసీలు ముందంజలో ఉన్నాయి. వీటిల్లో ఎంట్రీ లెవెల్ ఉద్యోగుల వార్షిక వేతనం రూ.6-12 లక్షల స్థాయిలో ఉంటోంది. మధ్య స్థాయి ఉద్యోగులు రూ.18-35 లక్షలు, సీనియర్ అధికారులు రూ.45-90 లక్షల వార్షిక జీతం అందుకుంటున్నారు. ప్రతిభ కలిగిన వారిని కాపాడుకోవడంతో పాటు నాయకుల అభివృద్ధిపై జీసీసీలు గట్టిగా దృష్టిసారించాయనడానికి ఇది నిదర్శనం.

ఉక్కు దిగుమతులపై 12% సుంకం!

కేంద్ర వాణిజ్య శాఖ సిఫారసు

న్యూఢిల్లీ: దేశీయ ఉక్కు తయారీదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు విదేశాల నుంచి దిగుమతయ్యే కొన్ని స్టీల్ ఉత్పత్తులపై 200 రోజులపాటు 12 శాతం తాత్కాలిక రక్షణ సుంకం విధించాలని కేంద్ర వాణిజ్య శాఖకు చెందిన దర్యాప్తు విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డీజీటీఆర్) సిఫారసు చేసింది. పలు పరిశ్రమల్లో ఉపయోగించే నాన్ అల్లాయ్, అల్లాయ్ స్టీల్ ఫ్లాట్ ఉత్పత్తుల దిగుమతులు ఒక్కసారిగా పెరగడంతో ఇండియన్ స్టీల్ అసోసియేషన్ చేసిన ఫిర్యాదు మేరకు గత ఏడాది డిసెంబరులో డీజీటీఆర్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ ఉత్పత్తుల దిగుమతులు ఆకస్మికంగా, వేగంగా పెరిగాయని, ఇది దేశీయ స్టీల్ తయారీదారులకు నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని డీజీటీఆర్ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దేశీయ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు విదేశాల నుంచి దిగుమతి అవుతున్న స్టీల్ ఉత్పత్తులపై 12 శాతం సుంకం విధించాలని ఈనెల 18న జారీ చేసిన నోటిఫికేషన్‌లో డీజీటీఆర్ సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనపై కేంద్ర ఆర్థిక శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది.



స్టీల్ స్టాక్స్ జూమ్: ఈ ప్రతిపాదనతో బుధవారం స్టీల్ రంగ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. ఎన్‌ఎండీసీ షేరు ఏకంగా 6.88 శాతం ఎగబాకింది. సెయిల్ 3.99 శాతం, టాటా స్టీల్ 2.52 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.33 శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ 1.15 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ 0.25 శాతం పెరిగాయి.

92,000 చేరువలో బంగారం



న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ రేసు గుర్రంలా పరిగెడుతోంది. బంగారం, వెండి ధరలు బుధవారం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరో జీవితకాల గరిష్ఠానికి చేరాయి. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం రూ.700 లాభంతో రూ.91,950కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి ధరా రూ.1,000 లాభంతో మరో ఆల్ టైమ్ హై రూ.1,03,500కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి. బుధవారం ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 3,045.39 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రధాన ఆసియా మార్కెట్లలో అయితే ఔన్స్ ధర ఇంట్రా డేలో 3,052.31 డాలర్లు పలికింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఈ ఏడాది చివరికల్లా అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ పసిడి ధర 4,000 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే భారత మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షకు చేరుతుందని అంచనా.

యూపీఐ లావాదేవీల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకం

న్యూఢిల్లీ: దేశంలో యూపీఐ లావాదేవీల ప్రోత్సాహానికి రూ.1500 కోట్ల విలువ గల ఒక పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీని కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొనుగోలుదారుడు వ్యాపారికి చెల్లించే రూ.2,000 లోపు మొత్తంపై మర్చంట్ డిస్కౌంట్ రేట్‌ను (ఎండీఆర్) కేంద్రమే భరిస్తుంది. వ్యక్తిగత కొనుగోలుదారులు, వ్యాపారుల మధ్య (పీ2ఎం) తక్కువ విలువ గల భీమ్-యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యమని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. 2014 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగే రూ.2,000 లోపు విలువ గల పీ2ఎం యూపీఐ లావాదేవీలకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

జేపీఎల్ కొనుగోలు రేసులో జీఎంఆర్

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేపీఎల్) కంపెనీని చేజిక్కించుకునేందుకు జీఎంఆర్ గ్రూప్ సహా పలు కార్పొరేట్ దిగ్గజాలు పోటీపడుతున్నాయి. జేపీఎల్ ఆస్తుల కొనుగోలుకు జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ, దాల్మియా భారత్, జిందాల్ పవర్, వేదాంత, వెల్‌స్పన్, టొరెంట్ పవర్ ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) సమర్పించినట్లు తెలిసింది. తుది గడువు (ఈనెల 25) లోగా అదానీ గ్రూప్ సైతం ఈఓఐ సమర్పించనున్నట్లు సమాచారం. సిమెంట్ ప్లాంట్లు, హోటళ్ల సహా భిన్న వ్యాపారాల్లోకి విస్తరించిన జేపీఎల్ ఆస్తుల ప్రస్తుత విలువ రూ.17,300 కోట్ల స్థాయిలో ఉండవచ్చని అంచనా. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంక్‌తోపాటు మరో 21 మంది రుణదాతలకు జేపీఎల్ రూ.48,000 కోట్లకు పైగా బకాయిపడింది.

3 రోజుల్లో రూ.14 లక్షల కోట్ల లాభం

22,900 ఎగువకు నిఫ్టీ

న్యూఢిల్లీ: ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 267 పాయింట్ల మేర పుంజుకున్నప్పటికీ, చివరికి 147.79 పాయింట్ల లాభంతో 75,449.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73.30 పాయింట్ల వృద్ధితో 22,907.60 వద్ద ముగిసింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, కేపిటల్ గూడ్స్, రియల్టీ షేర్లలో మదుపరులు కొనుగోళ్లు పెంచడంతోపాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మళ్లీ మన మార్కెట్లో పెట్టుబడులు పెడుతుండటం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,620.14 పాయింట్లు (2.19 శాతం) పుంజుకుంది. మూడు రోజుల ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.13.82 లక్షల కోట్లు పెరిగి రూ.405.01 లక్షల కోట్లకు (4.68 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ మళ్లీ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని దాటడం దాదాపు నెల రోజుల తర్వాత ఇదే మొదటిసారి.

జీఆర్‌టీ జువెలర్స్ 'స్వర్ణ ఉగాది'

హైదరాబాద్: స్వర్ణాభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని "స్వర్ణ ఉగాది" ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా కంపెనీ తమ కస్టమర్లకు పలు ఆఫర్లు ప్రకటించింది. బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50 తగ్గింపు ఇవ్వడంతో పాటు పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.75 అదనపు ప్రయోజనం కల్పిస్తోంది. అలాగే వజ్రాల కొనుగోలుపై (సాలిటైర్స్ మినహా) 10 శాతం తగ్గింపు, వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపు ప్రకటించింది.

ఎన్‌విడియాతో టెక్ మహీంద్రా భాగస్వామ్యం

న్యూఢిల్లీ: కాలిఫోర్నియా ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాతో టెక్ మహీంద్రా, విప్రో, ఎల్ అండ్ టీ టెక్నాలజీ వ్యక్తిగత భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం కింద ఆయా సంస్థలు వివిధ పరిశ్రమలకు ఏఐ ఆధారిత సొల్యూషన్లు అందిస్తాయి. ఇందులో భాగంగా ఎన్‌విడియాకు చెందిన ఏఐ సాఫ్ట్‌వేర్ సహాయంతో పనిచేసే ఫార్మకోవిజిలెన్స్ (పీవీ) సొల్యూషన్‌ను టెక్ మహీంద్రా ఆవిష్కరించింది. ఇది ఔషధ భద్రతా నిర్వహణను మెరుగుపరుస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	96	విజయవాడ	105
వరంగల్	96	గుంటూరు	103
కరీంనగర్	96	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	96
కర్నూలు	96	నెల్లూరు	101
విశాఖపట్నం	99	అనంతపురం	101
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,440 ▲	82,900 ▲	1,14,000 ▲
విజయవాడ	90,800 ▲	87,000 ▲	1,00,700 ▼
విశాఖపట్నం	89,050 ▼	81,630 ▼	1,00,820 ▼
రాజమండ్రి	90,440 ▲	82,500 ▲	1,03,100 ▲
ప్రొద్దుటూరు	89,900 ▲	83,250 ▲	1,01,000 ▼
ముంబై	88,650 ▲	81,200 ▲	99,970 ▼

స్పోర్ట్స్

ఛెత్రి రాక.. భారత్ గెలుపు బాట



● మాల్దీవులపై 3-0తో విజయం

షిల్లాంగ్: సునీల్ ఛెత్రి పునరాగమనంతో.. గత 12 మ్యాచ్‌లుగా గెలుపులేని రికార్డును భారత్ బ్రేక్ చేసింది. బుధవారం జరిగిన అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో భారత్ 3-0తో మాల్దీవులను చిత్తు చేసింది. ఈ క్రమంలో 2023 నవంబరులో ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో కువైట్‌పై 1-0తో నెగ్గిన తర్వాత.. 16 నెలలుగా భారత్ ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేదు. కానీ, ఛెత్రి రీఎంట్రీ స్ఫూర్తితో ఎట్టకేలకు గెలుపుబాట పట్టింది. ఫస్టాఫ్ 35వ నిమిషంలో రాహుల్ బెక్కే గోల్‌తో భారత్ 1-0 ఆధిక్యంలో దూసుకెళ్లింది. సెకండాఫ్‌లో 66వ నిమిషంలో లిస్టన్ కొలాకో మరో గోల్ సాధించాడు. ఇక, 77వ నిమిషంలో ఛెత్రి అద్భుతమైన హెడర్‌తో భారత్‌కు మూడో గోల్ అందించాడు. ఇది అతడికి 95వ అంతర్జాతీయ గోల్. భారత జట్టు కోసం ఛెత్రి రిటైర్మెంట్‌ను వెనక్కుతీసుకొన్న సంగతి తెలిసిందే.



భరణం రూ. 4.75 కోట్లు?

చాహల్, ధనశ్రీ విడాకుల కేసులో తీర్పు నేడు!

న్యూఢిల్లీ: టీమిండియా స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైన నేపథ్యంలో.. ఈ జంట విడాకులకు సంబంధించి ఓ కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భరణం కింద ధనశ్రీకి రూ. 4.75 కోట్లు ఇచ్చేందుకు చాహల్ అంగీకరించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి రూ. 2.37 కోట్లు ఫిబ్రవరిలోనే చెల్లించినట్టు జాతీయ మీడియా పేర్కొంది. తమకు విడాకులు మంజూరు చేయాలంటూ ఇద్దరూ గత నెల 5న ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. అయితే, పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నందున తమకు ఆరునెలల కూలింగ్ పీరియడ్ (చట్టప్రకారం విడిపోయేముందు ఆరునెలలు కలిసుండడం) నుంచి మినహాయింపు ఇవ్వాలన్న వారి అభ్యర్థనను ఫ్యామిలీ కోర్టు తిరస్కరించింది. దీన్ని బాంబే హైకోర్టులో సవాల్ చేయగా.. వీరికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈనెల 22 నుంచి జరిగే ఐపీఎల్‌లో ఆడాల్సి ఉండడంతో ఆలోపే విడాకుల అంశాన్ని తేల్చాలన్న చాహల్ వాదనతో ఏకీభవించిన హైకోర్టు గురువారం తీర్పు వెల్లడించాలంటూ ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది. దీంతో వీరిద్దరి విడాకుల అంశంపై గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది.

హారికకు తొలి ఓటమి

నికోసియా (సైప్రస్): ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారికకు తొలి ఓటమి ఎదురైంది. బుధవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో ఎలిజబెత్ పెహెట్జ్ చేతిలో హారిక పరాజయం పాలైంది. నల్లపావులతో ఆడిన హారిక 50 ఎత్తుల అనంతరం ఓటమిని అంగీకరించింది. కాగా, ననా డిజాంగ్‌నిడ్జ్ (జార్జియా)తో గేమ్‌ను దివ్య దేశ్‌ముఖ్ డ్రాగా ముగించింది. ఐదు రౌండ్ల తర్వాత హారిక 2.5, దివ్య 2 పాయింట్లతో ఉన్నారు.



మాజీ కోశాధికారి సురేందర్ అగర్వాల్‌పై అభియోగాలు

అజర్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఉప్పల్ స్టేడియం నిర్మాణం, ఆ తర్వాత జరిగిన ఆధునీకరణ పనుల్లో జరిగిన అక్రమాలపై ఈడీ చేస్తున్న దర్యాప్తులో పురోగతి లభించింది. బుధవారం హెచ్‌సీఏ మాజీ కోశాధికారి సురేందర్ అగర్వాల్‌కు సంబంధించిన అవినీతిపై ఈడీ పక్కా ఆధారాలను సేకరించి రూ.90.86 లక్షల అక్రమ సొమ్మును సీజ్ చేసింది. మహ్మద్ అజరుద్దీన్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో (2019-23) స్టేడియం ఆధునీకరణ పనుల్లో క్విడ్ ప్రోకో కింద అజర్ సహా అపెక్స్ కౌన్సిల్ సభ్యులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందాయన్న ఆరోపణలు ఉన్నాయి. స్టేడియం నిర్మాణం, ఆతర్వాత ఆధునీకరణ పనుల కేసులను సమాంతరంగా దర్యాప్తు చేస్తున్న అధికారులకు సురేందర్ చిక్కారు. 2019-23 మధ్య స్టేడియంలో కొత్త సీట్ల ఏర్పాటు, జిమ్ పరికరాలు, క్రికెట్ బంతుల కొనుగోలులో తక్కువ రకం ఉత్పత్తులను ఎక్కువ మొత్తానికి కొనేలా తమకు లబ్ధి చేకూర్చే కంపెనీలకు కాంట్రాక్టులను ఇచ్చి అవినీతికి తెరలేపారు. సురేందర్ భార్య, కొడుకు, కోడలు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు సారా స్పోర్ట్స్ సంస్థ నుంచి రూ.17లక్షలు, ఎక్స్‌లెంట్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.21.86 లక్షలు, బాడీ డ్రెంజ్ సంస్థ నుంచి రూ.52 లక్షలు బదిలీ అయినట్టు ఈడీ విచారణలో తేలింది. సురేందర్‌తో పాటు ఈ కేసుల్లో అజరుద్దీన్, కార్యదర్శి విజయానంద్‌పై కూడా ఆరోపణలున్నాయి.

సింధుకు షాక్

ఆరంభ రౌండ్లో పరాజయం

ప్రణయ్‌పై శ్రీకాంత్ గెలుపు

బాసెల్: స్టార్ షట్లర్, పీవీ సింధు ఫామ్‌లేమి కొనసాగుతోంది. తాజాగా స్విస్ ఓపెన్‌లోనూ నిరాశపరుస్తూ ఆరంభరౌండ్లోనే వెనుదిరిగింది. బుధవారం జరిగిన సింగిల్స్ పోరులో డెన్మార్క్‌కు చెందిన జూలీ దావల్ జాకబ్‌సెన్ 21-17, 21-19తో సింధుకు షాకిచ్చింది. ఇక, కిడాంబి శ్రీకాంత్ 23-21, 23-21తో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌ను ఓడించగా, శంకర్ ముత్తుసామి 21-5, 21-16తో మాగ్నస్‌పై నెగ్గి రెండోరౌండ్ చేరారు. డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జాలీ ద్వయం 21-16, 21-17తో ముల్లర్ (స్విట్జర్లాండ్)/కెల్లీ వాన్(నెదర్లాండ్స్) జంటపై గెలిచింది. మిగతా భారత షట్లర్లలో ఇషా రాణి, అనుపమ సింగిల్స్‌లో రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు.

ఆ ఒక్క మ్యాచ్‌కి.. ముంబై కెప్టెన్ సూర్య

ముంబై : ఈ సీజన్ ఐపీఎల్‌ను చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం జరిగే మ్యాచ్ ద్వారా ముంబై ఇండియన్స్ ప్రారంభించనుంది. అయితే గత సీజన్‌లో మూడుసార్లు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటాను పూర్తి చేయని కారణంగా హార్దిక్ పాండ్యా ఒక మ్యాచ్ సస్పెన్షన్ ఎదుర్కొంటున్నాడు. ఈనేపథ్యంలో సీఎస్‌కేతో పోరుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

ఆ నిబంధన మార్చం: బీసీసీఐ

న్యూఢిల్లీ: బీసీసీఐ ఇటీవల కొత్తగా అమలుల్లోకి తెచ్చిన 'క్రికెటర్లతో కుటుంబ సభ్యులు' నిబంధన విషయంలో పునరాలోచన చేస్తున్నదంటూ వస్తున్న వార్తలను కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించాడు. ఈ ఆంక్షలపై విరాట్ కోహ్లీ విమర్శలు చేయడంతో..నిబంధనలను బీసీసీఐ సడలించనున్నదనే వార్తలు వస్తున్నాయి. దీనిపై సైకియా స్పందిస్తూ 'కొత్త నిబంధన అమలులో ఉంటుంది. అది దేశానికి, బీసీసీఐకి ఎంతో ముఖ్యమైనది' అని స్పష్టంజేశాడు.

శ్రేయాస్ అయినా.. పంజాబ్ రాత మార్చేనా?



కోచ్ పాంటింగ్‌తో కెప్టెన్ శ్రేయాస్

మెగా లీగ్‌లో ఉనికిని కోల్పోయిన జట్టు పంజాబ్ కింగ్స్.! ఐపీఎల్ చరిత్రలో ఒక్కసారి కూడా ట్రోఫీని ముద్దాడలేక పోయింది. పేరు మార్చుకొన్నా.. తరచూ జట్టును సమూలంగా ప్రక్షాళన చేస్తున్నా.. ఎంతో అనుభవం ఉన్న కోచ్‌లను నియమించుకొంటున్నా జట్టు తలరాత మాత్రం మారడం లేదు. టోర్నీ చరిత్రలో రెండుసార్లు మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరుకొంది. 2008 సెమీస్‌లో ఓడగా.. 2014లో ఫైనల్లో కోల్‌కతా చేతిలో పరాజయం పాలైంది. గత పదేళ్లలో ఎన్ని ప్రయోగాలు చేసినా.. పంజాబ్ ఆటతీరు మాత్రం మారడం లేదు. అయితే, గతేడాది కోల్‌కతాకు టైటిల్ సాధించి పెట్టిన శ్రేయాస్ అయ్యర్‌ను వేలంలో రూ. 26.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన పంజాబ్.. అతడికే జట్టుపగ్గాలు అప్పగించింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను చెరో రూ. 18 కోట్లకు ఖరీదు చేసింది. కోచ్‌గా రికీ పాంటింగ్‌ను నియమించడంతో ఈసారి జట్టు మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బ్యాటింగ్ లైనప్ బలంగానే కనిపిస్తున్నా నిలకడలేమి ఇబ్బందిపెడుతోంది. ఓపెనర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, జోష్ ఇంగ్లిస్ బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్లు మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, జెన్సన్‌తో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. గత సీజన్‌లో ఫినిషర్‌గా ఆకట్టుకొన్న శశాంక్ సింగ్ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. అర్ష్‌దీప్, ఫెర్గూసన్, జెన్సన్‌తో పేస్ విభాగం ఫర్వాలేదనిపిస్తున్నా.. చాహల్ మినహా మరో స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకపోవడం మైనస్. పైగా టీమిండియాకు ఆడుతున్న ఆటగాళ్లు ఇద్దరే జట్టులో ఉండగా.. కోర్ టీమ్‌ను తయారు చేసుకోలేకపోవడం పెద్దలోపం.

జట్టు

బ్యాటర్లు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, ఆరోన్ పన్ను, అవినాష్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్; **వికెట్ కీపర్లు:** విష్ణు వినోద్, జోష్ ఇంగ్లిస్; **ఆల్‌రౌండర్లు:** మార్కస్ స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, హర్‌ప్రీత్ బ్రార్, మార్కో జెన్సన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, ప్రియాన్స్ ఆర్య, ఆరోన్, ముషీర్ ఖాన్, సూర్యాంశ్ షెగ్డే; **బౌలర్లు:** అర్ష్‌దీప్ సింగ్, చాహల్, లోకీ ఫెర్గూసన్, వైశాఖ్ విజయ్‌కుమార్, యాశ్ ఠాకూర్, కుల్దీప్ సేన్, బార్ట్‌లెట్, ప్రవీణ్ దూబే.

ఐపీఎల్ 2 రోజుల్లో

టైటిల్ నిలబెట్టుకోవాలని..



రహానె సారథ్యంలో కోల్‌కతా నైట్‌రైడర్స్

డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. 2012, 2014లో గౌతమ్ గంభీర్ కెప్టెన్సీలో ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన కోల్‌కతా.. దశాబ్దం తర్వాత 2024లో మళ్లీ విజేతగా నిలిచింది. గత సీజన్‌లో శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన నైట్‌రైడర్స్.. ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకొంది. మెంటార్‌గా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన గంభీర్ టీమిండియా కోచ్‌గా వెళ్లాడు. అయితే శ్రేయాస్ అయ్యర్‌ను వదిలేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. కానీ, రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి, ఆండ్రూ రస్సెల్, సునీల్ నరైన్, హర్షిత్ రాణా, రమణ్‌దీప్ సింగ్‌తో కోర్ టీమ్‌ను రిటైన్ చేసుకోవడం చూస్తే జట్టు విషయంలో మేనేజ్‌మెంట్ స్పష్టతతోనే ఉన్నట్టు అవగతమవుతోంది. రూ. 23.75 కోట్లకు ఆల్‌రౌండర్ వెంకటేష్ అయ్యర్‌ను కొనుగోలు చేయడంతో అతడికే జట్టు పగ్గాలు అప్పగిస్తారని భావించారు. కానీ, అనుభవజ్ఞుడైన అజింక్యా రహానెను వేలంలో కనీస ధరకే దక్కించుకొన్న కోల్‌కతా.. అతడికే సారథ్యం అప్పగించింది. మెంటార్‌గా అవతారం ఎత్తిన డ్వేన్ బ్రావో ఎలా నడిపిస్తాడో చూడాలి. ఓవరాల్‌గా బ్యాటింగ్, బౌలింగ్‌లో మెరుగైన ఆటగాళ్లతో సమతుల్యంగా కనిపిస్తోంది. డికాక్, గుర్బాజ్, రింకూతో బ్యాటింగ్ బలంగానే ఉంది. అయితే, టీమ్ ఎక్కువగా నరైన్, రస్సెల్‌పైనే ఆధారపడి ఉందనేది వాస్తవం. వీళ్లిద్దరూ జట్టుకు బలం.. బలహీనతగా మారారు. రస్సెల్ ఫిట్‌నెస్ ఎప్పుడూ ఆందోళన కలిగిస్తోంది. మిస్టరీ స్పిన్నర్‌గా, ఓపెనర్‌గా నరైన్ ఎప్పుడూ అంచనాలను తలకిందులు చేస్తుంటాడు. ఒకవేళ వీరిద్దరూ విఫలమైనా లేక గాయాలపాలైతే భర్తీ చేయగల బ్యాకప్ ప్లేయర్లు లేకపోవడం జట్టును ఆందోళనకు గురి చేసే అంశం. వేలంలో దక్కించుకొన్న పేసర్ నోకియా కూడా తరచూ ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్నాడు.

జట్టు

బ్యాటర్లు: అజింక్యా రహానె (కెప్టెన్), రింకూ సింగ్, రఘువంశీ, రోవ్‌మన్ పావెల్, మనీష్ పాండే; **వికెట్ కీపర్లు:** క్వింటన్ డికాక్, రహ్మనుల్లా గుర్బాజ్, లువ్‌నిత్ సిసోడియా; **ఆల్ రౌండర్లు:** వెంకటేష్ అయ్యర్, అనుకుల్ రాయ్, మొయిన్ అలీ, రమణ్‌దీప్ సింగ్, రస్సెల్; **బౌలర్లు:** నోకియా, వైభవ్ అరోరా, మయాంక్ మార్కండే, స్పెన్సర్ జాన్సన్, హర్షిత్ రాణా, నరైన్, వరుణ్ చక్రవర్తి, చేతన్ సకారియా.

ఎమ్మెల్యేలకు క్రీడా గాయాలు

» రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌కు కాలు ఫ్రాక్చర్

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో పలువురు ఎమ్మెల్యేలకు గాయాలయ్యాయి. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ క్రికెట్‌లో ఫీల్డింగ్ చేస్తూ కిందపడడంతో గడ్డం వద్ద గాయమైన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, బుచ్చయ్యచౌదరి కెప్టెన్లుగా బుధవారం కబడ్డీ జట్లు తలపడ్డాయి. విష్ణు జట్టులోని ఎమ్మెల్యే శ్రీధర్ కూతకు వెళ్లారు. ఆయనను బుచ్చయ్యచౌదరి జట్టు పట్టుకోగా శ్రీధర్ కాలు విరిగింది. అదేవిధంగా కూతకు వచ్చిన క్రీడాకారుడ్ని పట్టుకోడానికి బుచ్చయ్య చౌదరి ఒక్కోఅడుగు వెనక్కి వేస్తూ అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు వెనుక భాగంలో గచ్చు తగిలి గాయమైంది. వైద్య సిబ్బంది వెంటనే బ్యాండేజ్ వేశారు. క్రికెట్‌లో ఫీల్డింగ్ చేస్తూ ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి కిందపడటంతో శరీరంపై పలుచోట్ల కొట్టుకుపోయిన గాయాలయ్యాయి. కాగా, క్రికెట్ పోటీల్లో మంత్రి సత్యకుమార్ జట్టుపై మంత్రి నాదెండ్ల మనోహర్ జట్టు విజయం సాధించింది. తొలుత నాదెండ్ల మనోహర్ జట్టు బ్యాటింగ్ చేయగా, తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సత్యకుమార్ జట్టు నిర్దేశిత లక్ష్యానికి చేరుకోకుండానే ఆలవుటయ్యింది.

'కుర్చీ' నాదే... మ్యూజికల్ చైర్ పోటీలో ఎమ్మెల్యే మిరియాల శిరీష విజేతగా నిలిచారు. మంత్రులు సవిత, అనిత, సంధ్యారాణితోపాటు పలువురు మహిళా ఎమ్మెల్యేలు పోటీపడ్డారు. సవిత ద్వితీయ, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తృతీయ స్థానాల్లో నిలిచారు.

విసిరేస్తా... పురుష, మహిళా ఎమ్మెల్యేలకు వేర్వేరుగా షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. మహిళ విభాగంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి విజేతగా నిలిచారు. పురుషులకు రెండురౌండ్లుగా పోటీలు నిర్వహించగా ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, కామినేని శ్రీనివాస్ విజేతలుగా నిలిచారు. ఆరు పదుల వయసు దాటిన ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కూడా షాట్‌పుట్ విసిరి తన సత్తాను చూపించారు.

ఎమ్మెల్యేల గెలుపు పరుగు... 100మీ. పరుగు పందెంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, ఎమ్మెల్యే రామాంజనేయులు విజేతలుగా నిలిచారు.





ప్రజాప్రతినిధుల క్రీడలలో బౌలింగ్ వేస్తున్న మంత్రి సత్యకుమార్, క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఎమ్మెల్యేలు, షాట్‌పుట్ పోటీలో పాల్గొన్న హోంమంత్రి అనిత

శారదా పీఠం ఆక్రమణలపై సర్కారు దృష్టి

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : విశాఖ శారదాపీఠం భూ ఆక్రమణలపై సర్కారు దృష్టి సారించింది. ప్రభుత్వ భూములను అడ్డగోలుగా ఆక్రమించుకొని కొన్నేళ్లుగా అనుభవిస్తున్నా, వాటిపై యంత్రాంగం చట్టపరంగా స్పందించకపోవడంపైనా ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం అమరావతికి రావాల్సిందిగా విశాఖ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. శారదాపీఠం ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదికతో రావాలంటూ ఆదేశించింది. శారదాపీఠం భూ ఆక్రమణలపై "పీఠం వెనక మోసం" శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' బుధవారం వార్తను ప్రచురించింది. ఈ వార్తా కథనంపై సర్కారు స్పందించింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా దీనిపై విశాఖ కలెక్టర్, జేసీతో మాట్లాడినట్లు తెలిసింది.

ఏపీ సమగ్ర శిక్షకు రూ.2,361 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఏపీ సమగ్ర శిక్ష ప్రాజెక్టుకు రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.2,361కోట్ల కేటాయింపులు లభించాయని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. పీఎంశ్రీ పథకానికి రూ.454 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.

ఏపీపీ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన భర్తీ

» 2 నెలల్లో ప్రక్రియ ప్రారంభించండి: సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కింది కోర్టుల్లో ఖాళీగా ఉన్న 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని సీఎస్‌ను హైకోర్టు ఆదేశించింది. భర్తీ ప్రక్రియను 2నెలల్లో ప్రారంభించాలని, ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇవ్వాలని స్పష్టంచేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా సీఎస్ హాజరయ్యారు.

రాజధాని భూముల కేటాయింపుల్లో మార్పులు

» జీఓఎం సిఫారసులతో కొన్ని సంస్థలకు కేటాయింపులు రద్దు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో పలు సంస్థలకు భూములు కేటాయించడం, రద్దు చేయడం, వేరే చోటకు మార్చడం తదితరాలపై మంత్రివర్గ ఉపసంఘం(జీఓఎం) చేసిన సిఫారసుల మేరకు మార్పులతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌సీడీసీ, ఆంధ్రాబ్యాంక్, సిండికేట్ బ్యాంక్, తదితర 13 సంస్థలకు చేసిన భూ కేటాయింపులను రద్దు చేశారు. కొత్తగా భూములకు ప్రతిపాదనలు వచ్చాయి. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌కు 25 ఎకరాలు, హడ్కోకు 8 ఎకరాల భూమి కావాలని ప్రతిపాదించారు. బిట్స్, ఎల్ అండ్ టీ, ఎంఐసీఈ లాంటి ప్రముఖ సంస్థలకు కొత్తగా భూములను కేటాయిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పనుల కేటాయింపు అధికారం సీఆర్‌డీఏ, ఏడీసీలకు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో 22 పనులకు సంబంధించి రూ.22607.11 కోట్ల మేర విలువ చేసే పనులను ఎల్1 బిడ్ దారుకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకునే అధికారం సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఇస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా ప్రపంచబ్యాంకు, ఏడీబీ, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో చేపట్టే 37 పనులకు సంబంధించి రూ.15,095.02 కోట్లు పనులను కేటాయించేందుకు నిర్ణయం తీసుకునే అధికారం అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీ) సీఎండీకి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మద్యం స్కాంలో పాత్ర లేదని ప్రమాణం చేస్తారా?

» పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డికి బుద్దా వెంకన్న సవాల్



విజయవాడ (వన్‌టౌన్), మార్చి 19(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో తమ పాత్ర లేదని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అయ్యప్పస్వామి మీద ప్రమాణం చేసి చెప్పగలరా? అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా మాల వేసుకుని దీక్ష చేయడం కాదని, నిజాయితీగా బతకాలని హితవు పలికారు.

స్థానిక సంస్థల్లో ఖాళీలకు ఎన్నికల నోటిఫికేషన్లు

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో ఖాళీ అయిన పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు విడుదల చేసింది. 12 కోఆప్టెడ్ మండల సభ్యుల ఎన్నిక కోసం, 28 మండలాధ్యక్షులు, 23 మండల ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు, కర్నూలు జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు, కడప జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేయగా.. బుధవారం 214 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌ల ఎన్నికల కోసం రెండు నోటిఫికేషన్లు జారీచేసింది.

స్పీకర్ అయ్యన్నకు తానా ఆహ్వానం



అమరావతి, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): తానా సభలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆ సంస్థ ప్రతినిధులు స్పీకర్ అయ్యన్న పాత్రుడిని ఆహ్వానించారు. అమెరికా మిషిగాన్ రాష్ట్రం, నోవీ నగరంలో 24వ తానా సభలు జూలై 3 నుంచి 5 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా అసెంబ్లీలో స్పీకర్ చాంబర్‌లో ఆయనను తానా కాన్ఫరెన్స్ చైర్మన్ నాదెళ్ల గంగాధర్, మాజీ అధ్యక్షులు జయరామ్ కోమటి, కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్ర, చందు గొర్రెపాటి, శ్రీనివాస్ నాదెళ్ల తదితరులు కలిశారు. సభలకు రావలసిందిగా ఆహ్వానించారు.

జగమంత అసైన్డ్ అక్రమాలు

పెద్దల కోసం యథేచ్ఛగా ఫ్రీహోల్డ్

» కేబినెట్ సబ్‌కమిటీకి రెవెన్యూ నివేదిక

» దిద్దుబాటుకు ఎనిమిది ప్రత్యామ్నాయాలు



భూ పరిపాలన, సంస్కరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు ఆనం, ఫరూక్, అనగాని, కేశవ్, భరత్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : అసైన్డ్ భూములను కాజేయాలన్న పెద్దల సంకల్పం చాలా పెద్దదే. గత డిసెంబరు నెలాఖరు నాటికి రాష్ట్రంలో 4.21 లక్షల ఎకరాల భూములను చట్టవిరుద్ధంగా, రూల్స్‌కు వ్యతిరేకంగా నిషేధ జాబితా 22(ఏ)నుంచి తొలగించారని ప్రభుత్వం భావించింది. వాటిపై ఏం చర్యలు తీసుకోవాలా అని మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పుడు రెవెన్యూశాఖ మరో సంచలన నివేదిక ఇచ్చింది. ఫ్రీ హోల్డ్ అక్రమాలు అక్షరాలా 5,74,306 ఎకరాలని తేల్చింది. అంటే, డిసెంబరు నాటి నివేదికలతో పోలిస్తే, అక్రమాల జాబితాలో అదనంగా మరో 1,52,873 ఎకరాలు చేరాయి. ఫలితంగా జగన్ జమానాలో ఫ్రీ హోల్డ్ ప్రక్రియ పేరిట సాగిన భారీ దందాను రెవెన్యూశాఖ వెలుగులోకి తెచ్చింది. బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన సచివాలయంలోని రెండో బ్లాక్‌లో మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం జరిగింది. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. అసైన్డ్ భూములపై రెవెన్యూశాఖ తాజా నివేదికను సమర్పించింది. అందులోని పలు కీలక అంశాలను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ప్రజంటేషన్ ద్వారా వివరించినట్లు తెలిసింది.

జరిగింది ఇదీ..

గత జగన్ ప్రభుత్వం అసైన్డ్‌మెంట్ చట్టం-1977 ను సవరించి 20ఏళ్ల కాలపరిమితి దాటిన అసైన్డ్ భూములను నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించి రైతులకు శాశ్వత భూ యాజమాన్య హక్కు (ఫ్రీ హోల్డ్) కల్పిస్తామని ప్రకటించింది. దాని అమలుకు 2023 డిసెంబరు 19న జీవో 596 జారీ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి, అంటే 2024 జూన్ వరకు 13,59,805 ఎకరాల భూమిని నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించి ఫ్రీ హోల్డ్ చేశారు. రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చారు. వీటిల్లోని అక్రమాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక బృందాలతో విచారణ చేయించింది. గత డిసెంబరులో రెవెన్యూశాఖ సర్కారుకు ఇచ్చిన నివేదిక ప్రకారం, 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో 4.21లక్షల ఎకరాలను చట్టవిరుద్ధంగా, జీవో 596ను ఉల్లంఘించి నిషేధ జాబితా నుంచి తొలగించినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వం మరోసారి పున:పరిశీలన చేయించింది. ఈ నెల 4నాటికి రెవెన్యూశాఖ రికార్డుల పున:పరిశీలన పూర్తిచేసింది. ఇదే అంశం బుధవారం మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చింది. కాగా, రెవెన్యూ రికార్డుల పున:పరిశీలనలో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 2,69,178 ఎకరాల భూమికి అసైన్ చేసినట్లుగా నిర్ధారించే రికార్డులే లేవని తేలింది. 20 ఏళ్ల కాలపరిమితి నిండని 26,975 ఎకరాలను కూడా ఫ్రీ హోల్డ్ చేయించిన ఘనత జగన్ సర్కారుదే. ఈ నేపథ్యంలో అక్రమాల గుట్టు పూర్తిగా తేలేవరకు ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలిపివేతను ఈ ఏడాది మే 11 వరకు పొడిగించినట్లు రెవెన్యూశాఖ నివేదించింది. భూ అక్రమాలపై విచారణ పూర్తికాలేదని, అనేక లావాదేవీలు, భూముల రికార్డులను పున:పరిశీలన చేస్తున్నామని సీసీఎల్ఏ జయలక్ష్మి ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఫ్రీ హోల్డ్‌ను ఏం చేస్తారు?

ఫ్రీ హోల్డ్‌ను ఏం చేయాలన్న అంశంలో ఉపసంఘం ఎదుట రెవెన్యూశాఖ ఎనిమిది రకాల ప్రత్యామ్నాయాలను ఉంచినట్లు తెలిసింది. అవి...

1) చట్టసవరణను కొనసాగిస్తారా? లేక పాత విధానమే పునరుద్ధరిస్తారా? జీవో 596ని అమలు చేస్తారా? 2) నిషేధ జాబితాను తిరిగి పునరుద్ధరిస్తారా? 3) ఫ్రీ హోల్డ్‌ను రద్దుచేస్తారా? 4) లేక అక్రమాలకు గురైన భూములకు మాత్రమే ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్‌ను రద్దుచేస్తారా? 5) అక్రమంగా ఫ్రీ హోల్డ్ అయి, రిజిస్ట్రేషన్ చేసిన భూముల సేల్‌డీడ్‌లను రద్దుచేస్తారా? 6) చట్టవిరుద్ధంగా నిషేధ జాబితా నుంచి బయటపడేసిన భూములను అసైన్డ్ చట్టంలోని క్లాజులను ఉపయోగించి తిరిగి స్వాధీనం చేసుకోవాలా? 7) భూ అక్రమాల్లో పాత్ర ఉన్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి? 8) ఫ్రీహోల్డ్ విధానంలో మార్పు చేర్పులు చేసి కొనసాగిస్తారా? కాగా, ఏప్రిల్ 16న మరోసారి ఉపసంఘం భేటీ అయి రెవెన్యూశాఖ సూచించిన ప్రత్యామ్నాయాలపై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఫ్రీ హోల్డ్ భూములపై సమగ్రంగా చర్చించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అక్రమంగా ఫ్రీ హోల్డ్ అయిన భూములపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నియోజకవర్గాల వారీగా అసైన్డ్‌మెంట్ కమిటీలు పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. త్వరలో కమిటీల నియామకం ఉంటుందన్నారు. జగనన్న ఇళ్ల పథకంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేలుస్తామని తెలిపారు.

వైసీపీకి మర్రి రాజీనామా



ఎమ్మెల్సీ పదవికి గుడ్ బై

వెంటనే ఆమోదించాలని చైర్మన్‌కు వినతి

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరుపొందిన మరో నాయకుడు వైసీపీకి దూరం కానున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కలిసి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖను అందించారు. వెంటనే ఆమోదించాలని కోరారు. ఆయన రాజీనామా చేస్తున్నారని తెలిసిన వెంటనే కొందరు వైసీపీ నేతలు అసెంబ్లీ లాబీల్లో ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. రాజీనామా యోచన మానుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అయితే నిర్ణయం తీసేసుకున్నానని రాజశేఖర్ తేల్చిచెప్పారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆయన వైదొలగడం గమనార్హం. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్సీలు.. పోతుల సునీత, బల్లి కల్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, జయమంగళ వెంకటరమణ ఆ పార్టీకి, మండలి సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రాజశేఖర్‌తో కలిపి వైసీపీ అసంతృప్త ఎమ్మెల్సీల సంఖ్య ఐదుకు చేరింది. మరికొందరు ఆ జాబితాలో చేరతారన్న ప్రచారం ముఖ్య నేతలను కలవరపరుస్తోంది. జగన్ వైఖరితో విసిగిపోయి.. విభేదిస్తున్న సన్నిహితులు ఒక్కరొక్కరుగా ఆయనకు దూరమవుతున్నారు. ఆయన అధికారంలో ఉండగానే.. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిలారెడ్డి వైసీపీని వీడివెళ్లారు. జగన్‌కు దగ్గరి బంధువైన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. జగన్ అక్రమాస్తుల కేసులో సహ నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు సైతం పార్టీకి, రాజ్యసభకు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఎంపీలు బీద మస్తాన్‌రావు టీడీపీలో, ఆర్.కృష్ణయ్య బీజేపీలో చేరిపోయి మళ్లీ రాజ్యసభ సభ్యత్వం దక్కించుకున్నారు.. ఇవన్నీ ఒక్క ఎత్తయితే.. వ్యాపారాలు మొదలైనప్పటి నుంచి వైఎస్ కుటుంబంతో కలిసి నడచి వైసీపీలో నంబర్ టూగా చలామణి అయిన విజయసాయిరెడ్డి కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. రాజ్యసభకూ రాజీనామా చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటానన్న ఆయన.. ఇటీవలి కాలంలో జగన్ కంట్లో నలుసుగా మారారు. 'ఎక్స్' వేదికగా జగన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన చుట్టూ కోటరీ చేరిందని.. దానిని నమ్ముకుంటే కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

వైసీపీలో ఇమడలేని మర్రి

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్ కొన్నాళ్లుగా వైసీపీలో ఇమడలేకపోతున్నారు. జగన్ పొమ్మనకుండా పొగ పెట్టి పంపే పరిస్థితి కల్పించారు. వాస్తవానికి ఆయనకు మంచి రాజకీయ నేపథ్యం ఉంది. చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య ఆయనకు మేనమామ.. మామ కూడా. సాంబయ్య అక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్‌పై మూడుసార్లు (1978, 1985, 1994లో) గెలుపొందారు. రాజశేఖర్ కూడా ఆయన బాటలోనే పయనించారు. 2004లో తనకు కాంగ్రెస్ టికెట్ లభించకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. ఆయనకు టికెట్ ఇవ్వనందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేయడంతో.. ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. ఇండిపెండెంట్ అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతివ్వాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఆ ఎన్నికల్లో రాజశేఖర్ 212ఓట్ల స్వల్ప ఆధిక్యంతో ప్రత్తిపాటి పుల్లారావుపై విజయం సాధించారు. 2009లో మాత్రం ఓడిపోయారు. 2014లో వైసీపీ టికెట్‌పై పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2019 ఎన్నికల విడదల రజినీకి జగన్ టికెట్ ఇచ్చారు. పార్టీ గెలిచిన వెంటనే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని, మంత్రి పదవి కూడా ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో వైసీపీ విజయానికి రాజశేఖర్ కృషి చేశారు. తీరా జగన్ నాలుగేళ్ల వరకు ఊరించి ఎట్టకేలకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. మంత్రి పదవిని రజినీకి కట్టబెట్టారు. 2024 ఎన్నికల్లో కూడా రాజశేఖర్‌తో ఆడుకున్నారు. అదిగో ఇదిగో అంటూ గుంటూరు మేయర్ మనోహర్‌నాయుడికి టికెట్ ఇచ్చారు. ఆయన ఓడిపోయారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కూడా రాజశేఖర్‌ను కాదని మళ్లీ రజినీకే ఇచ్చారు. వరుస అవమానాలు భరిస్తూ వైసీపీలో కొనసాగడం ఎందుకని అనుచరుల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. దీంతో మొదట ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. త్వరలోనే వైసీపీని వీడుతూ ప్రకటన చేస్తారని సన్నిహిత వర్గాలు అంటున్నాయి.

మా రాజీనామాలు ఆమోదించండి...

ఎమ్మెల్సీ పదవులకు తాము చేసిన రాజీనామాలను ఆమోదించాలని జయమంగళం వెంకటరమణ, బల్లి కల్యాణచక్రవర్తి, కర్రి పద్మశ్రీ బుధవారం చైర్మన్ మోషేన్‌రాజును కోరారు. వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక సమస్యలతో రాజీనామా చేశానని, వెంటనే ఆమోదించాలని వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. గత ఏడాది ఆగస్టు 30న రాజీనామా చేశామని, ఆమోదించాలని కల్యాణచక్రవర్తి, పద్మశ్రీ అభ్యర్థించారు. రాజీనామాలు పరిశీలనలో ఉన్నాయని చైర్మన్ తెలిపారు.

అవి అసభ్యకరమైన పోస్టులే

వాటిని కట్టడి చేయాల్సిందే: హైకోర్టు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో పిటిషనర్లు పెట్టిన పోస్టులు అసభ్యకరమైనవేనని, ఈ విషయంలో రెండో ఆలోచనే లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. అసభ్యకర పదజాలంతో ఎదుటివారి గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలించేగేలా పెట్టే పోస్టులను కట్టడి చేయాల్సిందేనని వ్యాఖ్యానించింది. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులను నిరోధించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టేలా వైసీపీ కార్యకర్తలను, సానుభూతి పరులను ప్రోత్సహించారనే ఆరోపణలతో వైసీపీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గరెడ్డి, అర్జున్‌రెడ్డి, మరికొందరు నిందితులపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని నిందితులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వాజ్యాలపై విచారణ సందర్భంగా ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. వ్యవస్థీకృత నేరం(బీఎన్ఎస్ఎస్ సెక్షన్- 111)లో కిడ్నాపింగ్, దోపిడీ, భూ ఆక్రమణలు, ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్ తదితర తీవ్ర నేరాల గురించి ప్రస్తావించారని గుర్తుచేసింది. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు సైబర్ క్రైమ్‌తో ఎలా సమానమవుతాయో చెప్పాలని పీపీని హైకోర్టు ఆదేశించింది. నిందితులపై వ్యవస్థీకృతనేరం కింద కేసు నమోదుచేయడంపై వాదనలు వినిపించాలని పీపీకి స్పష్టం చేసింది. వ్యవస్థీకృత నేరం (బీఎన్ఎస్ఎస్ సెక్షన్-111) కింద కేసు నమోదు చేసేందుకు నిందితుడిపై అదే తరహా కేసుల్లో 2 చార్జిషీట్లు నమోదై ఉండాలన్న వాదన సరికాదని, అలాంటి నిబంధన చట్టంలో ఎక్కడా లేదని, ఇది దేశంలోని వివిధ కోర్టుల అభిప్రాయం మాత్రమేనని తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు అసభ్యకర పోస్టులు సృష్టించి, ప్రత్యర్థుల ప్రతిష్ఠను దిగజార్చేలా వాటిని ప్రణాళికాబద్ధంగా సోషల్ మీడియాలో వ్యాప్తి చేశారని తెలిపారు. అసభ్యకర పోస్టులు వ్యాప్తి చేసినందుకు సోషల్ మీడియాల గ్రూపు సభ్యులకు సొమ్ము చెల్లించారని, ఈ చర్య వ్యవస్థీకృత నేరం కిందికి వస్తుందని వివరించారు. వైసీపీ సోషల్ మీడియా విభాగంలో సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్‌రెడ్డి, ఇతర పిటిషనర్లు కీలక పాత్ర పోషించారని సహ నిందితులు వాంగ్మూలం ఇచ్చారని, వారి ప్రోద్బలం, ప్రోత్సాహంతోనే అసభ్యకర పోస్టులు ప్రచారం చేశారని తెలిపారు.

బలమైన పార్టీగా నిర్మిస్తాం

» ఆవిర్భావ సభను సక్సెస్ చేసినవారికి కృతజ్ఞతలు: పవన్

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జనసేనను రానున్న రోజుల్లో మరింత బలమైన పార్టీగా నిర్మాణం చేస్తామని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో నిర్వహించిన 'జయకేతనం' ఆవిర్భావ సభ విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ బుధవారం 'ఎక్స్'లో ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్‌లో తమ పార్టీ సామాన్యుల గొంతుకగా మారుతుందని, రాష్ట్ర ప్రయోజనాలు, జాతీయ ఐక్యత లక్ష్యంగా, మరింత బాధ్యతతో పనిచేసే దిశగా అడుగులు వేయనుందని తెలిపారు. జనసేన 11 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకుని.. 12వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొన్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి, ఎన్డీయే నాయకులు, చిత్ర పరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. 'ముందుగా ఈ వేడుకను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకునేందుకు, అన్ని విధాలుగా సహకరించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసిన పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు. ముఖ్యంగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కి, సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్‌కు క్షేత్రస్థాయిలో పని చేసిన ప్రతి ఒక్క పోలీసు అధికారికి, కానిస్టేబుల్ సోదరులకు కృతజ్ఞతలు. నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యేలు, ఎంపీలకు ధన్యవాదాలు. తీవ్రమైన ఎండ ఉన్నప్పటికి, కార్యక్రమానికి విచ్చేసినవారికి పండ్లు, మజ్జిగ, నీరు, ఆహారం అందించిన ఫుడ్ కమిటీకి, సభకు స్థలాన్ని అందించిన దాతలకు, పారిశుధ్య సిబ్బందికి ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
www.scr.indianrailways.gov.in

టెండరు ప్రకటన నం. PCME/ SCR/ Mech/ 04/2025/ACWP తేది: 18.03.2025

టెండరు నం:SCR/Mech/04/2025/ACWP తేది: 18.03.2025, టెండరు రకం: పని టెండరు (2 ప్యాకెట్లు), పని పేరు: విజయవాడ డివిజన్‌లో కోచింగ్ డిపో/మచిలీపట్నం మరియు విజయవాడ డివిజన్‌లో కోచింగ్ డిపో/విజయవాడ, నాందేడ్ డివిజన్‌లో కోచింగ్ డిపో/ఔరంగాబాద్, నాందేడ్ డివిజన్‌లో కోచింగ్ డిపో/జల్నా, సికింద్రాబాద్ డివిజన్‌లో కోచింగ్ డిపో/చర్లపల్లి వద్ద ఆటోమేటిక్ కోచ్ వాషింగ్ ప్లాంట్లు (ACWP) (టర్న్ కీ ప్రాతిపదికన)లో డిజైన్, తయారీ, సరఫరా, స్థాపన, పని చేయించుట మరియు నిర్వహించుట. **ప్రకటిత వ్యయం:** రూ. 15,92,18,358/-, **బయానా/ బిడ్ సెక్యూరిటీ :** రూ.9,46,100/-, **టెండరు డాక్యుమెంట్ ధర:** లేదు, **టెండరు ముగింపు తేది మరియు సమయం:** 09.04.2025న 15.00 గం.లకు. **టెండరు తెరచు తేది మరియు సమయం:** 09.04.2025న 15.30 గం.లకు. **ఆఫర్ చెల్లుబాటు:** 90 రోజులు, **పూర్తి చేయాల్సిన కాలం:** అంగీకార లెటర్ (లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్) (LOA) నుండి 24 నెలలు. కోరుతున్న వారు: చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ & CME/Plg

ప్రిన్సిపాల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్/సికింద్రాబాద్.

ఇ-టెండరు ప్రకటన నం B/E.EGS/ 15/2024-25 తేది: 18.03.2025

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ తెలిపిన తేదీన 15-00 గం. వరకు ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం: 01 **టెండరు నం:** B/E.29/I/ EGS/41/24-25 తేది: 18.03.2025, **పని పేరు:** 1) BZA డివిజన్:- BZA డివిజన్‌లోని సర్వీసు భవనాలకు రీవైరింగ్. **టెండరు విలువ:** రూ.92,40,014.50 **బయానా/ బిడ్ సెక్యూరిటీ:** రూ.1,84,800 **టెండరు డాక్యుమెంట్ ధర:** లేదు **పూర్తిచేయు కాలం:** 9 నెలలు **ముగింపు తేది:** 11.04.2025

క్ర.సం: 02 **టెండరు నం:** B/E.29/I/ EGS/42/24-25 తేది: 18.03.2025, **పని పేరు:** 1) BZA డివిజన్:- MCS/RJY:- MCS/RJY వద్ద MEMU కోచ్ నిర్వహణ సౌకర్యాల మెరుగుదల మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి; **2)** BZA-CDO/BZA:- అభివృద్ధి/ స్థాయిపెంపుదల క్రింద కోచ్ నిర్వహణ సౌకర్యాల అభివృద్ధి 0 ఇతర రోలింగ్ స్టాక్ నిర్వహణ సౌకర్యం - విద్యుత్ ఏర్పాట్లు. **టెండరు విలువ:** రూ.83,17,833.84 **బయానా/ బిడ్ సెక్యూరిటీ:** రూ.1,66,400 **టెండరు డాక్యుమెంట్ ధర:** లేదు, **పూర్తిచేయు కాలం:** 12 నెలలు **ముగింపు తేది:** 11.04.2025

క్ర.సం: 03 **టెండరు నం:** B/E.29/I/ EGS/43/24-25 తేది: 18.03.2025, **పని పేరు:** 1) BZA డివిజన్:- డివిజన్‌లో పాతబడిన కన్వెన్షనల్ పంపులను ఎనర్జీ ఎఫిషియంట్ స్టార్ రేటెడ్ పంపులతో పాటు సేర్ పార్ట్స్ రీప్లేస్‌మెంట్. **టెండరు విలువ:** రూ.84,99,812 **బయానా/ బిడ్ సెక్యూరిటీ:** రూ.1,70,000 **టెండరు డాక్యుమెంట్ ధర:** లేదు **పూర్తిచేయు కాలం:** 6 నెలలు **ముగింపు తేది:** 10.04.2025

ఏదేని టెండరు కొరకు ఏదేని మార్పులు/ సవరణ గమనించడానికి టెండరు ముగింపు తేదీకి ముందు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను దర్శించాలని కాగోరు టెండరుదారులు సూచించబడుచున్నారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ

టెండరు ప్రకటన నం.B-E29-TRD-TNDR-24-24-25 తేది: 17.03.2025

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారుచే IREPSలో టెండర్లు కోరబడినవి.

టెండరు నం. B/E.29-TRD-TNDR-24-2024-25 **పని పేరు:** విజయవాడ డివిజన్ - KAPT-OBVP సెక్షన్: EPC విధానంలో భారతమాల పరియోజన ఫేజ్-1 క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తమ్మినపట్నం నుండి నార్కొపల్లె (భాగం-1 కి.మీ. 0+000 నుండి కి.మీ. 14+650) వద్ద కృష్ణపట్నం పోర్టు దగ్గర ఖండలేరు క్రీక్ ఫోర్ లేనింగ్ గ్రీన్ ఫీల్డ్ రోడ్ కనెక్షన్ నార్త్ & సౌత్ ఇండస్ట్రియల్ క్లస్టర్ నిర్మాణానికి సంబంధించి కి.మీ.10+300 (KAPT-OBVP సెక్షన్‌లోని రైల్వే కి.మీ.109/33) వద్ద ROB (రోడ్ ఓవర్ బ్రిడ్జి) ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించి OHEకి మార్పులు & చేర్పులు మరియు NH-67 (భాగం-2 కి.మీ. 18+000 నుండి కి.మీ. 19+300) పై డెడికేటెడ్ పోర్ట్ రోడ్ సిక్స్ లేనింగ్‌కు విస్తరణ. **సుమారు విలువ:** రూ.31,31,459.83 **బిడ్ సెక్యూరిటీ (EMD):** రూ.62,600/- **పూర్తిచేయు కాలం:** 06 నెలలు, **ముగింపు తేది:** 11.04.2025న 15.00 గం.

క్ర.సం.1 - టెండరు ఫారం ధర: రూ. లేదు

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ /TRD/విజయవాడ

టెండరు ప్రకటన నం 21-Mech-MBT-TPTY-R-24-25 తేది: 18.03.2025

భారత రాష్ట్రపతి తరఫున, Dy.CME/ CRS/TPTY వారు దిగువ తెలిపిన విధంగాదిగువ తెలిపిన విధంగా ముగింపు తేదీన 11.00 గం.వరకు టెండరు నంబరుపై ఇ-టెండర్లు కోరుతున్నారు. బిడ్డర్లు వారి ఒరిజినల్/సవరించిన బిడ్లను ముగింపు తేది మరియు సమయంలోగా మాత్రమే దాఖలు చేయవలసి ఉంటుంది. మాన్యువల్ ఆఫర్లు ఈ టెండరుపై అనుమతించబడదు,. మరియు ఏదేని అందిన మాన్యువల్ ఆఫర్ పరిశీలించబడదు.


క్ర.సం.01 **పని వివరణ:** టెండరు నం.21-Mech-MBT-TPTY-R-24-25 తేది: 18.03.2025. సిఆర్ఎస్/టిపిటివై వద్ద కోచ్‌లలో పిఓహెచ్ అటెన్షన్ సమయంలో బయోటాయిలెట్ల ట్యాంకుల నిర్వహణ. **సుమారు వ్యయం:** రూ.1,04,44,496/-, **బిడ్ సెక్యూరిటీ:** రూ.2,02,200/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 24 నెలలు. **ముగింపు తేది:** 08.04.2025న 11.00 గం.లకు.

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in టెండరు పూర్తి వివరాలు ఉన్నట్టి నోటీస్ బోర్డు ప్రదేశం చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్, తిరుపతి కార్యాలయంలో చూడవచ్చును.

డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్/ సిఆర్ఎస్/ తిరుపతి.

A0346

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.



గెలిపించకుంటే గన్‌మెన్‌ను తీసేస్తామన్నారు!

▸ టగ్ ఆఫ్ వార్‌లో బెదిరించి గెలిచారు!.. ఎమ్మెల్యేల ఆటల పోటీలపై సరదా సంభాషణ

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శాసనమండలి లాబీలో మంత్రులు అనిత, సంధ్యారాణి, టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, బీజేపీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిల మధ్య ఆసక్తికర చర్చ సాగింది. టగ్ ఆఫ్ వార్‌లో సంధ్యారాణితో పోటీపడితే తన చెయ్యి కొట్టుకుపోయిందని అనిత న్నారు. మహిళా జట్టును గెలిపించకపోతే గన్‌మెన్లను ఉపసంహరిస్తామని హోంమంత్రి బెదిరించారని అశోక్‌బాబు చమత్కరించారు. పురుష ఎమ్మెల్యేలపై పోలీసు పవర్ ప్రయోగించి గెలిచారని వాకాటి శ్రుతి కలిపారు. రూల్స్ ప్రకారమే ఆడి గెలిచామని సంధ్యారాణి సమాధానమిచ్చారు. తాబేలు కుందేలు కథలో కుందేలు మాదిరి తమను పురుష ఎమ్మెల్యేలు తక్కువ అంచనా వేశారని అనిత అన్నారు.

ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1నుంచి ప్రారంభమయ్యే 2025-26 వార్షిక బడ్జెట్‌కు శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదం కోసం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సభలో సమర్పించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఇప్పటికే అన్ని అంశాలు చర్చించినందున చర్చ లేకుండా ఆమోదించాలని సభను మంత్రి కోరడంతో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుతోపాటు మహానగర ప్రాంత, పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థల(సవరణ) బిల్లు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లు, ఉపాధ్యాయుల బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు శాసనమండలి ఆమోదం తెలిపింది. కాగా, శాసనసభలో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రైవేట్ విశ్వ విద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ (రెండో సవరణ) బిల్లు-2025కు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తామని చెప్పారు.

ఆహార కల్తీలో ఆంధ్రా టాప్

▸ ఈ మాట చెప్పడానికి సిగ్గుపడుతున్నాం: ఎమ్మెల్యేలు

'పాలు కల్తీ.. టీ పొడి కల్తీ.. ఆహార పదార్థాలన్నీ కల్తీ.. ఆఖరికి తిరుపతి లడ్డూలోనూ కల్తీనే'.. అని అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆహార కల్తీలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని చెప్పడానికి సిగ్గు పడుతున్నా' అని జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలు బుధవారం అసెంబ్లీలో పెద్ద చర్చకు దారితీశాయి. రాష్ట్రంలోని హోటళ్లపై సరైన నియంత్రణ లేదని, ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేయడంలో దేశంలోనే మన రాష్ట్ర హోటళ్లు ముందున్నాయని నానాజీ ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో టీ పొడిలో టైర్ల పొడి కలిపారని, పన్నెండు మందిని ఇటీవల గుర్తించామని బుచ్చయ్య చౌదరి సభ దృష్టికి తీసుకొచ్చారు. హోటళ్లలో నిల్వ మాంసం వండివడ్డిస్తున్నారని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆహార తనిఖీ వ్యవస్థను బలోపేతం చేసి, ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే హోటళ్లలో తనిఖీలు చేసి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యేలు ఏకరువు పెట్టారు. దీనిపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ.. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, ఆహార తనిఖీలు, పరీక్షలకు సిబ్బంది లేకుండా చేసి, దేశంలో కల్తీ ఆహార సరఫరాలో ఏపీకి మొదటి స్థానం దక్కేలా చేసిందని ఎద్దేవా చేశారు. సిబ్బంది కొరత తీర్చి నాణ్యమైన ఆహారం అందేలా చూస్తామన్నారు.

స్పెషాలిటీలకు డాక్టర్లు రావట్లేదు: సత్యకుమార్

రాష్ట్రంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత ఉందని, భర్తీకి ప్రయత్నం చేస్తున్నా డాక్టర్లు ముందుకు రావట్లేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. సూపర్ ఆసుపత్రుల్లో 369మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరం కాగా, 153మందే ఉన్నారని చెప్పారు.

గుంటూరు మిర్చియార్డును ప్రక్షాళన చెయ్యాలి

అవినీతి, అక్రమాలు, అరాచకాలకు వేదికైన గుంటూరు మిర్చియార్డును ప్రక్షాళన చేయాలని ధూళిపాళ్ల నరేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మార్కెట్ సెస్ వందల కోట్ల రూపాయలు తినేస్తున్నారని 250కోట్లకుగానూ 100కోట్లు మాత్రమే చూపిస్తున్నారని బూర్ల రామాంజనేయులు అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. మిర్చియార్డులో అక్రమాలపై విజిలెన్స్ నివేదిక వచ్చిందని, గత ప్రభుత్వంలో చైర్మన్లు, సెక్రటరీలు చేసిన అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హంద్రీ-నీవా పనులపై మాట్లాడలేదే?: నిమ్మల

రాష్ట్ర బడ్జెట్‌లో హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.3,240 కోట్లు కేటాయించామని మంత్రి నిమ్మల రామానాయుడు మండలిలో చెప్పారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ వద్దంటున్న వైసీపీ సభ్యులు.. గతంలో జగన్ ఆదేశాలిచ్చినప్పుడు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఓ వైసీపీ నేత కుప్పం నుంచి చిత్తూరుకు పైపుల ద్వారా నీరు తీసుకువెళుతుంటే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని అడిగారు.

పేదల మేలుకే రెవిన్యూ సంస్కరణలు: అనగాని

పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం రెవిన్యూ శాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. బుధవారం శాసనసభలో జీవో 55 వల్ల తలెత్తుతున్న సమస్యలను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఇళ్ల పట్టాలుగా ఇచ్చిన స్థలాలను పదేళ్ల తర్వాత అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ చేయడం లేదని, ఆ భూములన్నీ ఫ్రీహోల్డ్‌లో ఉన్నాయని చెబుతున్నారని ఎమ్మెల్యేలు తెలిపారు. దీనికి మంత్రి సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. భూ సమస్యలపై జోన్ల వారీగా ఎమ్మెల్యేలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దేవుడి మాన్యాలను కాపాడాలి: పార్థసారథి

రాష్ట్రంలో హిందూ దేవాలయాల మాన్యాలను కాపాడాలని, కబ్జాదారులను తీవ్రంగా శిక్షించాలని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే వీ పార్థసారథి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో 4.10 లక్షల ఎకరాల ఆలయ భూములు ఉండగా, లక్షా 13 వేల ఎకరాలు కబ్జా అయ్యాయి. అలవెన్స్ పేరుతో ప్రభుత్వం 34 వేల ఎకరాలు తీసుకుంది. ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం అలవెన్సుల పేరుతో దేవుడిపైనే భారం వేసింది' అన్నారు.

చట్ట సభలపై ప్రభుత్వానికి గౌరవం లేదు: బొత్స

'చట్ట సభల పట్ల ప్రభుత్వానికి గౌరవం లేదు. మండలిని టేకిట్ ఈజీగా తీసుకుంటున్నారు' అని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బీఏసీలో 19న ఆర్థిక బిల్లు పెడతామన్నారు. కానీ అజెండాలో పెట్టలేదు. అయినా ప్రవేశపెడతామని పట్టుబడితే.. చర్చించాల్సి ఉన్నందున గురువారం పెట్టమని చెప్పాం. ఆ అవసరం లేదంటూ ఆర్థిక మంత్రి బిల్లు పెట్టారు. బిల్లు పాస్ అయినట్లు చైర్మన్ రూలింగ్ ఇచ్చారు.దీంతో గౌరవం లేని సభలో ఉండటం అనవసరమని వాకౌట్ చేశాం' అని చెప్పారు.

నేరాలపై హోం మంత్రివి అబద్ధాలు: వైసీపీ

గత 10 నెలల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగితే.. నేరాలు తగ్గాయని హోం మంత్రి అబద్ధాలు చెప్పారని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. 'ప్రభుత్వ గణాంకాల ప్రకారమే రోజుకు మహిళలపై 70 ఘటనలు జరుగుతుంటే ప్రజల్ని ఎందుకు తప్పు దారి పట్టిస్తున్నారు? గత ప్రభుత్వం దిశ యాప్ తెస్తే.. దాన్ని కాపీ కొట్టి శక్తి యాప్ తెచ్చారు. 10 రోజుల్లోనే కోటి మందిపైగా డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పడం విడ్డూరంగా ఉంది' అని ఎద్దేవా చేశారు.

ఫొటో సెషన్‌లో అవమానం: బొత్స

▸ విచారించి చర్యలు తీసుకుంటాం: మంత్రులు

తాము మంగళవారం అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఫొటో సెషన్‌కి వెళితే తనకు కుర్చీ కూడా లేదని తనతోపాటు చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కూడా చిన్నచూపు చూశారని విపక్షనేత బొత్స సత్యనారాయణ బుధవారం శాసనమండలిలో ప్రస్తావించారు. స్పోర్ట్స్ మీట్ వేదిక, ద్వారాల వద్ద చైర్మన్ ఫొటోలు లేవని, చైర్మన్‌ను వ్యక్తిగతంగా కించపరుస్తూ, అవమానిస్తున్నారని బొత్స అన్నారు. ప్రొటోకాల్ అధికారులు చేస్తున్న అతి, తప్పిదాల వల్ల సభ్యుల మర్యాదకు భంగం కలుగుతోందని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. బొత్స వ్యాఖ్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ 'చైర్మన్ పట్ల ప్రభుత్వానికి చిన్న చూపులేదు. చైర్మన్ రాక ఆలస్యమైతే సీఎం, డిప్యూటీ సీఎంలు మండుటెండలో 10 నిమిషాల సేపు వేచి చూశారు. చైర్మన్ వచ్చాకే ఫొటో సెషన్ ప్రారంభించారు' అని చెప్పారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ 'ఎమ్మెల్సీలను కించపరిచే ఉద్దేశం మాకు లేదు. చైర్మన్ మోషేన్‌రాజు అంటే మాకు గౌరవం ఉంది. జరిగిన ఘటనను సీరియస్‌గా తీసుకుని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

రెండేళ్లలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

▸ ఉపాధ్యాయుల బదిలీల చట్టం ఒక చరిత్ర

▸ సంఘాలతో చర్చించాకే బిల్లుకు రూపకల్పన

▸ పారదర్శకంగా టీచర్ల సీనియారిటీ జాబితా

▸ వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా బదిలీలు

▸ శాసనసభలో లోకేశ్.. బిల్లుకు ఆమోదం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల చట్టం ద్వారా కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించబోతోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రెండేళ్లలోనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ చట్టం-2025 బిల్లును శాసనసభ బుధవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్ మాట్లాడారు. 'చంద్రబాబు ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తోంది. 2017లో సరికొత్త మార్గదర్శకాలను రూపొందించుకుని ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీలు నిర్వహించారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, పురపాలక పాఠశాలలకు సొంత మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిపై అనేక కోర్టు కేసులు, కోర్టు ధిక్కరణ కేసులు ఎదుర్కోవాల్సి వస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలకు ఏకీకృత చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించాం' అని మంత్రి లోకేశ్ వివరించారు.

గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యం

'గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో కూడా 1100 మంది ఉపాధ్యాయులను ఏకపక్షంగా బదిలీ చేశారు. కొంతమందిపై రాజకీయ కక్షతో కావాలని బదిలీలను నిలిపివేశారు. గడచిన ఐదేళ్లలో అనేక సమస్యలు రావడంతో కోర్టు జోక్యం చేసుకుని అక్రమ బదిలీలను రద్దు చేసింది. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ జోక్యాన్ని నివారించి, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ చట్టాన్ని రూపొందించాం. గత ప్రభుత్వంలో మాదిరిగా కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా చట్టాలను రూపొందించడం లేదు. బిల్లును రూపొందించే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాం. చివరికి వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘ నేతలతో కూడా చర్చలు జరిపి వారి అభిప్రాయలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. ఉపాధ్యాయుల నుంచి కూడా అభిప్రాయ సేకరణ చేశాం. రాష్ట్రవ్యాప్తంగా 7,735 సలహాలు వచ్చాయి. పొరుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను కూడా పరిశీలించాం. ఉపాధ్యాయ బదిలీల మార్గదర్శకాలను అందరికీ అందుబాటులో ఉంచాం. పారదర్శక విధానంలో ఉపాధ్యాయుల సీనియారిటీని తెలుసుకోవచ్చు. పదోన్నతులను కూడా అంతే పారదర్శకంగా కల్పిస్తాం. అందరికీ ఆమోదయోగ్యమైన విధానంలో నూరు



శాతం అమలు చేయవచ్చు' అని లోకేశ్ చెప్పారు. 'ఐటీడీఏ ప్రాంతాల్లో పని చేసే ఉపాధ్యాయులకు అదనపు పాయింట్లు ఇచ్చి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జూన్ నాటికి సంస్కరణలు అమలులోకి తీసుకువస్తాం. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందిస్తున్నాం. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ కూడా జారీ చేస్తాం' అని మంత్రి వివరించారు. అంతకుముందు బిల్లుపై చర్చలో టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడారు.

12 లక్షల మంది విద్యకు దూరం

▸ వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్‌లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

▸ నాటి మంత్రి బొత్స జవాబు చెప్పాలి: లోకేశ్

వైసీపీ హయాంలో ఎంతమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారో డేటా లేదని, దీనికి నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్‌లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారని చెప్పడంపై బొత్స సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. ఆ సంఖ్య ఎక్కడి నుంచి తెచ్చి చెబుతున్నారని ప్రశ్నించారు. దీంతో లోకేశ్, బొత్సల మధ్య మాటల యుద్ధం నడిచింది. 'ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్‌లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారనే వ్యాఖ్యలకు నేను కట్టుబడి ఉన్నా. బొత్స మంత్రిగా ఉన్నప్పుడు పాఠశాల విద్యలో ఎంత మంది ఉన్నారో లెక్కలు చెప్పాలి. దీనిపై చర్చకు సిద్ధంగా ఉన్నా. విద్యార్థులు ఎక్కడ తగ్గారు, వారంతా ఎక్కడికి వెళ్లారు? ఏ ప్రైవేటు పాఠశాలల్లో సంఖ్య పెరిగిందో చెబుతా. బొత్స టోఫెల్ గురించి మాట్లాడుతున్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే చూస్తే 2017లో ఇంగ్లీష్‌లో దేశంలో మన రాష్ట్రం నాల్గవ స్థానంలో ఉంది. వైసీపీ హయాంలో 14వ స్థానానికి పడిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో సీటు కావాలని, సిఫారసు చేయాలని ఎప్పుడైతే తల్లిదండ్రులు.. ప్రజాప్రతినిధులను అడుగుతారో అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెరిగాయనే నమ్మకం ఏర్పడుతుంది. దీనిని చాలెంజ్‌గా తీసుకుని, రెండేళ్లలో చేసి చూపిస్తాం' అని లోకేశ్ చెప్పారు. కాగా, 2014-19 వరకు పాఠశాలల్లో ఏ సౌకర్యాలు ఉన్నాయో, తమ హయాంలో ఏ సౌకర్యాలు కల్పించామో చర్చకు సిద్ధమని, అవసరమైతే ఒక స్టడీ టూర్ పెడితే రావడానికి, చర్చించడానికి తాము సిద్ధమేనని బొత్స అన్నారు.

ఒక్క పాఠశాలనూ మూసేయం

రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకువస్తామని లోకేశ్ చెప్పారు. జీవో 117 వల్ల 10,49,596 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారన్నారు. జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకువస్తామని, రాష్ట్రంలో ఒక్క పాఠశాలను కూడా మూసివేయబోమన్నారు.

హిందీ.. తప్పనిసరని కేంద్రం చెప్పలేదు

'హిందీ తప్పనిసరిగా నేర్చుకోవాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. మాతృభాషను ప్రోత్సహించి, కాపాడుకోవాలని చెప్పింది. స్థానిక భాషతోపాటు హిందీ, ఇతర భాషలు నేర్చుకుంటే బాగుంటుందని కేంద్రం తెలిపింది' అని లోకేశ్ అన్నారు.

విద్య కాషాయీకరణపై ఆధారాలు చూపండి

▸ లేకుంటే ఆ పదాన్ని వెనక్కితీసుకోండి: లోకేశ్

▸ పండుల ఆరోపణలపై ఆగ్రహం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా విధానాన్ని కాషాయీకరణ(శాఫ్రనైజేషన్) చేశారని వైసీపీ సభ్యుడు పండుల రవీంద్రబాబు చేసిన ఆరోపణపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాటలను ఉపసంహరించుకోవాలని, శాఫ్రనైజేషన్ ఎక్కడ ఉందో చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శాసనమండలిలో విద్యా కాషాయీకరణ అంశంపై శాసనమండలిలో దుమారం రేగింది. పాఠశాలల హేతుబద్ధీకరణపై బుధవారం ప్రశ్నోత్తరాల్లో వైసీపీ సభ్యుడు పండుల రవీంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వాడివేడిగా చర్చ జరిగింది. బీజేపీ వారు సిలబస్‌ను కాషాయీకరణ చేసి, కొన్ని పాఠ్యాంశాలను తొలగించి, మరికొన్ని జత చేశారని వైసీపీ సభ్యులు అన్నారు. హిందూ మతం, దేవుళ్ల అంటూ పలు అంశాలు పెట్టారని ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాధారమైన ఆరోపణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చదువులోకి రాజకీయాలు, మతాన్ని తీసుకురావొద్దని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వం పిల్లలకు ఇచ్చిన డిక్షనరీలో దేవుడు పదానికి ఇచ్చిన అర్థం ఏమిటో వైసీపీ సభ్యుడు తెలుసుకోవాలని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ డిక్షనరీలో ఇచ్చిన అర్థాన్ని మార్చామని చెప్పారు. విద్యా కాషాయీకరణపై ఆధారాలుంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాషాయీకరణ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్నానని లోకేశ్ చెప్పారు. ఈ అంశంపై విపక్షనేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ రికార్డులు పరిశీలించి సభ్యుడి వ్యాఖ్యలు తప్పుగా ఉంటే తొలగించాలని కోరారు. రికార్డులు పరిశీలించి తొలగిస్తానని చైర్మన్ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఎస్సీ వర్గీకరణపై నేడే తీర్మానం!

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుపై మరో అడుగు ముందుకు పడనుంది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సమర్పించిన నివేదికను ఇప్పటికే ఆమోదించిన ప్రభుత్వం... దీనిపై గురువారం శాసనసభలో తీర్మానం చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సభలో జరిగే ప్రత్యేక చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. వర్గీకరణపై తమ ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ... దీని అమలుకు అనుమతించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సభలో తీర్మానం ప్రవేశపెడతారు. తీర్మానాన్ని ఆమోదించాక కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారు. కేంద్రం నుంచి దీనిపై సానుకూల స్పందన వస్తుందనే భావిస్తున్నారు. కేంద్రం వైఖరి ఎలా ఉన్నా... వర్గీకరణపై ముందుకే వెళ్లాలని, ఆర్డినెన్స్ ద్వారానైనా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. టీడీపీ తొలి నుంచీ ఎస్సీ వర్గీకరణ విషయంలో స్పష్టమైన వైఖరితో ఉంది. ఎన్నికల్లోనూ దీనిపై హామీ ఇచ్చింది.

కలెక్టర్ల సదస్సులో 'మార్పు'

▸ ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహణ

▸ కొత్త ఫార్మాట్ రూపొందించిన సీఎంవో

▸ కార్యదర్శుల ప్రజెంటేషన్లకు స్వస్తి

▸ కలెక్టర్లే 30 శాఖలపై నివేదిక ఇవ్వాలి

▸ ఎంత సమయం పడుతుందో, ఏమో!

▸ మరింత సంక్లిష్టం చేశారనే అభిప్రాయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కలెక్టర్ల సదస్సును రెండు రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 25, 26 తేదీల్లో సచివాలయం వేదికగా సదస్సు జరగనుంది. గతంలో జరిగిన రెండు సదస్సులు ఊహించని రీతిలో సుదీర్ఘంగా సాగాయి. దీంతో ఈసారి కొత్త ఫార్మాట్‌లో సమావేశాలు జరిగేలా ముఖ్యమంత్రి కార్యాలయం అజెండాను తయారుచేసినట్లు తెలిసింది. ఈసారి నిర్దేశిత సమయంలోనే సమావేశాలు సాగుతాయని, కాలయాపన, వృథాకు అవకాశం ఉండదని సీఎంవో వర్గాలు చెబుతున్నట్లు తెలిసింది. అయితే సీఎంవో రూపొందించిన ఫార్మాట్ ప్రకారం నాలుగు రోజులైనా అజెండా పూర్తికాదని సీనియర్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

గతంలో ఇలా..

ఇప్పుడున్న ఫార్మాట్ ప్రకారం ప్రభుత్వంలోని కీలకమైన 30 శాఖలు తమ కార్యకలాపాలు, లక్ష్యాలు, సాధించిన ఫలితాలపై జిల్లాలవారీగా ప్రజంటేషన్ ఇస్తాయి. కలెక్టర్లు తమ శాఖ పరిధిలో కొత్తగా ఏం చేయాలి...ఎలాంటి టార్గెట్‌లు సాధించాలో ఆయా శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు ప్రజంటేషన్ల ద్వారా కోరతారు. ఆ తర్వాత ఆయా అంశాలపై కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకుంటారు. చివరిగా ముఖ్యమంత్రి మాట్లాడుతుంటారు. ఇందులోనే చాలా ఎక్కువ సమయం పోతోంది. ముఖ్యమంత్రి వద్ద మంచిమార్కులు సాధించాలన్న తపనతో కొందరు కార్యదర్శులు...కలెక్టర్లతో తక్షణం చర్చించాల్సిన అవసరం లేని అంశాలు, రోజువారీ శాఖ కార్యకలాపాలు, ఇతర అంశాలను ప్రజంటేషన్లలో చేర్చి గంటల కొద్దీ సమయం తీసుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, సీఎస్‌లు వారించినా కొందరు కార్యదర్శులు గంటలకొద్దీ ప్రజంటేషన్లు ఇచ్చి విలువైన సమయాన్ని తీసుకున్నారు. దీనివల్ల సమావేశాలు అర్ధరాత్రిదాకా సాగాయి.

కొత్త ఫార్మాట్ ప్రకారం..

గతంలో జరిగిన కలెక్టర్ సదస్సుల తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో సీఎం స్పందించారు. ఈ సారి సమయం ఎక్కువ తీసుకోకుండా ప్లాన్‌చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. దీంతో సీఎంవో కొత్త ఫార్మాట్ రూపొందించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఇప్పుడు ఆయా శాఖల కార్యదర్శులు, విభాగాధిపతుల ప్రజంటేషన్లు ఉండవు. జిల్లా కలెక్టర్‌లే 30 శాఖలకు సంబంధించి తమ జిల్లాల్లో గత మూడు నెలల కాలంలో జరిగిన అభివృద్ధి, లక్ష్యసాధనపై ప్రజంటేషన్‌లు ఇవ్వాలి. ఈ లెక్కన, 26 జిల్లాల కలెక్టర్లు ప్రజంటేషన్లు ఇవ్వాలి. దీని వల్ల సగటున ఒక రోజుకు ఐదు జిల్లాల ప్రజంటేషన్‌లే ఇవ్వగలరని సీనియర్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో కలెక్టర్ ఒక్కో శాఖపై ఇచ్చే నివేదికలకు కనీసం 10 నిమిషాల సమయం తీసుకుంటే 30 శాఖలకు కలిపి ఎంత లేదన్నా ఐదు గంటల సమయం పడుతుంది. ఇలా ఒక రోజు చర్చకు 12 గంటల సమయం కేటాయిస్తే, మహా అయితే ముగ్గురికి మించి నివేదించలేరని ఓ సీనియర్ అధికారి చెప్పారు. 26 జిల్లాల ప్రజంటేషన్‌లకు ఎన్ని రోజులు పడుతుందో అని మరో సీనియర్ అధికారి విస్మయం వ్యక్తం చేశారు. ఒక్కో శాఖ వచ్చే మూడు నెలలకు కలిపి ఏఏ అంశాల్లో కొత్త లక్ష్యాలు సాధించాలనుకుంటుందో నిర్దిష్టంగా, సూటిగా, సుత్తిలేకుండా స్పష్టమైన టార్గెట్‌లను కలెక్టర్లకు ఇచ్చి వారితో మాట్లాడిస్తే సరిపోతుందని సీనియర్ అధికారులు సూచిస్తున్నారు.

అందుకే వెయ్యి జరిమానా!

▸ హెల్మెట్ పెట్టుకోడానికి సమస్య ఏమిటి?.. ప్రస్తుతం రద్దీ పట్టణాల్లోనే అమలు

▸ అవగాహన కల్పించాక రాష్ట్రవ్యాప్తం చేస్తాం: హోంమంత్రి అనిత



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): లక్ష రూపాయలు పెట్టి బండి కొన్నవారు రూ.300తో హెల్మెట్ కొని పెట్టుకోడానికి సమస్య ఏమిటి? అని హోం మంత్రి అనిత ప్రశ్నించారు. హెల్మెట్ లేదని జరిమానాలు విధిస్తుండటంపై బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. హెల్మెట్ ధరించని వారిపై భారీగా జరిమానాలు విధించడం సరికాదని టీడీపీ సభ్యులు అన్నారు. పోలీసులు గౌరవంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.వెయ్యి జరిమానా వసూలుపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. దీనిపై హోంమంత్రి మాట్లాడుతూ.. 2020లో కేంద్రం చేసిన చట్టం, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రూ.వెయ్యి జరిమానా వసూలు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రాణమా? వెయ్యి రూపాయలా? అన్న సున్నితత్వాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. పౌరుల్లో మార్పు కోసమే రూ.100 నుంచి వెయ్యికి జరిమానా పెంచినట్టు తెలిపారు. హెల్మెట్ లేకపోవడం వల్ల 2021లో 2,577 మంది, 2022లో 3042 మంది, 2023లో 3108 మంది, 2024లో 3400 మంది చనిపోయారని, క్షతగాత్రులు 2,3 రెట్లు ఎక్కువ అని చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండి ప్రమాదాలు జరిగే పట్టణాల్లోనే హెల్మెట్ తప్పనిసరి చేశామని, అవగాహన సదస్సులు నిర్వహించాక రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు.

గత ప్రభుత్వంలో పెరిగిన ఆర్థిక అసమానతలు

▸ రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారు: యనమల



గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని శాసన మండలి సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. బుధవారం శాసనమండలిలో దవ్యవినిమయ బిల్లుపై ఆయన మాట్లాడారు. 'విద్య, వైద్యం, పౌష్టికాహారాన్ని ప్రజలకు అందించడంలో గత ప్రభుత్వం విఫలమయ్యింది. రోడ్లు పాడయ్యాయి.. మంచినీరు అందలేదు.. ఆర్థిక అసమానతలు పెరిగాయి.. దీనికి కారణం వైసీపీ ప్రభుత్వమే' అని యనమల చెప్పారు. 'రాష్ట్రానికి ఇది క్లిష్ట సమయం. గత ఐదేళ్ల సంక్షోభాన్ని చక్కదిద్దే బాధ్యత ఈ ఒక్క బడ్జెట్‌పైనే ఉంది' అని వ్యాఖ్యానించారు. 'గత ప్రభుత్వంలో డబ్బులు ఖర్చు చేశారుకానీ అవుట్‌పుట్ రాలేదు. ఆర్థిక విధ్వంసం జరిగింది. మైన్స్, ఎక్సైజ్.. ఇలా అన్ని రకాల సంపదను ప్రైవేటుకు అప్పజెప్పి ప్రభుత్వ ఖజానాకు డబ్బు రాకుండా చేసి, జేబులు నింపుకున్నారు. దీనివల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చింది. రాష్ట్రాన్ని దివాళా తీయించి, అప్పులు తప్ప వేరే మార్గం లేకుండా చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పు రూ.14 లక్షల కోట్ల వరకు ఉంటుంది. అప్పులపై వడ్డీ భారమే రూ.30 వేల కోట్లు ఉంది. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దడం కష్టమే. అయితే కేంద్ర ప్రభుత్వ సాయం, చంద్రబాబు సమర్థతతో అధిగమిస్తారన్నారు. వడ్డీ రేట్లు తగ్గించమని బ్యాంకులను కోరాలి. రుణాల చెల్లింపు 20 ఏళ్లు వాయిదా వేసిలా కేంద్ర ప్రభుత్వాని అడగాలి' అని యనమల సూచించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తాం: పయ్యావుల



రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 3,324 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శాసన మండలిలో సభ్యుల ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. ప్రస్తుతం 4,333 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి క్రమబద్ధీకరణపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం కోరామని, మిగిలిన ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా

ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్

▸ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్‌కు జి.సతీశ్‌రెడ్డి.. హ్యాండ్‌లూమ్స్ హబ్‌కు సుచిత్రా ఎల్లా.. ఫోరెన్సిక్ సైన్స్‌కు కేపీసీ గాంధీ.. గౌరవ సలహాదారులుగా నియామకం



సోమనాథ్ | సతీశ్‌రెడ్డి | సుచిత్ర | గాంధీ

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ చైర్మన్ ఎస్ సోమనాథ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. సోమనాథ్‌కు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. వ్యవసాయ పనులు, విపత్తుల నియంత్రణ, ప్రభుత్వ పాలన, పరిశ్రమల నిర్వహణలో స్పేస్ టెక్నాలజీ వినియోగంపై ఆయన ప్రభుత్వానికి సలహాలు ఇస్తారు. అడ్వాన్స్‌డ్ స్పేస్ టెక్నాలజీ హబ్, టెస్టింగ్ సౌకర్యాల ఏర్పాటు, రీసెర్చ్ సెంటర్లు, క్లస్టర్ల ఏర్పాటులో ఆయన సూచనలు అందిస్తారు. కాగా, మరో ముగ్గురు ప్రముఖులను కూడా రాష్ట్ర ప్రభుత్వం గౌరవ సలహాదారులుగా నియమించింది. కేంద్ర రక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారు జి.సతీశ్ రెడ్డిని ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుగా నియమించారు. భారత్ బయోటెక్ ఎండీ, టీటీడీ సభ్యురాలు సుచిత్ర ఎల్లాను హ్యాండ్‌లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ గౌరవ సలహాదారుగా ఎంపిక చేశారు. ఫోరెన్సిక్ సైన్స్ గౌరవ సలహాదారుగా డాక్టర్ కేపీసీ గాంధీని నియమించారు. ఆయన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ ముగ్గురికి కేబినెట్ హోదా కల్పించారు.

ఓట్ల తొలగింపుపై సిట్ రద్దు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఫామ్-7 ఆధారంగా ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై విచారణకు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నెల 3వ తేదీన ఇచ్చిన జీవో 448ను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్లను చేర్చడం, రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారిని తొలగించడం, చనిపోయిన వారి ఓట్లు తొలగించే ప్రక్రియ చేపట్టింది. దీనిని ఆధారంగా చేసుకుని వైసీపీ నాయకులు చాలా నియోజకవర్గాల్లో వేల ఓట్లు తొలగించారన్న ఆరోపణలు వచ్చాయి. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో దాదాపు 24 వేల ఓట్లను ఫామ్-7 ఆధారంగా తొలగించారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆయన అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన వినతిపై సిట్‌ను నియమించింది. ఇలాంటి కేసులు చాలా ఉన్నట్టు ఇటీవల సమీక్షలో ప్రభుత్వం దృష్టికి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేయాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.



అశోక్ లేల్యాండ్ బస్ బాడీ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

ఏపీలో పారిశ్రామిక నవశకం

(మొదటి పేజీ తరువాయి)

దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. విజయవాడ మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ బస్ బాడీ ప్లాంట్‌ను బుధవారం లోకేశ్ ప్రారంభించారు. అంతకు ముందు ఆ కంపెనీ తయారు చేసిన డబుల్ డెక్కర్ బస్సులో ప్లాంటును సందర్శించారు. ఆవరణలో మొక్క నాటారు. రిబ్బన్ కట్ చేసి ప్లాంటును ప్రారంభించారు. తర్వాత అశోక్ లేల్యాండ్ తయారు చేసిన ఎంఎస్ఆర్టీసీ బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో లోకేశ్ మాట్లాడారు. 'టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో 1,360 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్క్‌ను వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసింది. టీడీపీ ప్రభుత్వం 450కు పైగా కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటే వైసీపీ వేధింపుల కారణంగా చాలావరకు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాలేదు. ఆ పాలనలో నష్టపోయిన పారిశ్రామిక సంస్థల్లో అశోక్ లేల్యాండ్ కూడా ఒకటి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలోనే అత్యధిక పన్ను చెల్లింపుదారులలో ఒకరైన అమరరాజా, లులు వంటి భారీ పెట్టుబడిదారీ సంస్థలు తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నాయి. జాకీ వంటి కంపెనీలు కూడా పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో మళ్లీ ఏపీకి 'బ్రాండ్' వచ్చింది. అశోక్ లేల్యాండ్ అత్యాధునిక బస్సు తయారీ కర్మాగారం ప్రారంభోత్సవానికి రావటం గొప్పగా భావిస్తున్నా. పాదయాత్ర సందర్భంగా మల్లవల్లికి వచ్చినపుడు అశోక్ లేల్యాండ్‌ను తిరిగి తీసుకువస్తానని హామీ ఇచ్చాను. ఆ ఎన్నికల హామీ నెరవేరినందుకు సంతోషంగా ఉంది' అని చెప్పారు.

4,800 బస్సుల తయారీ సామర్థ్యం

ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. 'రాష్ట్రానికి కొత్త పెట్టుబడుదారులను ఆహ్వానించే ముందు వారిలో విశ్వాసాన్ని కలిగించే చర్యలు చేపడుతున్నాం. ఈ ప్లాంట్ అశోక్ లేల్యాండ్‌కు మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. కేటాయించిన 75 ఎకరాల్లో మొదటి ఫేజులో 40 ఎకరాల్లో ప్లాంటును అభివృద్ధి చేశారు. ఈ ప్లాంట్‌కు ఏటా 4,800 బస్సులను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. మొదటిదశలో 600 ఉద్యోగాలు వచ్చాయి. రెండో దశలో 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామికవేత్తలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడంపై దృష్టి సారించాం. ఫలితంగా ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్ వంటి ప్రధాన సంస్థలు రూ.7 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. ఈ కంపెనీల ద్వారా 4 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌పైన, మా ప్రభుత్వ నాయకత్వంపైనా నమ్మకం ఉంచినందుకు అశోక్ లేల్యాండ్, హిందూజా గ్రూప్ అధినేతలు అశోక్ హిందూజా, ధీరజ్ హిందూజా, సోమ్ హిందూజా, షేను అగర్వాల్, గణేశ్ మణి, స్విచ్ మొబిలిటీకి చెందిన మహేష్ బాబులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ఇకపై పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఎస్క్రో ఎకౌంట్ ద్వారా నేరుగా జమ చేస్తాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, ఎండీ అభిషిక్త్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, అశోక్ హిందూజా, ధీరజ్ హిందూజా, ఎండీ షేనూ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో.. బయటపడుతున్న సంగమేశ్వరాలయం

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లలితా సంగమేశ్వరాలయం కృష్ణా నదీ జలాల నుంచి నెమ్మదిగా బయటపడుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటి మట్టం 841.10 అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 61.9240 టీఎంసీలు ఉన్నాయి. ఇంకోవైపు.. తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 14,126 క్యూసెక్కుల నీటిని వాడుతోంది. నీటి విడుదల ఇదే తరహాలో కొనసాగితే.. మరో 2-3 రోజుల్లోనే ఆలయ ప్రాంగణంలో నీరంతా అడుగంటిపోయి గర్భాలయంలోని వేపదారు శివలింగ దర్శన భాగ్యం కలిగే అవకాశం ఉంది. డ్యాంలో నీటిమట్టం 838 అడుగులకు చేరితే ఆలయం పూర్తిగా బయటపడుతుంది. మరో అడుగు తగ్గితే ఆలయానికి వెళ్లే మార్గం కూడా సుగమం కానుంది. వచ్చే సోమవారం పూజలు మొదలుపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2023లో జూలై చివరి వారంలో నీటమునిగిన సంగమేశ్వరుడు అదే ఏడాది డిసెంబరులో జలదిగ్బంధం వీడి భక్తుల పూజలందుకున్నాడు. అయితే 2024 జూలై 23న నీటమునిగిన సంగమేశ్వరాలయం ఈ ఏడాది దాదాపు 115రోజుల ఆలస్యంగా బయటపడుతుండడం గమనార్హం. శ్రీశైలం జలాశయంలో 838 అడుగులకు నీటినిల్వలు చేరితే సంగమేశ్వరం గర్భాలయంలోకి నదీజలాలు ప్రవేశిస్తాయి.



కృష్ణా జలాల నుంచి కొద్దిగా బయటపడిన సంగమేశ్వర ఆలయం (ఇన్‌సెట్) దేవతామూర్తుల విగ్రహాలు

గేట్స్ @ ఏపీ

నాడు



30 ఏళ్ల క్రితం బిల్‌గేట్స్‌ను కలిసిన సమయంలో బాబు (ఫైల్)

నేడు



బుధవారం ఢిల్లీలో బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రంగాల్లో ఖర్చు తగ్గించడంతో పాటు విస్తృత ప్రయోజనాలు కలిగేలా పనిచేయనున్నాయి.

అభివృద్ధి లక్ష్యాలు సాధిస్తాం

బిల్ గేట్స్‌తో సమావేశం తర్వాత చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బిల్ గేట్స్‌తో సమావేశం అద్భుతంగా, ఫలవంతంగా జరిగిందని, తమ మధ్య కుదిరిన ఒప్పందం చరిత్రాత్మకమైనదని అభివర్ణించారు. 1995 నుంచీ బిల్ గేట్స్‌తో తనకు స్నేహ సంబంధాలున్నాయని, తమ భేటీ కొనసాగుతూ వస్తోందని గుర్తు చేసుకున్నారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన విషయంలో ప్రజా సంక్షేమం, సేవలు సమర్థంగా, వేగంగా అందించేందుకు అధునాతన టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో ఎదుర్కొనే సమస్యలను కూడా దీనివల్ల పరిష్కరించడం సాధ్యమవుతుందన్నారు. 2047 కల్లా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలనే లక్ష్యానికి తన ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, తమ లక్ష్యం సాధించేందుకు బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో ఏర్పడిన ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. తనకు సమయం ఇచ్చి తన అభిప్రాయాలను పంచుకున్నందుకు, ఏపీ ప్రగతికి మద్దతు ఇస్తున్నందుకు బిల్ గేట్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేందుకు అంగీకరించారని, తిరుపతిని కూడా సందర్శించాలని కోరానని చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ ఎంఓయూ ద్వారా ఏఐ ఆధారిత పాలన, ఆరోగ్య, వ్యవసాయ, విద్యా రంగాల్లో గణనీయమైన ఫలితాలను సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోనే కాదు, దేశంలో కూడా అనుసరించదగ్గ ప్రభావం చూపుతుందని చంద్రబాబు చెప్పారు.

భాగస్వామ్య సంస్థలకు అండ

ఎంఓయూ ప్రకారం ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన రంగాల్లో అధునాతన టెక్నాలజీని అందించే భాగస్వామ్య సంస్థలను గేట్స్ ఫౌండేషన్, ఏపీ ప్రభుత్వం గుర్తిస్తాయని, ఈ సంస్థలకు ఫౌండేషన్ మద్దతు అందిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆరోగ్య రంగంలో అధునాతన టెక్నాలజీ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు వివరించాయి. వ్యవసాయ రంగంలో ఏఐ ఆధారిత సలహా వేదికలతో పాటు వ్యవసాయాన్ని, వనరుల నిర్వహణను సమర్థంగా చేపట్టేందుకు ఉపగ్రహ ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు చేస్తారని తెలిపాయి.

బిల్ గేట్స్‌తో భేటీ అద్భుతం: బాబు

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గేట్స్ ఫౌండేషన్ అధినేత బిల్ గేట్స్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో గేట్ ఫౌండేషన్ సహకారంపై కీలక చర్చలు జరిపామని పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్‌ను సాకారం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. గేట్స్ ఫౌండేషన్‌తో ఈ భాగస్వామ్యం ప్రజలను శక్తిమంతం చేయడంతో పాటు ఈ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని విశ్వసిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ పురోగతికి బిల్ గేట్స్ తన సమయం, మద్దతు ఇచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని బాబు పేర్కొన్నారు.

ఏపీ ఆదర్శంగా నిలుస్తుంది: బిల్ గేట్స్

వినూత్న సాంకేతిక పరిష్కారాల ద్వారా అభివృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక దృక్పథంతో కోరుకోవడం హర్షణీయమని బిల్ గేట్స్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య భాగస్వామ్యం ప్రోత్సాహకరంగా ఉందన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన, స్థానికంగా ఉత్పత్తి చేసే వైద్య పరికరాల ద్వారా అణగారిన వర్గాల ప్రజల జీవితాలను మెరుగుపరచాలని నిర్ణయించడం ముఖ్యమైన విషయమన్నారు.తర్వాత చంద్రబాబు అమరావతి బయలు దేరారు. సమావేశంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, ఎంపీ కృష్ణదేవరాయలు, రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, సీఎంవో అధికారులు, గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేపీ నడ్డాతో గేట్స్ సమావేశం

కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఆరోగ్య రంగంలో భారత్ పురోగతి గురించి చర్చించినట్టు నడ్డా 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ప్రతి జిల్లా కేంద్రంలో ఎంఎస్ఎంఈ నాలెడ్జ్ సెంటర్

▸ నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు: కొండపల్లి

విశాఖపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సమాచారం అందరికీ అందుబాటులో ఉంచేందుకు జిల్లా కేంద్రాల్లో నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఎగుమతులు పెంచాలనే లక్ష్యంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు నీతి ఆయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో బుధవారం సదస్సు నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, విజన్ డాక్యుమెంట్-2030 ప్రకారం లక్ష్య సాధనకు ప్రతి జిల్లా, నియోజకవర్గం, ఆ తరువాత మండల కేంద్రానికి ప్రత్యేక విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తామన్నారు. పాలసీలో భాగంగా జిల్లా కేంద్రాల్లో నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటుచేసి, ఆ జిల్లాలో వ్యవసాయ పంటలు, దిగుబడులు, తయారీ రంగం, పారిశ్రామిక పార్కులు, పరిశ్రమ పెడితే లభించే రాయితీలు వంటి విషయాలన్నీ అక్కడ అందుబాటులో ఉంచుతామన్నారు. నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కు పెట్టాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, దానితో పాటు ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు ముందుకువస్తే వారికి కూడా పారిశ్రామిక పార్కులు నెలకొల్పడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఇలా నియోజకవర్గానికి కనీసం మూడు పార్కులు ఉండేలా చూస్తామన్నారు.

మోటుపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మించండి

▸ కేంద్రమంత్రి సోనోవాల్‌కు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వినతి

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం మోటుపల్లి-పెద గంజాం మధ్య ఉన్న తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌక తయారీ కేంద్రం స్థాపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన నాలుగో జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ సమావేశానికి హాజరైన మంత్రి ఈ మేరకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్‌కు వినతిపత్రం అందజేశారు. పోర్టు, నౌక తయారీ కేంద్రం స్థాపనతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

బతుకుతానో లేదో!

▸ వైసీపీ నుంచి ప్రాణ హాని ఉంది..

▸ జైల్లో తోటి నిందితులే భయపెట్టారు!

▸ వివేకా హత్య కేసులో ఏ2 సునీల్ ఆందోళన



కడప క్రైం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో ముడిపడిన వ్యక్తుల వరుస మరణాల నేపథ్యంలో... మరో నిందితుడు తనకు ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో రెండో నిందితుడు (ఏ2)గా ఉన్న సునీల్ యాదవ్ బుధవారం కడప జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను కలిశారు. తనకు రక్షణ కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తననూ చంపేస్తారేమో అని ఆందోళన వ్యక్తం చేశారు. జైల్లో 39 నెలలు ఉన్న సమయంలో తనను కొందరు బెదిరించారని తెలిపారు. ఇదే కేసులో జైల్లో ఉన్న వారు, అప్పటి అధికార పార్టీ వారు, వారి అనుచరులు బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు. "39 నెలలు జైల్లో ఉండి బయటకు వచ్చాక కూడా నరకం అనుభవిస్తున్నాను. జైల్లో పడ్డ ఇబ్బందులపై ఇంతవరకు ఎక్కడా నోరు విప్పలేదు. ఇప్పుడు మాట్లాడుతుంటే కొందరికి నచ్చడం లేదు. గత ప్రభుత్వం వల్లే ఇబ్బందులు పడుతున్నాను. ఆ పార్టీకి (వైసీపీ) చెందిన వారి నుంచే నాకు ప్రాణహాని ఉంది. వారి పేర్లు కూడా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన సానుకూలంగా స్పందించారు" అని సునీల్ యాదవ్ తెలిపారు. రెండ్రోజుల క్రితం తన ఇంటి వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వానికి తొత్తులుగా ఉన్న వారు తమను ఇబ్బందికి గురిచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 'వారి వద్ద డబ్బు, హోదా ఇప్పుడు ఉంటాయేమో! రేపు ఉండవు కదా! అలాగే నేను బతుకుతానో లేదో కూడా తెలియదు' అని వ్యాఖ్యానించారు. దస్తగిరి విషయం మాట్లాడదలచుకోలేదన్నారు. తన పైన, నా తల్లి పైన ఆరోపణలు చేస్తూ, వక్రీకరణలతో తీసిన 'హత్య' సినిమాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దానిని గతంలో అధికారంలో ఉన్న పార్టీ నిర్మించిందన్నారు. "వివేకా హత్యలో 8 మందిపై కేసు నమోదైంది. కానీ నలుగురే హత్య చేసినట్లు సినిమాలో చూపించారు. నా గురించి సినిమాలు చేసుకోవచ్చు.. రాసుకోవచ్చు. కానీ నా తల్లినీ ఇందులోకి లాగారు. వాళ్ల తల్లులపై కూడా ఇలాగే వస్తే.. వారు, వారి భార్యలు, వారింట్లో ఆడవారు బయట ఎలా తిరగగలుగుతారు" అని నిలదీశారు.

డాక్టర్ రెడ్డీస్‌లో చోరీ

▸ కోట్లు విలువ చేసే మాలిక్యూల్ దొంగతనం.. యాజమాన్యం ఫిర్యాదు

▸ మధుమేహం నియంత్రణ పరిశోధనల్లో అత్యంతకీలకమది



రెడ్డీస్ లేబోరేటరీ పరిశ్రమ

రణస్థలం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వయస్సుల వారినీ ఇబ్బంది పెడుతున్న మధుమేహం వ్యాధి నియంత్రణపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ మధుమేహం టైప్ 2పై చేసిన పరిశోధనలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఇందుకు సంబంధించి ఒక మాలిక్యూల్‌ని ఆవిష్కరించింది. పౌడర్ రూపంలో ఉన్న దాన్ని మరింత అభివృద్ధి చేసి మాత్రలు, ఇంజక్షన్ల రూపంలో తేవాలని నిర్ణయించింది. ఆ పౌడర్‌ను శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలోని రెడ్డీస్ ల్యాబ్‌లో భద్రపరచింది. రూ.కోట్ల విలువ చేసే ఆ పౌడర్ యూనిట్ నుంచి మాయమైంది. పరిశ్రమ ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. .

మన దేశంలో అందుబాటులో తేవాలని..

ఐరోపా, దక్షిణాఫ్రికా దేశాల్లో మధుమేహం వ్యాధి నియంత్రణకు అనేక రకాల మందులు, సెమాగ్లూటైడ్ వంటి ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. భారతదేశంలో ప్రత్యేక మందులు అందుబాటులోకి తేవాలని ఫార్మా కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా డాక్టర్ రెడ్డీస్ అత్యాధునిక పరిశోధన పరిజ్ఞానంతో 'పెప్టైడ్' తరహా మాలిక్యూల్‌ని పౌడర్ రూపంలో అభివృద్ధి చేసింది. టైప్ 2 మధుమేహాన్ని అత్యంత సమర్థవంతంగా నియంత్రించగలిగేలా ఈ యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రెడెంట్(ఏపీఐ)ని ఫార్ములేట్ చేసినట్లు సమాచారం. ఈ ఫార్ములా తయారీకి యాజమాన్యం రూ.కోట్లు వెచ్చించినట్లు తెలిసింది. మొత్తం 450 గ్రాముల పౌడర్‌ను వేర్వేరు ప్యాకెట్లలో జాగ్రత్తగా భద్రపరిచారు. గత నెల 17న దీనిని ఉంచగా... ఈ నెల 3న అదృశ్యమైనట్లు గుర్తించారు. ఘటనపై డాక్టర్ రెడ్డీస్ సైట్ హెడ్ గణేశ్ శంకరన్ డ్రగ్ అథారిటీస్‌కు, శ్రీకాకుళం జిల్లా జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ ఎలాంటి క్లూ లభ్యంకాని ఈ కేసు వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.

భద్రత డొల్ల?

కట్టుదిట్టమైన భద్రత. నిఘా ఎక్కువగా ఉన్న కంపెనీలో రూ.కోట్ల విలువ చేసే ప్రజారోగ్యానికి సంబంధించిన డ్రగ్ చోరీకి గురికావడం ఆందోళనకు గురి చేస్తోంది. దీని వెనుక విద్రోహ చర్య ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు మందుల పరిశోధనల్లో ఫార్మా కంపెనీల మధ్య విపరీతమైన పోటీ ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్కడ పనిచేసేవారిని లోబరచుకుని ఈ ఘటనకు పాల్పడ్డారా అన్న సందేహమూ బలంగానే ఉంది. ఈ ఘటనపై డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం తీవ్రంగా స్పందించినట్టు తెలుస్తోంది. ఆ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిపై వేటు వేసినట్టు సమాచారం. ఘటన జిల్లా ఎస్పీ దృష్టికి వెళ్లడంతో ఆయన విచారణ చేపట్టారు. పోలీసులు అక్కడ పనిచేసే సిబ్బంది కదలికలపై దృష్టి పెట్టారు. బయో పరిశోధనలకు సంబంధించిన అంశం కావడంతో డ్రగ్ అథారిటీ సైతం తీవ్రంగా పరిగణిస్తున్నట్టు సమాచారం. కాగా, ఫిర్యాదు వాస్తవమేనని, కేసు దర్యాప్తు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్ఐ ఎన్ చిరంజీవి తెలిపారు.



సముద్రం ఒడ్డున లోతుగా పునాదుల నిర్మాణం

భీమిలి బీచ్‌లో 10 అడుగుల లోతు పునాదులు!

▸ సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అడ్డగోలు ఉల్లంఘన

విశాఖపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి భీమిలి బీచ్‌లో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన పునాదులు చూసి అధికారులు అవాక్కవుతున్నారు. సీఆర్‌జడ్ పరిధిలో అనుమతులు లేకుండా 10 అడుగుల లోతున పునాదులు నిర్మించారు. పైన ప్రహరీ కట్టారు. హై కోర్టు ఆదేశాల మేరకు ఈ పునాదులను పూర్తిగా తొలగించడానికి వారం రోజుల నుంచి భారీ యంత్రాలతో పనులు చేస్తున్నారు. పునాదుల కోసం కింద బెడ్, దాని కింద బండరాళ్లు కూడా వేశారని తేలింది. దీనిపై నివేదిక ఇవ్వడానికి ఎన్ఐఓ అధికారులు నిర్ణీత ఫీజు చెల్లించాలని సూచించగా జీవీఎంసీ అధికారులు రూ.17 లక్షలు చెల్లించినట్టు తెలిసింది. తొలగింపు పనులు పూర్తి చేసి ఈ నెల 26కల్లా హైకోర్టుకు నివేదిక ఇవ్వాల్సి ఉంది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.